జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 5 సంచిక - 03 పక్షపత్రిక ఫిబ్రవరి 1-15, 2014



రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లుపై

అసెంబ్లీలో డా॥ జేపీ ప్రసంగ పాఠం






## మద్యం బాధితులకు భరోసా

## సత్యాగ్రహం

# మద్యం బాధితుల కోసం లోక్‌సత్తా మహోద్యమం







హైదరాబాద్‌లో...



చిలకలూరిపేటలో...



చీపురుపల్లిలో...



పలాసలో...



పాలకొండలో...



శ్రీకాకుళంలో...



కోదాడలో...

జన రాజకీయం కోసం...

లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఫిబ్రవరి 1-15, 2014

సంపుటి - 5 సంచిక - 03

## లోపలి పేజీల్లో...

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై అసెంబ్లీలో జేపీ ప్రసంగం ....................6

రాష్ట్రపతికి లోక్‌సత్తా లేఖ....................24

అసెంబ్లీ ఎన్నికలకు లోక్‌సత్తా వ్యూహం.....26

లోక్‌సత్తా అభ్యర్థుల తొలి జాబితా ...........27

మద్యంపై మహోద్యమం....................29

జిల్లా వార్తలు ....................34

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

### సంపాదక వర్గం

పి. రవిమారుత్

బండారు రామ్మోహన్‌రావు

ఓంకార్

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : కె. శ్రీలత

ఫోటోలు : ఎస్. సంజీవ్ కుమార్

# ఈ పక్షం చాట్ మసాలా

1. **డౌన్ కౌంట్**
   "ఎన్నికలను ఇక 70 రోజులే వున్నాయి" - చంద్రబాబు
   **రోజులు దగ్గర పడుతున్నాయని ముందే తెలిస్తే ఆందోళన తప్పదు లెండి**

2. **సత్తు రూపాయి**
   "పార్టీ మారే ప్రసక్తే లేదు" - వైకాపా నేత సుజనకృష్ణ
   **అది మారదు లెండి - ఇంతకీ సత్తు రూపాయి పార్టీనా.. తమరా**

3. **బురద కాలు**
   "జగన్ సంస్కార హీనుడు" - రఘురామరాజు
   **దిగితేగాని బురద తెలియదా..... పిచ్చి మారాజు**

4. **రగడ పొందు**
   "ఎన్నికల తర్వాత ప్రాంతీయ పార్టీలతో అవగాహన" - కరాత్, సి.పి.యం.
   **ఎన్నికల్లో రణం తర్వాత పొత్తు... భేషుగ్గా వుంటుంది రగడ పొత్తు**

5. **అసత్యవాణి**
   "తిరుగుబాటు అభ్యర్థులు ఉపసంహరించుకోవాలి" - బొత్స
   **తిరుగుబాట్లు లేకపోతే కాంగ్రెస్ ఎందుకు సార్**

6. **ఉభయ తారకం**
   "16 స్థానాల్లో అంతర్గత ఎన్నిక ద్వారా అభ్యర్థుల ఎంపిక" - కాంగ్రెస్, అజయమాకెన్
   **ముందస్తు కుస్తీలో గెలిస్తే టికెట్.. ఓడిన వాళ్లు జంప్‌కి తగిన సమయం దొరుకుతాయి**

7. **జగన్ మాత**
   "రాష్ట్రాన్ని విభజించడానికి సోనియా ఎవరు?" - జగన్
   **కాదంటే శిక్షిస్తుంది.. ఔనంటే రక్షిస్తుంది**
   **ఆమె జగన్మాత నాయనా.. తమకు తెలియంది కాదుగా**

8. **మాచ్ ఫిక్సింగ్**
   "లాస్ట్ బాల్ సిక్సర్" - ఆనం వివేకానందరెడ్డి
   **అంత సంబరం దేనికి... అంతా మాచ్ ఫిక్సింగేనట గదా!**

9. **ఎప్పటికెయ్యది**
   "కొత్త పార్టీ గురించి ఆలోచించట్లేదు" - ముఖ్యమంత్రి
   **ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నికలుంటే కాంగ్రెస్‌లో... విభజన జరిగితే కొత్త కుంపటి**

10. **తొందర కోయిల**
    "నేను మరణ సర్టిఫికేట్ ఎక్కడ తీసుకోవాలి" - ఆనం రామనారాయణ రెడ్డి
    **ఆవేశంలో తొందరపడి ముందే సర్టిఫికేటు తీసేసుకోకండి**

11. **జంప్‌కు తోవ**
    "వై.కా.పా మునుగుతున్న నావ" - అడుసు మిల్లి
    **తమలాంటి పెద్దలంతా ఎక్కిన తర్వాత మునగకుండా వుంటుందా?**

❖❖❖




*This is a table with modified 'Drawer'... This opens on both sides.*
*You may drop the amount there itself.*

# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

**ఫోన్ నంబర్లు :**
***040- 23311817, 23311819,***
***23311820, 23312829***
ఫ్యాక్స్ : ***040-23310612***
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# మనుగడ రాజకీయం

## సంపాదకీయం

రాష్ట్రంలో ఇప్పుడు పార్టీల వ్యవస్థ కుప్పకూలింది. అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీ రెండు ముక్కలైంది. ప్రతిపక్షంగా వున్న తెలుగుదేశం పార్టీ ఒకటిగానే నటిస్తూ రెండు వర్గాలుగా తలపడుతున్నాయి. భారతీయ జనతా పార్టీ స్థితి ఇలానే వుంది. తెలంగాణాలో తెరాస, సీమాంధ్రలో వైకాపాలు ఉప ప్రాంతీయ పార్టీలుగా వ్యవహరిస్తున్నాయి. రాష్ట్రంలో ఒక్క లోక్‌సత్తా పార్టీ మాత్రమే ప్రాంతాలకు అతీతంగా అన్ని ప్రాంతాల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ ఒకే పార్టీగా ఒకే విధానాన్ని ప్రకటించేదిగా నిలబడింది. పార్టీలన్నీ అంతర్గతంగా ఏకాభిప్రాయంతో వుంటే ప్రస్తుత పరిస్థితి దాపురించేది కాదు.

రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితికి పూర్తిగా ఈ పార్టీల అవకాశవాద రాజకీయమే కారణం. రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టింది ఈ పార్టీలు. ఈ సంక్షోభాన్ని పెంచి పోషించింది ఈ పార్టీలు. ఇప్పుడు పరిష్కారం సాధించలేక చతికిలపడినవి ఈ పార్టీలు. రాష్ట్ర విభజనను అనివార్యం చేసిన ఈ పార్టీలే ఇప్పుడు నువ్వు దొంగ అంటే నువ్వు దొంగ అంటూ ఇతరుల మీద ఈ బాధ్యతను నెట్టాలని చూస్తున్నాయి. తప్పించుకు తిరగడానికి అడ్డదారులు వెతుకుతున్నాయి. దీనికంతటికీ అసలు కారణం ఈ సంక్షోభానికి పరిష్కారాన్ని కనుగొనే సత్తా ఈ పార్టీలకు లేదు. ప్రజలముందుకు ఒక పరిష్కారంతో వెళ్లే ధైర్యం లేదు. అందుకే రాష్ట్రాన్ని రావణాసురిని కాష్టంలా తగలేస్తున్నారు. రాష్ట్రం తగలబడిపోతుంటే బొగ్గులు ఏరుకోడానికి అందరూ సిద్ధం అయ్యారు.

ఏనుగులాంటి సమస్య వచ్చి కూర్చుంటే శాసనసభ దానిని చర్చించకపోవడం గుడ్డివాళ్ల తంతు అవుతుందని లోక్‌సత్తా పదేపదే శాసనసభలో, బైట గత నాలుగేళ్లుగా వాదిస్తున్నా పట్టించుకున్న పార్టీ ఒక్కటి కూడా లేదు.

ఇప్పుడు తగుదునమ్మా అంటూ ఒక్కొక్కరూ తమ మనుగడ రాజకీయం ప్రారంభించారు. ఒకనాడు ఈ సమస్య సభలో తేలాల్సిన విషయం కాదు. కేంద్రం తేల్చాలని మాట్లాడిన ముఖ్యమంత్రి ఇప్పుడు పూర్తిగా ఎదురు వాదన చేస్తున్నారు. ఈ రాష్ట్ర సమస్య ఇక్కడే తేలాలంటున్నారు. సరే తేల్చే మార్గం ఎంచుకోవడానికి బదులు చర్చ సాగకుండా బిల్లును తిప్పి పంపే తీర్మానంతో సరిపెట్టుకున్నారు. ఒకే రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే ఒక ప్రాంతంలో టి-కాంగ్రెస్ మరో ప్రాంతంలో సమైక్య కాంగ్రెస్‌గా ఎన్నికల గట్టెక్కాలని భావిస్తున్నారు.

ఇదే దారిలో తెలుగుదేశం వ్యవహరిస్తున్నది. అసెంబ్లీలో రెండు ముక్కలుగా మాట్లాడింపజేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఇరు ప్రాంతాలలో ప్రాంతీయ ముసుగులో గెలుపొందాలని చూస్తున్నారు.

కాంగ్రెస్‌కు ఇరు ప్రాంతాలలో లబ్ధిచేకూరని విధంగా బి.జె.పి. వ్యవహరిస్తున్నది. ఇక తెరాస, వైకాపాలు దీనిని ఎన్నికల తర్వాతకు వాయిదా వెయ్యాలన్న వైఖరిని చెప్పకనే చెబుతున్నాయి. ఎతావాతా రాష్ట్రంలో సంక్షోభానికి తెరదించే ప్రయత్నాలను ఈ పార్టీలు పైకి చెప్పకపోయినా ఆచరణలో సిద్ధమైనాయి. ఇదంతా ఈ పార్టీల మనుగడ రాజకీయం. ఈ మనుగడ రాజకీయం తెలుగు మాట్లాడే ప్రజల్ని మరింత ముంచుతుంది. రాబోయే ఎన్నికల్ని ఈ పార్టీలు మరింత ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడానికి వేదికను చేసుకుంటాయి. అప్పుడు సమస్య మరింత జటిలం అవుతుంది. పరిష్కారం మరింత దూరం అవుతుంది.

ఈ ఎన్నికల్లో పార్టీలు ఆడే ప్రాంతీయ విద్వేష ఆటను ఆడనీయకూడదు. ఎన్నికలు పార్టీల సంకుచిత ప్రయోజనాల కోసం కాదు. ఆ పార్టీ నేతలు గెలవడం కోసం కాదు. ఎన్నికలు ప్రజల కోసం. వారు ఆశావహ భవిష్యత్తుని సాధించుకోవడం కోసం. ఈ దివాళాకోరు పార్టీలను పట్టుకుని వేలాడితే ప్రయోజనం వుండదు. వీటిని వదిలించుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు వుంటుంది. అందుకు ప్రజలు సిద్ధం కావాలి. జన రాజకీయానికి జనం పూనుకోవాలి. ♦

# ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై అసెంబ్లీలో డా॥ జేపీ ప్రసంగం

**(జనవరి 18,2014)**

అధ్యక్షా, ఈవేళ ఈ సభలో మళ్లీమళ్లీ తలెత్తుతున్నటువంటి ఈ సంక్షోభ వాతావరణం, ఉద్వేగభరిత వాతావరణమే, ఈ సభా నిర్వహణలో మీకెదురవుతున్న సమస్యలే ఒకరకంగా కోట్ల మంది తెలుగు ప్రజల మనసుల్లో ఎంతటి ఆందోళన, ఆక్రోశం, భయం, అసహనం చోటుచేసుకున్నాయో చెప్పే నిలువెత్తు సాక్ష్యం. అధ్యక్షా, కొన్నేళ్లుగా ఈ సభలో ఏ పార్టీవారైనా అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా, ఏ ప్రాంతంవారైనా ఆందోళన పడని వారు ఒక్కరు కూడా లేరు. అలాగే తెలుగునాట 9 కోట్లమంది ప్రజలూ, ఈ రాష్ట్రం బైట, దేశంలోని ఇతర ప్రాంతాలలో కావచ్చు, ప్రపంచంలో కావచ్చు, తెలుగు మాట్లాడే ప్రజలందరిలో కూడా ఎన్నో ఆశలు, భయాలు, ఆందోళనలు చోటు చేసుకున్నాయి. ఈవేళ తెలుగు నేల తల్లడిల్లుతున్నది. ఆంధ్రావనిలో రాజకీయం అంపశయ్య మీద ఉన్నది. పచ్చని నేలలో ఏళ్ల తరబడి చిచ్చు రగిలింది. ఈ చర్చ కేవలం తెలుగు ప్రజల భవిష్యత్తు గూర్చి మాత్రమే కాదు అధ్యక్షా, మన రాష్ట్రంలో ఉన్న 9 కోట్ల మందిలో దాదాపు 50 లక్షల మంది ఇతర భాషలు మాట్లాడేవారున్నారు. పార్టీలకి, పక్షపాతాలకి, ఎన్నికల ఎత్తుగడలకి అతీతంగా చర్చ జరగటం అవసరం. అధ్యక్షా, ఈ 13వ శాసనసభలో ఏ ముహూర్తాన అడుగుపెట్టామోగానీ ఈ నాలుగున్నరేళ్లుగా ప్రతి పార్టీలో, ప్రతి సభ్యుని మనసులో కూడా ఈ సభలో ఏ అంశం మీదా సమగ్రమైన చర్చ జరిగే అవకాశం లేకపోయిందనే లోతైన ఆవేదన గూడుకట్టుకుని ఉంది. ఈవేళ తెలుగునాట కలతచెందని హృదయం లేదు. ఈ సభలో ఉన్న చాలామంది గౌరవ సభ్యుల్లాగానే నావరకూ నేను కొన్ని వందల రాత్రులు నిద్రలేకుండా గడిపాను. కలతతో, ఆందోళనతో, ఆర్తితో.



అధ్యక్షా, వ్యక్తిగతంగా కొంచెం నా గురించి చెప్పుకుంటే, నా శైశవ దశ నడిచింది మహారాష్ట్రలో. నాగ్‌భేడ్ అనేటువంటి చిన్న పట్టణంలో. విద్యాభ్యాసం కోస్తాంధ్రలో. ఐఏఎస్‌కి వచ్చాక ట్రైనింగ్ పొందింది కరీంనగర్ జిల్లాలో. గ్రామంలో ట్రైనింగ్ పొందింది నెలరోజులపాటు కాళేశ్వరంలో. త్రిలింగాలలో ఒకటైనటువంటిది. మన.. ప్రస్తుతం మంత్రిగారో, మాజీ మంత్రిగారో నాకు కొంచెం కన్ఫ్యూజన్‌గా ఉంది, మన మంథని నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీధర్ బాబు గారి నియోజకవర్గం మందలపర్రి మండలంలోని కాళేశ్వరంలో. త్రిలింగాలలో ఒకటి. అధ్యక్షా, ఎన్నికైనది హైదరాబాద్ నగరం నుంచి. నేనెవడ్ని? తొలుత నేను కోస్తాంధ్రలోని నా తల్లిగారి గ్రామంలో చదువు కోసం వెళ్తే వీడు మరాఠీ వాడురా అని ఆటపట్టించారు. ఎందుకంటే, తెలుగు రాదు నాకు. మొట్టమొదట నేను మాతృభాషగా నేర్చుకున్నది మరాఠీ భాష. వీడు మరాఠీ వాడురా అన్నారు తల్లిదండ్రులు కూడా నాతో లేకపోవటం చేత. అధ్యక్షా, మన అస్తిత్వం అన్నది మనకి అవసరమే. కానీ శృతిమించిన అస్తిత్వం ప్రమాదకరమవుతుంది. కోట్లాదిమంది ఈ దేశంలో కులాన్ని, మతాన్ని, ప్రాంతాన్ని, నిజానికి జాతీయతని అధిగమించే ప్రయత్నాన్ని చేస్తున్నారు, చేయాలి. ప్రతి మనిషికీ నాది అన్నది కావాలి. ఆ మేరకు అస్తిత్వం కావాలి. కులం అవసరం, మతం అవసరం, ప్రాంతం అవసరం, భాష అవసరం, ప్రాంతీయతా అవసరం, కానీ అది ద్వేషంగా, అసూయగా, ఆధిపత్యంగా ఆ అస్తిత్వం గనక రూపొందినట్టయితే, అది జాతి మొత్తానికీ నష్టమవుతుంది. మన బిడ్డల భవిష్యత్తుకి అశనిపాతమవుతుంది. త్రికరణశుద్ధిగా ఒక వ్యక్తిగా, ఒక పౌరునిగా, ఒక పౌరసమాజ ఉద్యమ నిర్మాతగా నేను నిరంతరం అస్తిత్వాలకు అతీతంగా ఈ దేశంలో పౌరుడిగా, అంతకుమించి మానవాళి మొత్తానికీ చెందినటువంటి ఒక మనిషిగా నిరంతరం నిలబడే ప్రయత్నం చేస్తున్నాను. అధ్యక్షా, అలాంటి ఒక పౌరుడిగా, ఓ మనిషిగా నా మనసులో ఉన్నటువంటి కొన్ని మాటల్ని నిర్ద్వంద్వంగా ప్రకటించే ప్రయత్నం చేస్తున్నాను.

అధ్యక్షా, తెలుగునాట ఉమ్మడి రాష్ట్రం ఏర్పడింది 1956లో. ఒకే రాష్ట్రం, ఒకే చరిత్ర, ఒక సంస్కృతి అన్న కారణంగా. అయితే ఏం జరిగిందంటే, రాష్ట్రం ఏర్పడటంతోటే రెండు రకాలైనటువంటి

భావాల మధ్య, రెండు రకాల సమాజాల మధ్య తొలినుంచీ సంఘర్షణ ఏర్పడింది. ఒకపక్కన తెలంగాణ ప్రాంతంలో అప్పుడప్పుడే అణచివేసిన ఫ్యూడల్ వ్యవస్థ ప్రభావం నుంచి బైటపడే ప్రయత్నం చేసి స్వేచ్ఛ, స్వతంత్రం రెక్కలు విప్పుకుంటున్న తెలంగాణ ప్రాంతంలో సమాజం ఒక స్థాయిలో ఉన్నది. మిగిలిన ప్రాంతం బ్రిటీషు వాళ్ల పాలనలో వలస పాలనలో ఉన్నా కూడా తెల్లవాళ్ల పుణ్యమా అని కొన్ని ఉదార భావాలు, విద్య, కొద్దిపాటి హక్కుల్ని ముందుగా పుచ్చుకున్నటువంటి రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతంలో స్వతంత్ర భారతంలో తొలి ఎంటర్‌ప్రెన్యూర్ వ్యవస్థకి ఈ స్వేచ్ఛను ఉపయోగించి ఆర్థికంగా ఈ దశలో పునాదులు వేస్తున్నారు, ఆ క్రమంలో ఉన్నారు. ఈ రెంటికీ మధ్య- ఫ్యూడల్ వ్యవస్థ నుంచి బైటపడుతున్న ఒక తరం, అంతకుముందే దాన్నుంచి బైటపడి కొన్ని ఫలితాల్ని పొంది పారిశ్రామికీకరణ ఫలితాల్ని పొందుతున్న తరం- ఈ రెంటికీ మధ్య సంఘర్షణే ఈ 56, 57 ఏళ్లుగా మన రాష్ట్రంలో ఎన్నో సంఘర్షణలకి దారితీసింది. ఈ సంఘర్షణల్ని సామరస్యంగా ఒక సింథసిస్‌గా మలిచే ప్రయత్నంలో ఈ రాష్ట్రంలో గత 56 ఏళ్లుగా గట్టి ప్రయత్నం జరిగిందంటే నేను నమ్మను. వీరా వారా పేర్లు అనవసరం. దురుద్దేశం కూడా కాదు. కానీ విఫలమైన మాట వాస్తవం. లేకపోతే మళ్లీమళ్లీ ఈ సమస్యలు రావు. ఇది చరిత్ర, సంస్కృతుల మధ్య సమస్య కాదు. ఇది ప్రధానంగా రాజకీయ సమస్య.

విభిన్న వర్గాల ప్రజల ప్రయోజనాలను సమన్వయం చేయటమే రాజకీయం ప్రధాన లక్ష్యం. అధ్యక్షా, ఒక ఇంట్రెస్ట్ గ్రూప్‌కి, ఒక ప్రెషర్ గ్రూప్‌కి మధ్యనున్న తేడా- ఒక రాజకీయ పార్టీ వివిధ వర్గాల ప్రయోజనాలను సమన్వయం చేసే ప్రయత్నం చేస్తుంది. దాన్నే రాజకీయ శాస్త్రవేత్తలు ఇంట్రెస్ట్ యాగ్రిగేషన్ అని చెప్పి అంటుంటారు. కేవలం ఒక్క అంశం కోసం ఉంటే అది రాజకీయ రాజకీయ పార్టీ కాదు. రాజకీయ పార్టీలు గత 57 ఏళ్లుగా విభిన్న వర్గాల ప్రయోజనాలను సమన్వయం చేయటంలో ఈ అంశంలో విఫలమయ్యాయి కాబట్టే ఈ సమస్య మళ్లీమళ్లీ వస్తోంది మన ముందుకు. వైఫల్యాలు చిన్నవే రాజకీయంగా. కానీ దానివల్ల కలిగిన వైషమ్యాలు చాలా పెద్దవి. అధ్యక్షా, నేను చాలా జాగ్రత్తగా రాత్రే జెంటిల్‌మెన్స్ అగ్రిమెంట్, 1956లో పెద్దలంతా కూడా కూర్చుని ఆనాడు చేసిన ఒప్పందాన్ని జాగ్రత్తగా పరిశీలించాను. దాన్లో సంతకాలు చేసినవారు ఎవరు- బెజవాడ గోపాలరెడ్డిగారు, ఆనాడు ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగారు, గౌతు లచ్చన్న గారు, ఈ సభలోను, ఈ రాష్ట్రంలోనూ మనందరి మనసుల్లో విశిష్ట స్థానం దక్కించుకున్న పెద్దలు, అల్లూరి సత్యనారాయణ రాజుగారు. తెలంగాణ ప్రాంతం నుంచి బూర్గుల రామకృష్ణా రావు గారు,ఆనాటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు, కొండా వెంకట రంగారెడ్డి గారు, తెలంగాణ ప్రాంతంలో అత్యంత సీనియర్ నాయకులు, మర్రి చెన్నారెడ్డిగారు, తర్వాత రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేశారు, మనందరికీ తెలుసు. ఇక్కడ ప్రధానంగా 7 అంశాలలో ఒప్పందం కుదుర్చుకున్నారు, నిజానికి దాన్లో 5 అంశాలలో ఆ ఒప్పందం అమలైంది. డొమిసైల్ రూల్స్- ముల్కీ, ఆ తర్వాత 6 పాయింట్ ఫార్ములా దాన్ని అమలుచేయటం జరిగింది. అయితే 610 జీవో ప్రకారం లేదా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం నియామకాల్లో ఇబ్బందులున్నాయనే విషయం మళ్లీ మళ్లీ ప్రస్తావనకు వచ్చింది. నిన్న కూడా ప్రస్తావనకు వచ్చింది. ఖచ్చితంగా కొన్ని వేల ఉద్యోగాల విషయంలో కొన్ని పొరపాట్లు దొర్లినాయి. దాన్ని సవరించే ప్రయత్నం జరిగింది. ఆ ప్రయత్నం పూర్తిగా నమ్మశక్యంగా, ఆమోదించే స్థాయిలో జరగలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఉర్దూకి ప్రత్యేకంగా ఒక భాషగా స్థానం ఇవ్వాలని చెప్పి అన్నారు. భారతదేశంలో అధికార భాష కాకుండా ఉర్దూలా మరో భాష చెలామణి అవుతున్న అతికొద్ది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. కాబట్టి అది కూడా అమలైంది. అలాగే రిట్రెంచ్‌మెంట్ ఏదైనా జరిగితే, రాష్ట్ర విలీనం కారణంగా, ఆ రిట్రెంచ్‌మెంట్‌లో ఒక ప్రాంతం వారు ఎక్కువ ఉన్నారు, ఒక ప్రాంతం వారు తక్కువ ఉన్నారు అనే వివక్ష లేకుండా అందర్నీ సమానంగా చూడాలన్నారు. ఆ రకంగానే జరిగింది. దాన్లో ఇబ్బందులేవీ జరగలేదు. నా దృష్టిలో రిట్రెంచ్‌మెంట్‌లో కూడా పెద్దగా వయొలేషన్లు జరగలేదు రాష్ట్రంలో. ఇకపోతే ప్రభుత్వం పెట్టే ఖర్చు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతానికి న్యాయంగా, జనాభాను బట్టి పంచే ప్రయత్నం చేయాలేగానీ అధికారం ఉందనో, సంఖ్యాబలం ఉందనో ఒక ప్రాంతానికే కేటాయించకూడదని శాసనసభ్యులు కోరారు. మొత్తం మీద చూస్తే గత 56 ఏళ్లలో జనాభాను రాయలసీమ – కోస్తాంధ్ర, తెలంగాణలో బట్టి 60, 40 శాతంలోనే ఖర్చయింది. బహుశా తెలంగాణ ప్రాంతంలో కొంచెం ఎక్కువే ఖర్చయింది హైదరాబాద్ ఉన్న కారణంగా.

విద్యావకాశాలు, సాంకేతిక విద్యావకాశాల విషయంలో అధ్యక్షా, ఒక 30 ఏళ్లపాటు తెలంగాణ ప్రాంతంలో ఆలస్యం జరిగింది. 1980వ దశకం నుంచి తెలంగాణ ప్రాంతంలో విద్యకు అవకాశం కలిగింది తప్ప, పాఠశాల విద్య కోసమని, అంతకుముందు ఖచ్చితంగా తగిన ఏర్పాట్లు జరగలేదు. ఈ దేశంలో ఇప్పటికి కూడా విద్యను పట్టించుకోవటం లేదు మనం. కానీ ఆ తర్వాత ఆ ప్రయత్నం జరిగింది. కానీ అప్పటికే దురదృష్టవశాత్తూ, ప్రభుత్వ విద్య ప్రాధాన్యం తగ్గిపోయింది. ఇక్కడున్నవాళ్లలో చాలామందిమి కోస్తాంధ్ర, రాయలసీమలలో చదువుకున్నవాళ్లం, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నవాళ్లం.

కానీ ఆనాడు 1960,70వ దశకంలో చాలా బలమైన రాజకీయ నాయకత్వం, ముందుచూపున్న నాయకత్వం పార్టీలకతీతంగా మన పిల్లలకు చదువు కావాలని చెప్పి బోలెడంత ప్రయత్నం చేసి పాఠశాల విద్యను బాగు చేశారు. 80ల దశకానికి వచ్చేసరికి పాఠశాల విద్య దెబ్బతినిపోయింది ప్రభుత్వ రంగంలో. అప్పుడు తెలంగాణలో పాఠశాల విద్యను పెంచే ప్రయత్నం జరిగింది. కాబట్టి ఖర్చయినా ఉపాధ్యాయుల్ని పెట్టినా, స్కూళ్లని పెట్టినా ఆ విద్య వల్ల అనుకున్నంత ఫలితం రాలేదు. కాబట్టే ఈ విద్య వల్ల మరింతగా అగాధం పెరిగింది.

కేబినెట్‌లో 60,40 శాతం మంత్రులు పెట్టాలన్నారు. నాకు సరిగ్గా తెలియదు 60,40 పెట్టారో లేదో. కానీ ప్రధానంగా ఉప ముఖ్యమంత్రి కావాలి. ఒక ప్రాంతం వారు ముఖ్యమంత్రయితే మరో ప్రాంతం వారు ఉప ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారు. అది తొలుతనే పక్కనపెట్టేశారు. ఏదో ఒకట్రెండు సార్లు తప్ప. అన్నిటినీ మించి అధ్యక్షా చేసిన పెద్ద తప్పిదం – జెంటిల్‌మెన్స్ అగ్రిమెంట్‌లో పెట్టిన రీజినల్ స్టాండింగ్ కమిటీ విషయంలో. ఆ స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేసింది స్పెసిఫైడ్ లెజిస్లేషన్. కొన్ని నిర్దిష్టమైన అంశాల మీద చట్టాలు చేయటం, ముందుగా వారు పరిశీలించి ఒప్పుకుంటే శాసనసభకు వెళ్లటం, సాధారణంగా వారు చెప్పింది ఒప్పుకోవటం అనేది దాన్లో పెట్టారు. అలాగే *general policy without burden on the exchequer,* ఖర్చు పెట్టాల్సిన అవసరమైతే శాసనసభకు వెళ్లాలి. కానీ ఖర్చు లేకుండా విధాన నిర్ణయంలో తెలంగాణకు సంబంధించిన అంశాలు ఉన్నట్టయితే అవి ఆ కమిటీలో నిర్ణయం కావాలని ఆనాడు ప్రతిపాదించారు. అలాగే ఒకవేళ కమిటీకి శాసనసభకి, లేదా ప్రభుత్వానికి అభిప్రాయభేదాలుంటే గవర్నర్ దగ్గరకి వెళ్లాలని కోరారు. అంటే ఆ ప్రాంతానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించాలని తెలంగాణకి అని కోరారు. ఇక్కడ ఖచ్చితంగా విఫలమైనాం. 74 దాకా కొంతవరకు ఏర్పాట్లు జరిగాయి. ఆ తర్వాత దాన్ని రద్దుచేశారు.

చాలా పెద్ద పొరపాటు జరిగిందేమిటంటే– 6సూత్రాల పథకం వచ్చినప్పుడు, 371 (డి) వచ్చినప్పుడు ఈ ప్రాంతీయ కమిటీని రద్దుచేసి దానికున్న అధికారాల్ని తొలగించారు. ఆ అధికారాల్ని మరింత పెంచి దాన్ని మరింత గౌరవించినట్టయితే బహుశా చరిత్ర ఇంకో రకంగా ఉండేది. అధ్యక్షా, అలాగే జీవో 610 విషయంలో నిన్న, ఇవాళ ప్రస్తావనకు వచ్చాయి. పొరపాట్లు చిన్నవే అనుకోవచ్చు కానీ అపోహలు చాలా పెద్దవైనాయి. మనస్తాపాలు చాలా పెరిగిపోయాయి. 14,000 మందికి పైగా డీవియేషన్లు ఉన్నాయని అధికారికంగా ప్రకటించాం, దాన్లో 9,000 మందికి సరిచేశామన్నారు, 5,000 వరకూ సరిచేయలేకపోయాం కోర్టు కేసులలో ఉండటం వల్ల. ఈ లెక్కల్లో భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు కానీ నేను అధికారిక లెక్కల ప్రకారం చెబుతున్నాను. అధ్యక్షా, రంగారెడ్డి జిల్లాలో శాసనసభ్యుడిగా నేను స్వయంగా గమనించాను. 3 ఏళ్ల క్రితం అధ్యక్షా, శాసనసభ్యులు, మంత్రులు కూర్చున్నారు జిల్లా కలెక్టర్ గారితో. ఒక 70 కేసులలో 72 అనుకుంటా, ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగుల వారందరూ కూడా ప్రతిపాదనలు పెట్టుకున్నారు. అయ్యా, కంపాషియోనేట్ గ్రౌండ్స్ మీద, మీకు అనారోగ్యం ఉందనో, తల్లిదండ్రులకు అనారోగ్యం ఉందనో లేదా భార్యాభర్తలు వేర్వేరు చోట్ల ఉన్నారనో మా అందరికీ బదిలీ చేయాలని వారు కోరితే, సదుద్దేశంతోనే ఆనాడు అక్కడ సమావేశంలో ఉన్న మంత్రులు, శాసనసభ్యులు, అందరూ తెలంగాణ ప్రాంతంలోని వారే, నిజానికి వేరే ప్రాంతంలో పుట్టినవాడ్ని నేనొక్కడినే అక్కడ సమావేశంలో ఉన్నది, వారంతా అంగీకరించారు. నేను మాత్రం అడ్డుకున్నాను. పొరపాటు చేస్తున్నాం, మనం, కంపాషియోనేట్ గ్రౌండ్స్ కావచ్చు, రాజకీయంగా ఒత్తిళ్లు ఉండొచ్చు, కానీ రాజ్యాంగబద్ధంగా 371 (డి) ప్రకారం, ఒక రాష్ట్రపతి ఉత్తర్వు వచ్చిన తర్వాత, 610 జీవో వచ్చిన తర్వాత ఆ జీవోకి అతీతంగా, విఘాతం కలిగించేలా ఒక్క మనిషిని కూడా బదిలీ చేయవద్దు అని కోరాను. అప్పటికే ఆ 15 శాతం నాన్‌లోకల్ కోటా పూర్తయిపోయింది. కాబట్టి చేయవద్దని గట్టిగా పట్టుబట్టాల్సి వచ్చింది. అధ్యక్షా, పొరపాట్లు దురుద్దేశం వల్ల జరక్కపోవచ్చు. కానీ దానివల్ల ఖచ్చితంగా మనస్పర్థలు చెలరేగినాయి. ఖచ్చితంగా అపోహలు పెరిగినాయి. దానివల్ల ఈవేళ పరిస్థితి ఇక్కడిదాకా వచ్చింది.

అధ్యక్షా, మాట ఇస్తే ఎంత కష్టమైనా నిలబెట్టుకోవాలి. తెలంగాణ ప్రాంతానికి 56లో మాట ఇచ్చినప్పుడు నూటికి నూరుపాళ్లు నిలబెట్టుకోలేదన్న భావన తెలంగాణ ప్రాంతంలో నాటుకుపోయింది. అధ్యక్షా, 14 (ఎఫ్)ను చూడండి. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ వల్ల 14 (ఎఫ్) రాజ్యాంగబద్ధమే అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చాక, నిజానికి చాలామందికి గుర్తుండవచ్చు లేదా మర్చిపోయి ఉండవచ్చు. 14 (ఎఫ్) వచ్చాక 371 (డి) వచ్చాక, 1975–76 నుంచి 2008, 2009 వరకు కూడా ఏ ఇబ్బందీ లేకుండానే హైదరాబాద్ పోలీసు సిబ్బంది నియామకాలు కూడా జోనల్ సిస్టమ్ పకారమే జరుగుతున్నాయి. ఏ కారణమన్నా కానివ్వండి. ఎవరో కొందరు ఉద్యోగులు హైకోర్టుకు పోతే హైకోర్టులో దాన్ని కొట్టివేశారు. దానిమీద సుప్రీంకోర్టుకు పోతే సుప్రీంకోర్టులో –హైకోర్టు తీర్పు కరెక్టేనూ, రాష్ట్రపతి ఉత్తర్వులు కాబట్టి ఆ ఉత్తర్వుల ప్రకారమే జరగాలి కాబట్టి జోనల్ సిస్టమ్ అమలు కావాలి అని తీర్పిస్తే ఆనాడు ఆల్ పార్టీ మీటింగ్ జరిగింది అధ్యక్షా. ఆనాడు మన ముఖ్యమంత్రిగారు స్పీకర్‌గా ఉన్నారు. కొణిజేటి రోశయ్యగారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇక్కడున్న సభ

నాయకులు, సభలో ఉన్నటువంటి పెద్దలంతా వారివారి పార్టీల నాయకులుగా ఉన్నారు. కేసీఆర్‌గారు ఉన్నారు, నాకు గుర్తున్నంత వరకూ చంద్రబాబు నాయుడుగారు ఉన్నారు, ఇతర పెద్దలు ఉన్నారు, నేను కూడా ఆ సభలో ఉన్నాను. ఆనాడు ఒక పెద్ద తప్పిదం జరిగింది. అధ్యక్షా, 14 (ఎఫ్)ను చట్టబద్ధం, రాజ్యాంగబద్ధం కాబట్టి అమలుచేయాలని సుప్రీంకోర్టు అన్నప్పుడు, తెలంగాణ ప్రాంతంలో దీనివల్ల మనసులో ఆందోళనలు చెలరేగినప్పుడు, పెద్దమనసుతో మనం చేయవలసిన పని 14 (ఎఫ్)ని తొలగించటం కోసం ఆనాడు ఏర్పాట్లు జరగవలసింది. అది జరక్కుండా ఆనాడు దీని మీద మనం రివ్యూ పెడదాం సుప్రీంకోర్టులో అని చెప్పి ఒక పొరపాటు చేశాం. ఏదోకరకంగా తప్పించుకునే ధోరణిలో. నేను ఆనాడే చెప్పాను - సుప్రీంకోర్టు తీర్పుని నేను జాగ్రత్తగా పరిశీలించాను. ఆ తీర్పు 14 (ఎఫ్)ని ఖచ్చితంగా అమలుచేయాలని దాని ప్రకారంగా నియామకాలు చేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశం కరెక్టేనని ఇచ్చింది. కాబట్టి సుప్రీంకోర్టు రివ్యూలో ఏమీ జరగదు, దీనివల్ల తెలంగాణ ప్రాంతంలో మనోభావాలు దెబ్బతింటాయి, మనసు గాయపడుతుంది అనుకున్నట్టయితే 14 (ఎఫ్)ని మనం తొలగిద్దాం అని చెబితే, రోశయ్యగారు అడిగారు- జయప్రకాష్ గారూ, ఇది సాధ్యమా? మన చేతుల్లో ఉందా? అని. అయ్యా, మనం శాసనసభ సమావేశాన్ని ఏర్పాటుచేసుకుని ప్రత్యేక సమావేశాన్ని, ఆ సభలో అన్ని ప్రాంతాలవారూ కూడా మన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల మధ్యా సామరస్యం కోసం 14 (ఎఫ్) తొలగింపు తీర్మానం చేద్దాం. మనం చేద్దామంటే ఢిల్లీ వాళ్లెవరు కాదనటానికి? అని చెప్పి అంటే, దాన్ని ఉదాసీనంగా పక్కనపెట్టారు అధ్యక్షా. ఆనాడు కేసీఆర్‌గారు అక్కడే మీడియా పాయింట్ దగ్గర ఈ మాట చెప్పారు, తర్వాత సూర్యాపేటలో ఎప్పుడో మొదటి బహిరంగసభలో కూడా ఈ మాటే చెప్పారు.

అధ్యక్షా, సకాలంలో సరైన రీతిలో మనం స్పందించినట్టయితే ఈవేళ రాష్ట్రానికి ఈ ఇబ్బంది వచ్చేది కాదు. ఈరోజు ప్రజల మధ్య ఈ అగాథం వచ్చేది కాదు. అధ్యక్షా, ఏనుగు గదిలో ఉంది. తెలంగాణ సమస్య చాలా పెద్దసమస్యగా కోట్లాదిమంది మనసుల్లో ఉన్నప్పుడు, అది లేనట్టుగా మనం వేరే చర్చించుకోవటమన్నది సముచితం కాదు. నిజాయతీగా చర్చించుకుందాం, వాస్తవాల్ని బైటపెట్టుకుందాం, ఎక్కడ పొరపాట్లు జరిగినాయి? ఏమేం సవరించాలి? ఒక కొత్త రాష్ట్రం ఏర్పాటు కావలెనా? వేర్పాటు కాకుండా సయోధ్యగా పరిష్కారం సాధ్యమా? నిజాయతీగా మనం చర్చించుకుందాం గానీ ఢిల్లీలో కాదు, మరో చోట కాదు అంటే పార్టీలన్నీ పక్కన పెట్టేశాయి. అధ్యక్షా, ఇప్పుడు పరిస్థితి చేయి దాటి పోయింది. అధ్యక్షా, వందలాదిమంది యువత ఆశలు నెరవేరదేమోనన్న వేదనతో ఆత్మహత్యలు చేసుకున్నారు. జన సామాన్యంలో వేర్పాటు భావం చాలా బలంగా నాటుకున్నది. ఈ మాటలనటం కోసం అధ్యక్షా, నేను చాలా దీర్ఘంగా ఆలోచించి, వేలాదిమందితో అన్ని ప్రాంతాలవారితో మాట్లాడాక ఈ మాటలు అంటున్నాను. ఈవేళ ఈ సభలోనే ఒకప్పుడు అందరూ హాయిగా భుజాల మీద చేతులు వేసుకుని చాలా సంతోషంగా, ఆప్యాయంగా మాట్లాడుకునేవారు పార్టీలకతీతంగా లేదా వారివారి పార్టీల్లో. ఈవేళ పార్టీలు చచ్చిపోయినాయి. ఈవేళ కేవలం ప్రాంతాలు మాత్రం మిగిలున్నాయి. ఒక్కొక్కరూ ఒక్కో వాదన చేస్తున్నారు. ఇక్కడ మన దగ్గరే కాదు ఈ రాష్ట్రంలో ఎవరితోనన్నా మాట్లాడాలంటే, ఒక ఉద్యోగితో మాట్లాడినా, పోలీసు అధికారితో మాట్లాడినా, పౌరులతో మాట్లాడినా కూడా- మీరు ఏ ప్రాంతం నుంచి వచ్చారు, ఎక్కడ పుట్టారు అని అడగాల్సి వస్తోంది. ఒక్కసారి గుండెల్లో ఈ ప్రశ్న వేసుకుని అడగాల్సి ఉంది. ఈవేళ రాష్ట్రంలో అందరి మనసుల్లో కూడా ఈ విరోధ భావం, వేర్పాటు భావం ప్రవేశించింది. మనం చెప్పినా కూడా ఈ ప్రాంతాలను బట్టి, ఆ ప్రాంతం కళ్లద్దంలో నుంచి ఆ రకమైన భావంతో ఆలోచించటం తప్ప సామరస్యంగా, వాస్తవాల ఆధారంగా, తర్కబద్ధంగా నిర్ణయాలు తీసుకునే అవకాశమే లేకుండాపోయింది అధ్యక్షా. ప్రజల మనసుల్లో ఇంత బలంగా భావాలు నాటుకున్న తర్వాత, ప్రతి సంభాషణలో, ప్రతి వర్గంలో, శాసనసభ్యులు కావచ్చు, వ్యాపారుల్లో కావచ్చు, ప్రెస్ రిపోర్టర్లు కావచ్చు, డాక్టర్లు కావచ్చు, లాయర్లు కావచ్చు, అధికారులు కావచ్చు, ఉద్యోగులు కావచ్చు, జడ్జీలు కావచ్చు, విద్యార్థులు కావచ్చు అందరి మనసుల్లో కూడా వీళ్లు వేరు, వాళ్లు వేరు అనే భావం బలంగా నాటుకుపోయిన తర్వాత, ప్రతి అంశాన్నీ ప్రాంతీయ కోణంలో చూడటం మొదలుపెట్టిన తర్వాత, నాలుగేళ్లుగా శాసనసభ నడవటమే అసాధ్యమైన పరిస్థితులు నెలకొన్న తర్వాత అధ్యక్షా, ఈ 13వ శాసనసభలో ఎప్పుడైనా మనం సరిగా పనిచేయగలిగామా గత నాలుగున్నరేళ్లుగా? నిజాయతీగా మాట్లాడుకుందాం. 1,62,000 కోట్ల రూపాయల బడ్జెట్‌ని ఈ సభ ఆమోదిస్తుంటే అధ్యక్షా, గత బడ్జెట్‌లో, రామనారాయణ రెడ్డిగారు బడ్జెట్‌ని ప్రతిపాదిస్తే, కనీసం 162 సెకన్లు కూడా చర్చ జరపలేకపోయాం. మూజువాణి ఓటుతో చర్చ లేకుండా ఆమోదించాల్సి వచ్చింది. గవర్నర్ వస్తే, గవర్నర్ ప్రసంగం నడిపే అవకాశం కూడా లేదు. సస్పెండ్ చేసి, గందరగోళం చేస్తే తప్ప. ఏ మాట్లాడారో ఒక్క ముక్క అర్థం కాదు.అయ్యాక ఒక్క నిముషం చర్చించలేకపోయాం. కేవలం పేరుకి రాజ్యాంగం కోసం మనం చర్చ జరుపుతున్నాం తప్పితే, సభ నడిపినట్టు చూపెడుతున్నాం తప్పితే, రాజ్యాంగబద్ధంగా

బాధ్యతల కోసం కాగితాల మీద సంతకాలు పెడుతున్నాం తప్పితే అధ్యక్షా, సభ నడవటం లేదు, మంత్రివర్గం సమష్టిగా పనిచేయలేకపోతోంది. నేనెవరినో తప్పు పట్టటానికి ఈ మాటలు అనటం లేదు. గతంలో ఈ మాట అంటే, నా మీద తీవ్రంగా దాడి చేశారు. అధ్యక్షా, ఈవేళ మంత్రివర్గంలో కూడా విభజన చాలా స్పష్టంగా కనిపిస్తోంది. వ్యక్తిగతంగా విభేదాలు లేవు, కానీ వారివారి ప్రాంతాల మనోగతాలు ప్రతిబింబించాలి కాబట్టి విభేదాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. బహిరంగంగానే. రాజ్యాంగంలోని మౌలికసూత్రాలకు విరుద్ధంగా ఈవేళ మంత్రులు ఒక్కొక్కరూ ఒక్కొక్కమాట బహిరంగంగానే మాట్లాడుతున్నారు. ఒక ప్రభుత్వం అన్నది లేకుండా పోయింది.

ఈ నేపథ్యంలో అధ్యక్షా, యధాతథ స్థితి కొనసాగటం అసాధ్యం. మనకి మనసులో ఎంత బాధ కలిగినా. ఒక కుటుంబం విడిపోవాలంటే అది చాలా బాధ కలుగుతుంది. ఇది సంతోషంగా ఎవరికీ ఉండదు. కానీ అధ్యక్షా, మన బిడ్డలకి మంచి భవిష్యత్తు కావాలీ అంటే, యువత భవిష్యత్తుకి ప్రతిబంధకం కాకుండా ఉండాలీ అంటే, మరో 10-15 ఏళ్లపాటు రాష్ట్రం రావణకాష్ఠంగా ఉండకూడదు అనుకున్నట్టయితే, ఈవేళ మన బిడ్డల మీద మమకారంతో మంచి నిర్ణయాల్ని మనం తీసుకోవాలి. బలవంతంగా ఐక్యతను కొనసాగించటం సాధ్యం కాదు. మనసులు విరిగాక మళ్లీ అతకటం అంత తేలికైన పనికాదు. బహుశా ఒక తరం కాలం తర్వాత జరగొచ్చు. కానీ ఆ తరం తర్వాత జరగాలీ అంటే, ఈవేళ మా మాటలు మన్నించారు, మా అందరికీ న్యాయం జరిగింది అనే విశ్వాసం కలిగే ఏర్పాటు చేసి రాజకీయ నాయకత్వం, సామాజిక నాయకత్వం చాలా బలమైనటువంటి రీతిలో ప్రజలలో మనందరం ఒకటన్న భావాన్ని కల్పిస్తే, అప్పుడు ఇవి జరుగుతాయి తప్ప బలవంతంగా మాత్రం దీన్ని మనం సాధ్యం చేయలేం. ఒకవేళ అలా కాకుండా మనం బలవంతంగానే ఈ రాష్ట్రాన్ని కొనసాగించాలి అని కోరినట్టయితే, రాజకీయంగా ఒకే రాష్ట్రంగా కొనసాగాలని కోరుకున్నట్టయితే, అధ్యక్షా, అపారమైన జననష్టం జరిగే ప్రమాదముంది. బలప్రయోగం అవసరమవుతుంది. ప్రజాస్వామ్యంలో ఎవరికీ కూడా బలప్రయోగం ఇష్టముండదు. ఏదో తప్పనిసరి సందర్భాలలో, శాంతిభద్రతలకు భంగం కలిగినప్పుడు బలప్రయోగమన్న మాట అవసరమవుతుందితప్ప ఒక ఉవ్వెత్తున ఉద్యమం కోట్లాదిమంది మనసుల్లో నాటుకుంటే అలాంటి సందర్భంలో ఆ ఉద్యమాన్ని అణచివేయాలనుకుంటే అపారమైన జననష్టం ఏర్పడుతుంది. అధ్యక్షా, ఆర్థిక వ్యవస్థ పతనమవుతుంది. ఇప్పటికే కొన్నాళ్లపాటు మనం నష్టాన్ని అనుభవించాం. ఏళ్ల తరబడి రాష్ట్రం రావణకాష్ఠం అవుతుంది. అన్ని ప్రాంతాలలో కూడా మన బిడ్డలు దీనికి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు మళ్లీమళ్లీ స్పష్టంగా వ్యక్తమయ్యాయి. అంచేతనే లోక్‌సత్తా పార్టీ నిర్ద్వంద్వంగా భావిస్తున్నది- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఈవేళ అవసరం, అనివార్యం.

గతజల సేతుబంధనం నిష్ఫలం. ఈవేళ చర్చలన్నీ కూడా ఈ 20 ఏళ్లుగా, 30 ఏళ్లుగా, గత 5ఏళ్లుగా ఏం జరిగినాయి అని తప్ప భవిష్యత్తు ఏం కావాలి అనే ఆలోచన మాత్రం మృగ్యమై ఉంది అధ్యక్షా. ఎందుకంటే, మన మనసుల్లో ఆవేశకావేశాలున్నాయి. అన్ని పార్టీల్లో, అన్ని వర్గాల్లో, అన్ని ప్రాంతాల్లో కూడా మనకేదో అన్యాయం జరిగింది, మాకేదో ద్రోహం జరిగింది అనే భావం ఉంది. నేను అర్థం చేసుకోగలనుగానీ, గతాన్ని గురించి వగస్తే, అధ్యక్షా, గౌతమ బుద్ధుడు ఎప్పుడో చెప్పాడు- నిన్నటి గురించి ఆలోచించకు, కేవలం మనసులో వేదన తప్ప మరేమీ మిగలదు. రేపటి గురించి ఆలోచించు అని. అధ్యక్షా, యువతకి కొత్త తరంలో కొత్త భవిష్యత్తుని మనం ఇవ్వాలీ అంటే, గతాన్ని గురించి పక్కనపెట్టి భవిష్యత్తుని గురించి మనం ఆలోచించాలి. భయం, అసూయ, ద్వేషం, ఆందోళన వాటి స్థానంలో ప్రేమ, సహనం, సంయమనం, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం వీటిని మనం పునరుద్ధరించాలి. తాబట్టిన కుందేటికి మూడు కాళ్లు అన్నట్టయితే, మాకొక రాష్ట్రం కావాలనేవారు మేం చచ్చినా ఇంకొకరి మాట వినం, తాబట్టిన కుందేటికి మూడే కాళ్లు. రాష్ట్రం ఉమ్మడిగా కలిసుండాలనుకునే వాళ్లు చచ్చినా మీ మాట వినం, తాబట్టిన కుందేటికి మూడే కాళ్లు. అధ్యక్షా, ఆంగ్లంలో ఒక ఎక్స్‌ప్రెషన్ ఉంది. *Immovable object and Irresistable force-* కదలనటువంటి పర్వతం ఉంది, ఏ శక్తికీ చలించని పర్వతం ఉంది, ఏ రకంగానూ నిరోధించలేని మహాశక్తి ఉంది. ఈ పర్వతానికి, మహాశక్తికి మధ్య యుద్ధం జరిగితే అధ్యక్షా, మనం సినిమాల్లో చూస్తాం, కృష్ణార్జున యుద్ధమో మరోటో జరిగే అకస్మాత్తుగా చివర్లో ఏ దేవుడో వచ్చి శాంతిని కాపాడతాడు. ఇవాళ ఎవరు అధ్యక్షా ఈ శాంతిని కాపాడతారు? *Immovable object and Irresistable force* ఈరకంగా పెడధోరణులతో ఉంటే లాభంలేదు అధ్యక్షా, మనం దీనికి పరిష్కారం వెతుక్కోవాలి. అధ్యక్షా, రాజకీయ సరిహద్దులు తెలుగు ప్రజల మనసుల మధ్య ఉండకూడదు. తెలుగు సమాజం మధ్య ఉండకూడదు. తెలుగు ప్రజల సమైక్యత వేరు, రాజకీయంగా ఒక మ్యాప్ మీద మనం గీసుకునేటువంటి హద్దులు వేరు. అధ్యక్షా, ఈ దేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. హద్దులు గీసుకున్నంత మాత్రం చేత ప్రజల మధ్య ఏ రకంగానూ సంబంధాలు చెదిరిపోరాదు. ఇక్కడున్నవారిలో చాలామందికి కర్ణాటకలో బంధువులున్నారు, తమిళనాడులో ఉన్నారు, మహారాష్ట్రలో

ఉన్నారు, దేశంలో అన్ని ప్రాంతాలలో ఉన్నారు. మనకా హక్కున్నది. ఎవరూ మనకి దయాదాక్షిణ్యాలతో ఇచ్చేది కాదు అధ్యక్షా. కాబట్టి రాజకీయ విభజనను రాజకీయ విభజనగానే చూద్దాం, అది సమాజ విభజన కాదు, తెలుగు ప్రజల మధ్య విభజన కాదు, తెలుగు సంస్కృతి విభజన కాదు, ఈ దేశ విభజన కాదు. అధ్యక్షా, అయితే ఇదే నేపథ్యంలో ఏ రకంగా ఏర్పాటు చేయాలి? ఏర్పాటు చేయటం అవసరం, అనివార్యం. కానీ ఏరకంగా ఏర్పాటు చేయాలి? ఎలా చేయకూడదు?

ఇటీవలి కాలంలో కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, ఒక రాష్ట్ర విభజన సందర్భంలో ఒక ఫెడరల్ వ్యవస్థలో ఎలా చేయకూడదు అనే దానికి ఒక గొప్ప ఉదాహరణ. చిత్తశుద్ధితో చేయాలి. చిత్తశుద్ధితో చేయటానికి దీనికి చక్కటి పద్ధతులున్నాయి. దీన్ని పక్కనపెట్టి ఏ రకంగా చేయకూడదో ఆ రకమైన పద్ధతుల్ని ఈవేళ చేపట్టి తెలుగు ప్రజల మధ్య మరింత చిచ్చుపెట్టే ప్రయత్నం జరిగింది అధ్యక్షా. మనది ఫెడరల్ వ్యవస్థ. ఎందుకు ఫెడరల్ వ్యవస్థ అవసరమైంది? ఆఫ్రికా, యూరప్ రెండు ఖండాలలో కలిపి ఎంత సంక్లిష్టత ఉందో, ఎన్ని భాషలున్నాయో, ఎంత సంక్లిష్ట సమాజంలో ఉందో, ఎన్ని భిన్న వర్గాలున్నాయో అన్నీ మొత్తాల్నీ కలబోసింది ఈ భారతదేశం అధ్యక్షా. ప్రపంచం మొత్తంలో ఇంత సంక్లిష్టతలున్న దేశం మరొకటి లేదు. కాబట్టే రెండంచెల సార్వభౌమత్వం. ఫెడరల్ వ్యవస్థ అంటే కేవలం మాట కాదు. జాతీయ స్థాయిలో సార్వభౌమత్వం, రాష్ట్రంలో సార్వభౌమత్వం. 7వ షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో ఈ సభ చేసే నిర్ణయాలలో జోక్యం చేసుకునే హక్కు పార్లమెంటుకి లేదు. అలాగే పార్లమెంటుకి అధికారాలున్న అంశాలలో జోక్యం చేసుకునే హక్కు రాష్ట్ర శాసనసభకి లేదు. రెండంచెల సార్వభౌమత్వం అధ్యక్షా ఫెడరల్ వ్యవస్థంటే అర్థం.

అధ్యక్షా, ప్రపంచమంతటా రాష్ట్రాల ఏర్పాటుకి ఫెడరల్ వ్యవస్థలో స్పష్టమైన ఏర్పాట్లున్నాయి. మీరు పరిణతి చెందిన ఫెడరల్ దేశాలను తీసుకున్నట్టయితే అధ్యక్షా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా, స్విట్జర్లాండ్– ఈ ఐదు దేశాలు కూడా బలమైన, పరిణతి చెందిన ఫెడరల్ వ్యవస్థకి తార్కాణాలు. అధ్యక్షా, అలాగే మనలాంటి దేశాలు, కాస్త అటూఇటుగా ఉన్న దేశాలు, మళ్లీ పెద్ద దేశాలు తీసుకున్నట్టయితే, బ్రెజిల్, అర్జెంటీనీ, మెక్సికో. అధ్యక్షా, ఈ అన్ని దేశాల్లో కూడా ఒక రాష్ట్ర విభజన అన్నది సామరస్యంగా అందరినీ కూర్చోబెట్టి, ఆ రాష్ట్ర శాసనసభను ఒప్పించి ఏర్పాటు చేశారు, చేస్తారు. అధ్యక్షా, చట్టం ఆ రకంగా చెబుతోంది, రాజ్యాంగం ఆ రకంగానే చెబుతోంది. అధ్యక్షా, మన రాజ్యాంగంలో కూడా 3వ అధికరణాన్ని ఏర్పాటు చేస్తున్నప్పుడు బి.ఎన్ రావు గారు రాజ్యాంగ సభకి సలహాదారు. ఆయన అక్టోబర్, 1947లో ప్రతిపాదించారు. ఏమని– రాష్ట్రాల అనుమతి లేకుండా రాష్ట్ర విభజన జరక్కూడదని. అదే ఉద్దేశంతో ప్రపంచంలో ఉన్న ఆ పద్ధతుల్ని దృష్టిలో పెట్టుకుని. అయితే అధ్యక్షా, మన డ్రాఫ్టింగ్ కమిటీ, రాజ్యాంగ ముసాయిదా కమిటీగానీ, రాజ్యాంగ సభగానీ చాలా లోతుగా ఆలోచించి – 542 సంస్థానాలు దేశంలో వచ్చాయి స్వతంత్రం వచ్చిన సందర్భంలో. ప్రపంచంలో మరెక్కడా అలాంటిది జరగలేదు. తుపాకులు పేలకుండా వచ్చినై. ఒక్క హైదరాబాద్ మాత్రమే, హైదరాబాద్ సంస్థానంలో మాత్రమే తుపాకులు పేలినై. దాన్లో కూడా ఆనాడు చనిపోయింది భారత సైనికులు 10 మంది కంటే తక్కువమంది. ఇతరత్రా వందలాది, వేలాదిమంది చనిపోయి వుండవచ్చు, చాలారకాల నివేదికలు ఉన్నాయి. కానీ సైనికులు చనిపోయింది 10 మంది మాత్రమే. దేశంలో మరెక్కడా తుపాకి అవసరం లేకుండా పోయింది. కానీ 542 సంస్థానాలని, విభిన్నమైనటువంటి, కొన్ని చోట్ల భాష వేరు, సంస్కృతి వేరు, తెగలు వేరు, రకరకాల వైరుధ్యం ఉన్నటువంటి సమాజంలో ఈ అందర్నీ కూడా కలపాలని. అలాగే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కావాలని రాజ్యాంగ సభకి స్పష్టమైన అవగాహన ఉన్నది, అంతకుముసుపే జాతీయ పోరాటంలో భాగంగా ఎన్నో సందర్భాలలో దీన్ని గురించి నేతలంతా కూడా హామీలిచ్చి ఉన్నారు. ఎ,బి,సి అని మూడు రకాల రాష్ట్రాలున్నాయి ఆ రోజున. అతుకుల బొంతలా ఉంది. ఈ గందరగోళాన్నంతటినీ కూడా విప్పి ఈ దేశంలో సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలు ఏర్పాటు కావాలి అంటే, ఎవరో ఒకళ్లు, ఒక్క శాసనసభ అడ్డుపెట్టినట్టయితే మొత్తం ప్రక్రియ ఆగిపోతుంది, ఒక ట్రాఫిక్ జామ్‌లాగా అయిపోతుంది కాబట్టి అసాధారణ సందర్భాలలో పార్లమెంటుకు అధికారం ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర శాసనసభ అభిప్రాయం తెలుసుకోండి కానీ, తుది నిర్ణయం పార్లమెంటుదని– పెట్టారు అధ్యక్షా.

అప్పుడే ఈ విషయాన్ని గుర్చి రాజ్యాంగసభలో ప్రస్తావనకి వచ్చినప్పుడు అంబేద్కర్‌గారు ఒక మాట అన్నారు– కొన్ని విషయాలలో కేంద్రీకరించిన పాలనకి రాజ్యాంగం అవకాశం ఇచ్చిన మాట వాస్తవం. కానీ మీరంతా గుర్తుంచుకోవాలి– ఇది అసాధారణమైనటువంటి ప్రకరణాలు మాత్రమే. ఇది సాధారణ సందర్భాలలో ఉపయోగించేవి కావు. *These are not normal feature of the Constitution*- బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిందిది. ఎప్పుడు వాడతామంటే, ఆ మాట కూడా చెప్పారాయన – *"Their use and operation will be confined to emergencies only"*. అసాధారణ పరిస్థితులకు మాత్రమే పరిమితం చేస్తాం దాన్ని అని చెప్పారు.

ఆ తర్వాత గత 63 ఏళ్లుగా జరిగిన పరిణామాలను మీరు చూసినట్టయితే అంబేద్కర్ ఆనాడు చెప్పిన మాటల్ని రాజకీయ నాయకత్వం పాటించింది ఈ దేశంలో పార్టీలకతీతంగా. రాజకీయ నాయకత్వం జాతీయస్థాయిలో తనకు తాను శృంఖలాల్ని విధించుకున్నది, పరిమితుల్ని పాటించింది, సంయమనాన్ని పాటించింది. ప్రతీ రాష్ట్రం కూడా ఏర్పాటైనప్పుడు, ఐతే ఖచ్చితంగా ఆ రాష్ట్ర శాసనసభ అనుమతి తీసుకున్నారు, నిజానికి రాష్ట్రం నుంచి ముందుగా తీర్మానం వచ్చాక ఆ ప్రక్రియను చేపట్టారు, బీహార్ లాంటి రాష్ట్రంలో తీర్మానం రాకపోతే తీర్మానం 1997లో వచ్చేదాకా ఆపివుంచారు. బలవంతం చేయలేదు లేదా భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా, దేశ పునర్నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేశారు. ఒక్క పంజాబ్‌లో మాత్రం, అధ్యక్షా, పంజాబ్ సంగతి చాలామందికి తెలియాలి. పంజాబ్‌లో కూడా తొలినుంచీ మాకు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరింది పంజాబీ భాష మాట్లాడేవారు. పెద్ద ఉద్యమాలను అందుకోనం చేపట్టారు. మాస్టర్ దారా సింగ్, ఫతే సింగ్ పెద్దపెద్ద ఉద్యమాలను చేపట్టారు. అప్పుడు, ఆనాడు వద్దు అన్నది కేంద్రంలో ఉన్న ప్రభుత్వం. ఆనాడు వద్దు అన్నది హిందీ మాట్లాడే హర్యానా ప్రాంతం వారు. అదే హర్యానా ప్రాంతం వారు 1966లో, లాల్‌బహదూర్ శాస్త్రి మరణానంతరం, వారంతాకూడా, హర్యానా శాసనసభ్యులంతా కూర్చుని ఏకగ్రీవంగా మాకు మా రాష్ట్రం కావాలని మళ్లీ కోరారు. అవిభక్త పంజాబ్ రాష్ట్రంలో పంజాబీ మాట్లాడే వారంతా, హర్యానా ప్రాంతం వారంతా కోరారు. ఆ కోరిన తర్వాత ఒక కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. దాన్లో శ్రీమతి ఇందిరా గాంధీ, ఆనాడు సభ్యులుగా ఉన్నవారు వై.బి చవాన్, మహావీర్ త్యాగి, గౌరవ కేబినెట్ సభ్యులు. అంతేకాకుండా 22 మంది పార్లమెంటు సభ్యులతో అధ్యక్షా, 15 మంది లోక్‌సభ సభ్యులు, 7 గురు రాజ్యసభ సభ్యులు, దాన్లో ఈవేళ్టికి కూడా మనకు పరిచయమున్న కె.సి పంత్ గారి లాంటి పేర్లు చాలా ఉన్నాయి, వారందరితో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. వారు శాసనసభ్యులందరితో, అన్ని ప్రాంతాలతో కూర్చుని నివేదికను ఇచ్చారు. నివేదిక ఇచ్చాక మళ్లీ బౌండరీస్ కమిషన్‌ని ఏర్పాటు చేశారు జస్టిస్ షా అధ్యక్షతన, 3 గురు జడ్జీలతో. వాళ్ల నివేదిక కూడా అందిన తర్వాత అధ్యక్షా, ఆ తర్వాత శాసనసభని కేవలం పంజాబ్ రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న కోరికతో దాన్ని రద్దు చేశారు. పూర్తి ఏకాభిప్రాయం అన్ని ప్రాంతాలలో వచ్చిన తర్వాత. ఆ కారణంగా ఒక్క పంజాబ్ రాష్ట్రంలో శాసనసభ నుంచి ప్రత్యేకంగా ఒక తీర్మానం గానీ, అనుమతిగానీ కనిపించటం లేదు. కానీ ఆ ప్రక్రియను చూస్తే అర్థమవుతుంది అధ్యక్షా.



అధ్యక్షా, రాష్ట్రాల పునర్విభజన సంఘం. ఇవ్వాళ్టికి కూడా ఆ నివేదిక చాలా ప్రామాణికమైనది. చాలా సంక్షిప్తంగా, చాలా స్పష్టంగా, సూటిగా, గందరగోళానికి తావులేకుండా దూరదృష్టితో ఎంతో అద్భుతమైనటువంటి సూచనలు చేశారు మనకి అని అర్థమవుతుంది అధ్యక్షా. ఎస్.ఆర్.సి ఏమన్నది అధ్యక్షా- *Any measure of reorganization which is likely to create tensions and disharmony,* సమాజంలో ఉద్రిక్తతలు పెంచేదిగానీ లేదా సమాజంలో వివిధ వర్గాల మధ్య సామరస్యతను చెడగొట్టేదిగానీ, అలాంటి రీ ఆర్గనైజేషన్, అలాంటి పునర్వ్యవస్థీకరణ, *it weakens the sense of unity of India.* దేశ ఐక్యతకే భంగం కలిగే ప్రమాదం ఉన్నది కాబట్టి, *such a measure should not be countenance.* అధ్యక్షా, *I am quoting the verbatim of the SRC.* అధ్యక్షా, ఎస్.ఆర్.సి మరో సందర్భంలో కూడా అన్నది- *The links between the units and the nation should be strong.* రాష్ట్రాలకి, దేశానికి జాతీయస్థాయిలో ఉన్న బంధాలు బలంగా ఉండాలి, *so that under the stress of regional loyalties the union does not fall apart.* అలాకాకుండా ఉన్నట్టయితే, అండర్ ది స్ట్రెస్ ఆఫ్ రీజినల్ లాయల్టీస్, ప్రాంతీయ వైరుధ్యాల కారణంగా జాతి ఐక్యతకే ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉన్నది. జాగ్రత్తగా ఉండాలన్నారు అధ్యక్షా. ఇంకో మాటన్నారు అధ్యక్షా, *internal adjustments,* దేశం లోపల అంతర్భాగంగా మనం చేసే ఏర్పాట్లు, *should not meet to maladjustments at the inter-state and national level.* దాన్ని దృష్టిలో ఉంచుకుని అధ్యక్షా, 1987లో సర్కారియా కమిషన్, మన రాష్ట్రానికి చెందినటువంటి స్వర్గీయ ఎన్.టి రామారావు గారు ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్నారు, ఇతర రాష్ట్రాలలో కాంగ్రెసేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఫెడరల్ వ్యవస్థని బలోపేతం చేయాలన్న కోర్కెతో గట్టిగా డిమాండ్ చేస్తే, సర్కారియా కమిషన్ ఏర్పాటైంది. ఆ కమిషన్ వారు 1987లో అన్నారు అధ్యక్షా- 1950 నుంచి, రాజ్యాంగంలో 3వ అధికరణం వచ్చిన నాటి

నుంచి ఆనాటికి 20 చట్టాలు వచ్చినై, 3వ ఆర్టికల్ కింద, *in each of these cases,* సర్కారియా కమిషన్ అన్నది అధ్యక్షా, *they were done either with the consent of the states affected or on recommendations of a committee or commission setup for the purpose.* అధ్యక్షా, ఆ సర్కారియా కమిషన్ మరో మాట అన్నది. ఎందుకంటే, ఆర్టికల్ 3 పదజాలాన్ని మార్చాలనే డిమాండ్ కొన్ని రాష్ట్రాల నుంచి, తమిళనాడు నుంచి వచ్చింది ఆనాడు. బహుశా ఆంధ్రప్రదేశ్ కూడా ఆ మాట చెప్పిందేమో నాకు గుర్తు లేదు. అది కూడా పరిశీలించి వారన్నారు- *questions relating to re-adjustments of boundaries of some states still remained unsettled.* క్వశ్చన్స్ రిలేటింగ్ టు రీ అడ్జెస్ట్‌మెంట్స్ ఆఫ్ బౌండరీస్ ఆఫ్ సమ్ స్టేట్స్ స్టిల్ రిమెయిన్డ్ అన్‌సెటిల్డ్. ఇంకా కొన్ని సరిహద్దుల వివాదాలున్నాయి. సరిహద్దుల వివాదాలు. *Therefore, the need for article 3 & 4 in the present form have not disappeared.* కాబట్టి కొంతకాలం కొనసాగటం అవసరం అని చెప్పారు అధ్యక్షా.

అధ్యక్షా, పూంఛి కమిటీ ప్రస్తుతం జాతీయస్థాయిలో అధికారంలో ఉన్న యు.పి.ఎ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ. వారి కమిషన్, మా పరిపాలనా సంస్కరణల సంఘం విజ్ఞాన్ భవన్ ఎనెక్స్ నుంచే పనిచేశాయి కాబట్టి మేం చూశాం వారిని. వాళ్ల బోర్డు చూసి వారితో అప్పుడప్పుడూ మాట్లాడుతుండేవాళ్లం. వారేమన్నారు అధ్యక్షా-*In practice it is rarely possible for the parliament to ignore the views of the state. The Central Government cannot concede to the demand for a seperate state unless such a proposal is received from the state.* అధ్యక్షా, ఇది సాంప్రదాయం అని మర్చిపోకూడదు. ఖచ్చితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలి. నాకు ఏ మాత్రం అనుమానం లేదు. దానికి మార్గం కూడా చెబుతాను. మూడో అంశం లోకి వస్తాను. కానీ రాష్ట్రంలో అందరినీ ఒప్పించి చేయాలి తప్ప బలవంతంగా మేం ప్రభువులం, మాది రాచరికం లేదా మాది సామ్రాజ్యం, మీరు మా మాట వినాల్సిందే అంటే అధ్యక్షా, చాలా ప్రమాదం వస్తుంది. ఉదాహరణకి, రాయల తెలంగాణ ప్రతిపాదన వచ్చింది. తెలంగాణ ప్రాంతమంతా ఏమన్నది వెంటనే?- మాతో మాట్లాడకుండా, మమ్మల్ని సంప్రదించకుండా, మా అభిప్రాయాల్ని పరిగణలోకి తీసుకోకుండా, మా అభిమతాన్ని పట్టించుకోకుండా, మమ్మల్ని ఒప్పించకుండా మీరెవరు ఇష్టమొచ్చినట్టు చేయడానికి అని తెలంగాణ ప్రాంతమంతా బంద్‌కి దిగింది అధ్యక్షా. ఇది అందరికీ వర్తిస్తుంది. రేపొద్దున ఏ రాష్ట్రం ఏర్పడినా కూడా ఢిల్లీకి పూర్తి పెత్తనమిచ్చేసి ఏనాడు ఏ ఇష్టమొచ్చినట్టయినా చేసేయొచ్చు పార్లమెంటులో మెజారిటీ ఉన్నంతకాలం అన్నట్టయితే అధ్యక్షా, ఇంక సమాఖ్య వ్యవస్థ నిలవదు. ఇది యూనిటరీ వ్యవస్థ అవుతుంది. భారతదేశం చాలా ప్రమాదంలో పడుతుంది. కాబట్టి తెలంగాణ సోదరులకు విజ్ఞప్తి చేస్తున్నాను- ఈవేళ మూడు ప్రాంతాలనూ కలిసి ఒప్పించాలి. ఎలా ఒప్పించాలో ఇప్పుడే చెబుతాను. మీరేమీ ఆందోళన పడక్కర్లేదు. ఏ రకంగా ఒప్పించాలో, దానికి పరిష్కారమేమిటో మీ ముందు పెడతాను.

కానీ అధ్యక్షా, ఆ పరిష్కారం కోసం మనందరం కలిసి ప్రయత్నం చేయకుండా బలవంతంగా ఢిల్లీలో అధికారంలో ఉన్నవాడు ఆనాటి వాడి ఆలోచన ప్రకారం ఇష్టమొచ్చినట్టు చేసే అవకాశాన్ని మనం ఇస్తే పులి నోట్లో మనం తలకాయలు పెట్టినవాళ్లమవుతాం. ఆ పులి ఏనాడు ఎవరి తలకాయలు తీసేస్తుందో అర్థం కాదు అధ్యక్షా. ఈవేళ ఒక పరిస్థితి ఉండొచ్చు, రేపు ఇంకో పరిస్థితి ఉండొచ్చు. అందునా అధ్యక్షా 1991 తర్వాత మన ఫెడరల్ వ్యవస్థ మరింత బలపడింది. ఆ సర్కారియా కమిషన్ వచ్చిన తర్వాత దేశంలో పరిస్థితులు మారినై. మొట్టమొదటిది, పదవ ఫైనాన్స్ కమిషన్, కె.సి పంత్ గారి ఆధ్వర్యంలోని ఫైనాన్స్ కమిషన్ కారణంగా అప్పట్నుంచి రాష్ట్రాలకు వచ్చే ఫైనాన్స్ వనరుల విషయంలో, ఈ వనరుల విభజన విషయంలో మరింత శాస్త్రీయతను పాటించారు అధ్యక్షా. అట్లాగే అధ్యక్షా, ఆర్థిక సరళీకరణ 1991లో మన రాష్ట్రానికే చెందిన తెలుగువాడు పి.వి నరసింహారావు గారు, మనందరం గర్వించే మనిషి తీసుకొచ్చారు. ఆయన చనిపోయిన సందర్భంలో ఆనాడు ఈనాటి హోంమంత్రి గారు గవర్నర్‌గా ఉండగా, ఆ సంతాప సభలో నేను పాల్గన్నాను అధ్యక్షా. ఆ సభలో నేను స్పష్టంగా చెప్పాను- తెలుగు వాళ్ల కంటే బైట వాళ్లు గౌరవం ఎక్కువ ఇచ్చారు ఆయనకు, భారతీయుల కంటే ప్రపంచమంతా గౌరవమిచ్చింది, కాంగ్రెస్ కంటే మిగతాపార్టీలు గౌరవం ఇచ్చినాయి ఆయనకు అని. అధ్యక్షా, ఈ దేశాన్ని, ఈ దేశ ఆర్థికవ్యవస్థని కాపాడిన మనిషెవరన్నా ఉన్నారు అంటే ఖచ్చితంగా నరసింహారావు గారు. ఆ ఆర్థిక సరళీకరణ పుణ్యమాని అధ్యక్షా, ప్రతిదానికీ రాష్ట్ర ప్రభుత్వాలు ఢిల్లీ మీద ఆధారపడి లైసెన్స్ కోసమో, పర్మిట్ కోసమో, కోటా కోసమో వాళ్ల మోచేతుల నీళ్లు తాగే అవసరం పోయింది. అధ్యక్షా, దేశంలో ఫెడరల్ వ్యవస్థ బలపడింది. అలాగే అధ్యక్షా, మారుతున్న పరిస్థితుల ప్రభావం వల్ల పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రభావం తగ్గిపోయింది. హైదరాబాద్‌లో ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలు వచ్చినాయి. కేరళ వాళ్లు ఇప్పటికి కూడా తిడుతుంటారు- కాంగ్రెస్ వాళ్లు ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ

హైదరాబాద్‌కే ఇచ్చింది, మాకివ్వలేదు అని చెప్పి. కానీ ఈవేళ కొత్త ప్రభుత్వంలో సంస్థలు పెట్టే అవకాశం బాగా తగ్గిపోయింది అధ్యక్షా. ఉన్నది ఎలా పోగొట్టుకోవాలా, దాన్లో డిజిన్వెస్ట్‌మెంట్ ఎలా అని ఆలోచిస్తున్నారు. కొత్తగా వాటిలో పెట్టుబడుల అవకాశం దాదాపుగా సన్నగిల్లింది అధ్యక్షా. చాలా పరిమితమైన రంగాలలోనే ఉంది అవకాశం. అలాగే బొమ్మయ్ కేసులో 1994లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చేదాకా అధ్యక్షా, 356వ అధికరణాన్ని ఇష్టమొచ్చినన్ని సార్లు, నూటికిపైగా సందర్భాలలో ఢిల్లీలో అధికారంలో ఉన్న ప్రభుత్వం రాష్ట్రాల్ని తాబేదార్లుగా మార్చి ఇష్టమొచ్చినట్టు చేశారు.

అత్యధిక సందర్భాలలో కాంగ్రెస్ పార్టీ అనుచిత రీతిలో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే, జనతా ప్రభుత్వం రాగానే 1977లో వాళ్లూ ఆ పనే చేశారు. బి.డి జెట్టి ఆనాడు ఉప రాష్ట్రపతి. రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ మరణించారు. బి.డి జెట్టిని బలవంతంగా, బెదిరించి మరీ ఆనాటి హోంమంత్రి, ఉప ప్రధాని చరణ్ సింగ్ గారు సంతకం పెట్టించారు రాష్ట్ర ప్రభుత్వ రద్దు మీద. కేంద్రంలో అధికారంలో ఉన్న వారి చిత్తానుసారం రాష్ట్రంలో ప్రభుత్వాలు ఉంటాయి, రాష్ట్ర ప్రజల మనోభావాలతో, వారి ఓటుతో, వారి సమ్మతితో నిమిత్తం లేదు అనే భావన ఆనాటి దాకా ఉంది అధ్యక్షా. అది 1994లో బొమ్మయ్ జడ్జిమెంట్ తర్వాత మారింది. అంబేద్కర్ ఏ రకంగానైతే ఈ 356వ అధికరణం రాజ్యాంగంలో *it must be a dead letter* అని ఆనాడు అన్నారో అధ్యక్షా, అదే సంకల్పం నెరవేరింది. అలాగే ప్రాంతీయ పార్టీలు పెరగటం, జాతీయస్థాయిలో ఏకపార్టీ పరిపాలన తొలగటం, వీటి కారణంగా ఇక ఇష్టమొచ్చినట్టు, మాకు ఏది నచ్చితే అది చేస్తాం, మీరెవరు అడగటానికి అనే పద్ధతి పోయి, ఈ రాచరిక ధోరణులు, నియంతృత్వ ధోరణులు పోయి, ఫెడరల్ వ్యవస్థ బలపడింది అధ్యక్షా.

ఈ నేపథ్యంలో మనం ఆలోచించాలి. మధ్యప్రదేశ్, యూపీ, బీహార్‌లో కూడా ఇదే పద్ధతిని అనుసరించారు. అధ్యక్షా, బీహార్‌లో ఇంతకుముందే చెప్పాను. ఆ రాష్ట్రంలో అందరినీ ఒప్పించారు. కాబట్టి నేను అన్ని ప్రాంతాల ప్రజలనీ సవినయంగా కోరేది– తెలంగాణ ఖచ్చితంగా ఏర్పాటు కావాలి. అది అవసరం. అది అనివార్యం. కానీ ఆ ఏర్పాటు మన ఫెడరల్ వ్యవస్థకి తూట్లు పొడిచేది కాకుండా జరగాలి. అంటే, రాయలసీమ, కోస్తాంధ్రలకి న్యాయం జరగాలి, వాళ్లని ఒప్పించాలి. ఏకపక్షంగా కాదు. రాయల తెలంగాణను ఎందుకు వ్యతిరేకించామో మనం గుర్తుంచుకోవాలి. ఢిల్లీ వాళ్లు ఇష్టం వచ్చినట్టు చేస్తే మేం అంగీకరించం అనే సంకేతాన్ని ఈ రాష్ట్రంలో ప్రజలు ఇప్పటికే స్పష్టంగా ఇచ్చారు. ఈ తెలంగాణ అంశంలోనే ఇచ్చారు. అదే సిద్ధాంతానికి మనం కట్టుబడి ఉండాలి.

అధ్యక్షా, అయితే పరిష్కారం ఏమిటి? నిజంగా మూడు ప్రాంతాలలో అందరినీ, ముఖ్యంగా యువతని అంగీకరింప చేయటం సాధ్యమా? నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను అధ్యక్షా– నూటికి నూరుపాళ్లూ సాధ్యం. అధ్యక్షా, రాజకీయ సరిహద్దులు జీవితాల్ని గందరగోళపరచ కూడదు. తెలుగు ప్రజలు చెన్నయ్‌లో ఉన్నారు, బెంగళూరులో ఉన్నారు, ఇతర రాష్ట్రాల్లో ఉన్నారు, వారు ఏ తేడాల్లేకుండా అన్ని హక్కులతో ఉన్నారు. ఎక్కడున్నా తెలుగువాళ్లు తెలుగువాళ్లే. ప్రజలంతా ఒక్కటే, భాష ఒక్కటే, సాహిత్యం ఒక్కటే, సంస్కృతి ఒక్కటే. రాష్ట్ర విభజన జరిగితే రోడ్డు మీద అడ్డుగోడలు ఉండవు. మ్యాప్‌ల మీద గీతలు జనం మధ్య గోడలు కారాదు. రాజ్యాంగ హక్కులు అందరికీ వర్తిస్తాయి అధ్యక్షా. ఈ ఉద్దేశంతోనే రాజ్యాంగంలోని 14వ అధికారంలో పెట్టారు అధ్యక్షా. చాలా లోతుగా ఆలోచించి పెట్టారు అధ్యక్షా. అమెరికన్ రాజ్యాంగంలో కూడా ఆ తర్వాత బిల్ ఆఫ్ రైట్స్ ఎమెండ్‌మెంట్స్ రూపంలో వచ్చినాయి గానీ రాజ్యాంగ నిర్మాణంలో దాని గురించి పట్టించుకోలేదు. అధ్యక్షా, మన రాజ్యాంగంలో ఆర్టికల్ 14 ఏం చెబుతోంది? – *Equality before law and equal protection of law.* చట్టం ముందు అందరూ సమానమే, చట్టం నుంచి రక్షణ అందరికీ సమానమే. ఇవి రెండూ రాజ్యాంగం మనకిచ్చిన రక్షణలు అధ్యక్షా. ఏ అధికారి ఇచ్చినవీ కావు, ఏ నాయకుడు ఇచ్చినవీ కావు, ఏ ప్రభుత్వం ఇచ్చినవీ కావు, ఏకోర్టు ఇచ్చినవీ కావు. ఆర్టికల్ 15 అధ్యక్షా, *There shall be no discrimination.* మిగతావన్నీ చెప్పారు,కులం, మతం, వగైరావగైరా అన్నీ చెబుతూనే *on grounds of birth,* పుట్టిన స్థలం కారణంగా ఏ వ్యక్తి పట్లా వివక్ష ఉండటానికి అవకాశం లేదు రాజ్యాంగపరంగా. అధ్యక్షా, ఆర్టికల్ 16– *even in public employment, equality of oppurtunity in public employment.* అధ్యక్షా, ఆర్టికల్ 19 (1) (డి) – *Right to move throughout the territory of India.* దేశంలో ఎక్కడికైనా వెళ్లవచ్చు. ఆర్టికల్ 19 (1) (ఇ) – *Right ot reside in any part of India.* ఒక్క షెడ్యూల్డ్ ఏరియాలలో, మన రాష్ట్రంలో షెడ్యూల్డ్ ఏరియాలు, ట్రైబల్ ఏరియాలుగా పరిగణించి రాష్ట్రపతి ఆదేశాలు ఇస్తే తప్ప, మిగిలిన అన్ని చోట్లా కూడా రైట్ టు ట్రావెల్, రైట్ టు రిసైడ్, రైట్ టు ప్రాక్టీస్ ఎ ప్రొఫెషన్, రైట్ టు ఎంజాయ్ ఎ లైవ్లీహుడ్, ప్రొటెక్షన్ ఆఫ్ లాస్ అండ్ ఈక్వాలిటీ బిఫోర్ లా. అలాగే అధ్యక్షా, ప్రత్యేకమైన సంస్కృతి ఉన్నట్టయితే మైనారిటీల రక్షణ కోసం ఆర్టికల్ 29 ఏర్పాటు చేసుకున్నాం. 51 (ఎ)లో మనం ప్రాథమిక విధుల్లో తర్వాత 1975–76లో

వచ్చినటువంటి దాన్లో మనం మరోమారు పెట్టుకున్నాం. అధ్యక్షా, *the duty to promote harmony and spirit of common brotherhood amongst all the people of India, transcending religious, regional or sectarian discrimination.* అధ్యక్షా, ఠాగోర్ చెప్పాడు, *where the world is not fragmented by narrow domestic walls,* అలాంటి లోకానికి వెళ్లాలి ప్రభూ అని చెప్పాడు.

అధ్యక్షా, ఈ సభలో విభేదాలు రాష్ట్రంలో విభేదాలకు నిదర్శనం. వాటి వెనక ఒక పక్క ప్రజల ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయి, మరోపక్కన భవిష్యత్తు పట్ల భయాలు, ఆందోళనలు ఉన్నాయి. దీనికి కీలకం అధ్యక్షా, ఆర్థిక సమస్య. కొన్ని మానసికమైనవి తొలగించటం తేలికేగానీ, ఆర్థిక సమస్యలు ఉన్నాయి అధ్యక్షా. ఇది చాలా, అత్యంత కీలకమైన అంశం. ఇది సభలో చర్చకు రాలేదు. అధ్యక్షా, 2012-13 అంకెలు మీ ముందు పెడుతున్నాను. చాలా జాగ్రత్తగా నిపుణులు పరిశీలించి పెట్టిన అంకెలు మీ ముందు పెడుతున్నాను అధ్యక్షా. 2012-13లో ఇప్పటిదాకా తేలిన అంకెల ప్రకారం అధ్యక్షా, రాష్ట్ర సొంత వనరులు, పన్నులుగా వచ్చినా, పన్నేతర రూపాలలో వచ్చినా రూ.75,854 కోట్లు ఉండగా, కేంద్రం నుంచి వచ్చిన రూ.27,986 కోట్లు కలిసి అధ్యక్షా రూ.1,03,840 కోట్లు రాష్ట్ర వనరులు. ఆపైన అప్పులు వగైరాలు కలిపి రూ.1,27,877 కోట్లు అధ్యక్షా ఈ రాష్ట్ర వనరులు 2012-13లో గత ఆర్థిక సంవత్సరంలో. ఖర్చు పెట్టింది రూ.1874 కోట్లు ఎక్కువ అధ్యక్షా. దీన్లో, ఈ రూ.1,27,877 కోట్లలో రూ.58,680 కోట్లు *non-divisable receits.* అంటే ఇది ఈ జిల్లాకి, ఈ గ్రామానికి, ఈ పట్టణానికి చెందినదని విభజించలేనటువంటి వనరులు రూ.58,680 కోట్లు. ఏమిటివీ- సెంట్రల్ ట్యాక్స్ షేర్, కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే పన్నుల వాటా. కేంద్రం నుంచి ఇతరత్రా అందేటువంటి గ్రాంట్లు, వివిధ పథకాల నిధులు. మనం రాష్ట్రం మొత్తం మీద నుంచి అప్పుతీసుకుంటున్నాం. ఈ ఊరి కోసమని తీసుకోవటం లేదు. ఇతర అడ్జెస్ట్‌మెంట్లు కలిపితే అధ్యక్షా రూ.58,680 కోట్లు. దీన్ని జనాభా దామాషా ప్రకారం గనక కేటాయించినట్టయితే, ఈ నాన్‌డివిజబుల్ ఎసెట్స్ రూ.58,680 కోట్లని, అంటే కోస్తాంధ్రకి 40శాతం, రాయలసీమకి 18శాతం, 42శాతం హైదరాబాద్‌తో కూడిన తెలంగాణకి, మనకి విషయం అర్థం కావటానికి 34 శాతం హైదరాబాద్ లేని తెలంగాణకి, హైదరాబాద్‌కి 8శాతం గనక కేటాయించినట్టయితే అధ్యక్షా చాలా విచిత్రమైన విషయాలు బైటపడతాయి. దీనికి పరిష్కారం కావాలి ఇవాళ. ఎందుకింత ఆందోళన చెలరేగుతోందంటే, దీనికి పరిష్కారం కోసం. అధ్యక్షా, కోస్తాంధ్రలో ఆదాయం రూ.47,837 కోట్లు కాగా, ఖర్చు సుమారుగా అంతే ఉంది 2012-13లో. ఈ సంవత్సరం బహుశా ఖర్చు ఎక్కువ ఉంటుంది. ఎందుకంటే, మనకి పి.ఆర్.సి ఉంది, మిగతా ఖర్చులు పెరుగుతాయి, ఇన్‌ఫ్లేషన్ పెరుగుతుంది. అధ్యక్షా, రూ.680 కోట్లు గత సంవత్సరం మిగులున్నది కోస్తాంధ్రలో.

కానీ నిజమైన సమస్య అధ్యక్షా రాయలసీమలో ఉంది. రూ.18,215 కోట్లు అన్నిరూపాలలో ఇక్కడ ఆదాయం ఉంది. పన్నులు, పన్నేతర ఆదాయం, కేంద్రం నుంచి వచ్చే వాటాలో అవిభాజ్య వనరుల్ని రాయలసీమకు కేటాయిస్తే రూ.18,215 కోట్లు వనరులుండగా ఖర్చు రూ.25,220 కోట్లు అధ్యక్షా. రాష్ట్రంలో ఇది స్పష్టంగా అర్థం కావాలి అధ్యక్షా. ఇప్పటిదాకా ఈ విషయాలపై పెద్దగా చర్చ జరగలేదు. అంటే, రూ.7,005 కోట్లు రాయలసీమ ప్రాంతంలో లోటు ఉన్నది అధ్యక్షా. ఈ సంవత్సరంలో 2014-15లో మీరు బడ్జెట్ ఎప్పుడు ప్రవేశపెడతారో, మరి ఓటాన్ బడ్జెట్ వస్తుందో తెలియదు, కానీ 2014-15లో ఈలోటు బహుశా రూ.9,000 కోట్లకి వెళ్తుంది అధ్యక్షా రాయలసీమ ప్రాంతాన్ని మనం చూసినట్టయితే. తెలంగాణ ప్రాంతంలో అధ్యక్షా హైదరాబాద్‌ని మినహాయిస్తే, రూ. 41,392 కోట్లు ఆదాయం ఉంటే, రూ.49,799 కోట్లు ఖర్చు ఉంది అధ్యక్షా. అంటే రూ.8,407 కోట్లు లోటు ఉంది. అధ్యక్షా, మరెక్కడ్నుంచి ఈ లోటు భర్తీ అవుతోంది? హైదరాబాద్ నగరంలో అధ్యక్షా, రూ.20,022 కోట్లు మొత్తం కలిపి ఆదాయం ఉంది. హైదరాబాద్ నగరానికి చెందిన ఆదాయం ఇది, వసూళ్లయినవి చెప్పటంలా. అమ్మకాల్ని ఎక్కడివక్కడ పంచే ఏర్పాటు చేస్తే, ఇక్కడ వ్యాట్ ఇక్కడ వసూలు చేసినా కూడా కరీంనగర్, కర్నూలు, ఒంగోలులో అమ్ముడుపోతే ఆ కరీంనగర్, కర్నూలు, ఒంగోలు చేర్చిన తర్వాత చెప్పే లెక్కలివి అధ్యక్షా. రూ.20,022 కోట్లు హైదరాబాద్ నగరానికి చెందిన ఆదాయం వస్తే, కేంద్రం నుంచి హైదరాబాద్ వాటాని జనాభాను బట్టి పెడితే, రూ.7,168 కోట్లు ఖర్చు అధ్యక్షా. అంటే హైదరాబాద్ నగరం రాష్ట్రంలో లోటును భర్తీ చేస్తోంది. ఒక్క మన రాష్ట్రమే కాదు దేశం మొత్తంలో అన్ని రాష్ట్రాలలో మహానగరాల నుంచి వచ్చే వనరులు, జనం మహానగరాలకు వస్తున్నారు గ్రామాల నుంచి. అలాగే ప్రజల టాలెంట్ వస్తున్నది. కానీ ఆర్థిక వ్యవస్థ ఉన్నదంతా కూడా పట్టణాలు, నగరాలు, మహానగరాల్లో ముఖ్యంగా. ఎందుకంటే, సర్వీస్ సెక్టార్ అక్కడే ఉన్నది, మాన్యుఫ్యాక్చరింగ్ దాని చుట్టూనే ఉన్నది, ఫైనాన్షియల్ సెక్టార్ అక్కడే ఉన్నది, వ్యవసాయంలోనేమో 16శాతం మాత్రమే మనకు ఈవేళ జి.డి.పిలో, ఈ దేశ ఆదాయంలో వాటా, స్థూల ఆదాయంలో వాటా ఉన్నది. మన రాష్ట్రంలో అది 18శాతం ఉ

ండి ఉండవచ్చు. కాబట్టి సంపద అంతా కూడా పట్టణాల్లో, నగరాల్లో చేరుతోంది కాబట్టి, ఒక్క ఢిల్లీని మినహాయిస్తే, ఢిల్లీ వాళ్ల అదృష్టం కొద్దో, దురదృష్టం కొద్దో యూనియన్ టెరిటరీ కాబట్టి, ఢిల్లీలో వచ్చిన డబ్బులన్నీ వాళ్లే ఖర్చుపెట్టుకోవచ్చు. కానీ మిగతా నగరాలలో ఆ నగరం ఆ రాష్ట్రాలను పోషిస్తుంది. ఆ కారణంగా అధ్యక్షా, హైదరాబాద్ నగరంలో రూ.12,854 కోట్ల మిగులు ఉన్నది. అధ్యక్షా, తెలంగాణ ప్రజల ఆకాంక్ష మనమంతా అంగీకరించేది, హైదరాబాద్ నగరం తెలంగాణలో భాగం కావాలి. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ కావాలి. అది ఏర్పాటు చేసినప్పుడు అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వానికి ఒక బాధ్యత ఉంది. విభజన పర్యవసానం వల్ల నష్టపోతున్న ప్రాంతాలకు మీరు ఏం చేస్తారు? అధ్యక్షా, దానికి పరిష్కారం ఎలా వస్తుందో ఒకసారి మీ ముందుకు తీసుకొస్తాను. ఒకసారి ఎట్లా ఉందనేది. మొత్తం ఆంధ్రప్రదేశ్‌ని చూస్తే మనకి కనిపించదు.

అధ్యక్షా, మనకి *population density*- జనసాంద్రతను చూస్తే, తెలంగాణలో చదరపు కిలోమీటరుకి 307మంది ఉంటే, కోస్తాంధ్రలో 368 మంది ఉన్నారు, రాయలసీమలో 225 మంది ఉన్నారు. వర్షపాతం తెలంగాణలో 904 మిల్లీమీటర్లు ఉంటే, కోస్తాంధ్రలో 1078 మిల్లీమీటర్లు, రాయలసీమలో 714 మిల్లీమీటర్లు. మంచినీళ్లు లేనటువంటి, ఇంట్లో మంచినీళ్లు లేనటువంటి కుటుంబాలు 2011 *Census* ప్రకారం, దీన్లో ప్రతి ఒక్కటీ అధికారికంగా ప్రకటించిన లెక్కలు అధ్యక్షా, తెలంగాణలో 46శాతం ఇళ్లలో లేవు, 61 శాతం కోస్తాంధ్రలో లేవు, 71 శాతం రాయలసీమలో లేవు. ఇంట్లో మరుగుదొడ్లు లేక బహిరంగ మలవిసర్జనకు వెళ్లాల్సిన కుటుంబాలను లెక్కేస్తే, 48 శాతం తెలంగాణలో మరుగుదొడ్లు లేవు, 49 శాతం కోస్తాంధ్రలో లేవు, 61 శాతం రాయలసీమలో లేవు. అధ్యక్షా, తలసరి ఆదాయాన్ని లెక్కేస్తే, రూ.55,145 తెలంగాణలో (అడ్డుకుంటున్న సభ్యులకు సమాధానమిస్తూ– కరెక్టే, హైదరాబాద్ ఉండబట్టే. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ అంటున్నాం గదా మనం. వాస్తవాల్ని తేల్చుకుందాం. అంకెల విషయంలో అసహనమైతే ఎట్లాగ స్వామీ? *Facts are sacred, Opinions are cheap. We must respect facts and address facts. That's the only way we can get the solution.* దయచేసి వినండి స్వామీ. వినండి. పూర్తిగా వినండి), రూ. 55,145 హైదరాబాద్‌తో కూడిన తెలంగాణలో ఉంటే, రూ.54,130 కోస్తాంధ్రలో ఉంటే, రూ.43,000 రాయలసీమలో అధ్యక్షా తలసరి ఆదాయం. అధ్యక్షా, వ్యవసాయ ఉత్పాదకత, అంటే, *per hectare,* రెండున్నర ఎకరాలకి ఎంత ఉత్పాదకత వస్తుందో డబ్బుల రూపంలో లెక్కించారు. అధ్యక్షా, డబ్బుల రూపంలో. ఊరికే ఉత్పత్తి కాదు గదా. ఏ రేటు ఎంత లెక్కేస్తే తలసరి వచ్చేది. ఇది రూ.20,200 తెలంగాణ ప్రాంతానికి, రూ.33,000 కోస్తాంధ్రకి, రూ.15,300 రాయలసీమకి అధ్యక్షా. హెక్టేరుకి అధ్యక్షా ఇది. హెక్టేరు ఉత్పత్తి. నెట్ కాదు, గ్రాస్. గ్రాస్ ఉత్పత్తి రెండున్నర ఎకరాలకి.

అధ్యక్షా, ఇరిగేషన్ ఇంటెన్సిటీ. అది లెక్కిస్తే, 50శాతం తెలంగాణకి, 60శాతం కోస్తాంధ్రకి, 25 శాతం రాయలసీమకి అధ్యక్షా. అధ్యక్షా, మ్యాన్యుఫ్యాక్చరింగ్ గ్రోత్ 2001 నుంచి 2006 దాకా ఐదేళ్ల కాలంలో. తర్వాతి లెక్కలు ఇంకా రాలేదు. ఐదేళ్ల కాలంలో మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో, ఉద్యోగాలనిచ్చే ఉత్పత్తి రంగంలో, వార్షిక ఎదుగుదల ఎట్లా ఉందని చూస్తే అధ్యక్షా, తెలంగాణలో 11శాతం, కోస్తాంధ్రలో 8.5శాతం, రాయలసీమలో −2 శాతం. అంటే, ప్రతి ఏడాదీ 2శాతం ఉత్పత్తి పడిపోతున్నది అధ్యక్షా రాయలసీమలో. అధ్యక్షా, గత 57 ఏళ్లల్లో 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రులనిచ్చింది రాయలసీమ. అదొక్కటే పాపం రాయలసీమకి సంతృప్తి. కానీ బీదరికం, వెనకబాటుతనం మన రాష్ట్రంలో బాగా ఎక్కువగా ఉన్నది రాయలసీమలో. అధ్యక్షా, ఇది ప్రకృతి శాపం మాత్రమే కాదు, ఇది పాలకుల పాపం. అధ్యక్షా, ఇంతకంటే తక్కువ వనరులున్నా కూడా, ఇంతకంటే తక్కువ వర్షపాతం ఉన్నా కూడా అద్భుతంగా ఎదిగినటువంటి దేశాలున్నాయ్, రాష్ట్రాలున్నాయ్. అధ్యక్షా, ఇజ్రాయిల్‌లో వర్షపాతం లేదు, కానీ ఎదిగింది. ఎందుకంటే, ముందుచూపున్న పాలన వల్ల. అధ్యక్షా, మనదేశంలో గుజరాత్‌కి రాయలసీమ కంటే ఎక్కువ వర్షపాతమేమీ లేదు. కానీ చాలా వేగంగా ఎదుగుతోంది అధ్యక్షా ఆర్థికంగా. రాయలసీమ వెనకబాటుతనం కేవలం ప్రకృతి శాపం మాత్రమే కాదు పాలకుల పాపం అధ్యక్షా.

అధ్యక్షా, దీనికి పరిష్కారం ఏమిటి? పరిష్కారం కావాలంటే అధ్యక్షా, దేశంలోని ఇతర ప్రాంతాలలో ఏం జరుగుతోందో ఒక్కసారి చూద్దాం. మన సమస్యను మనకే పరిమితం చేసుకుని కూపస్థ మండూకాల్లా ఉంటే పరిష్కారం దొరకదు మన రాష్ట్రంలో ప్రజలకి, అన్ని ప్రాంతాలకీ. అధ్యక్షా, దేశంలో 11 ప్రత్యేక ప్రతిపత్తి గల రాష్ట్రాలున్నాయి. ఈశాన్య భారతంలో 7 ఉన్నాయి, హిమాలయ సానువుల్లో మూడు ఉన్నాయి, ఇంకోటి జమ్మూ కాశ్మీర్. దాన్లో అధ్యక్షా, మనతో, మన రాయలసీమ ప్రాంతాన్ని తీసుకున్నట్టయితే, దాంతో పోల్చదగ్గ నాలుగు రాష్ట్రాలను నేను తీసుకున్నాను అధ్యక్షా. అస్సాం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాంచల్, జమ్మూ కాశ్మీర్. మిగతావి మరీ చిన్న రాష్ట్రాలు. సిక్కిం, లేకపోతే మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్, కొన్ని వేల జనాభాలో ఉన్నవి లెక్కకు తీసుకోవాల్సిన పనేలేదు. అధ్యక్షా, వీటిల్లో 3 కోట్ల 10

లక్షలేమో అస్సాం జనాభా 2011 లెక్కల ప్రకారం, 68 లక్షలేమో హిమాచల్ ప్రదేశ్ జనాభా, 1 కోటీ 1 లక్ష ఉత్తరాంచల్ జనాభా, 1 కోటీ 25 లక్షలు జమ్మూ కాశ్మీర్ జనాభా. 1 కోటీ 51 లక్షలు రాయలసీమ జనాభా అధ్యక్షా. మీరు చూడండి అధ్యక్షా, రాయలసీమను ఈ రాష్ట్రాలతో పోలిస్తే కరెక్టుగా అదేస్థాయిలో ఉందని అర్థమవుతుంది. జనసాంద్రతలో అస్సాం 397, హిమాచల్ ప్రదేశ్ 123, ఉత్తరాంచల్ 189, జమ్మూ కాశ్మీర్ 56, రాయలసీమ 225. అధ్యక్షా, *infant mortality rate.* అంటే శిశుమరణాల రేటు చూస్తే, 55 అస్సాంలో, 38,36,31 ఇతర ప్రత్యేక ప్రతిపత్తి రాష్ట్రాలలో, 44.5 రాయలసీమలో. అక్షరజ్ఞానం. 72శాతం అస్సాం, 83శాతం హిమాచల్ ప్రదేశ్, 79శాతం ఉత్తరాంచల్, 67 శాతం జమ్మూ కాశ్మీర్, 66శాతం రాయలసీమ. 2011 గణాంకాలు అధ్యక్షా, సెన్సస్ లెక్కలివి. అలాగే అధ్యక్షా, మహిళల విద్య, ఆడపిల్లల విద్య– 56శాతం అస్సాం, 67 శాతం హిమాచల్ ప్రదేశ్, 61 శాతం ఉత్తరాంచల్, 49 శాతం జమ్మూ కాశ్మీర్, 56 శాతం రాయలసీమ.

మనందరం కలిసి దేశం నుంచి పొందే ప్రయత్నం చేస్తున్నాం. దాని కోసం మన వాదన ఉండాలి. ఈవేళ తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర కాదు, ముగ్గురం కలిసి ఢిల్లీ మీద పోరాడి తెచ్చుకుంటే అందరికీ లాభమని చెబుతున్నాను. దయచేసి దీని మర్మాన్ని గుర్తించండి. ఇంగ్లీషులో లేదు కాబట్టి మనసు విప్పి చెబుతున్నాను. మనందరం కూడా ఇలాగా మనలో ఒకరి మీద ఒకరు వల్ల లాభం లేదు. మనందరం కలిసి ఢిల్లీ నుంచి ఎలా తెచ్చుకోవాలో ఆలోచించాలి. మిగతావాళ్లు అర్థం చేసుకున్నారు. పంజాబ్ విభజన జరిగినప్పుడు హిమాచల్ ప్రదేశ్‌ని ప్రత్యేక రాష్ట్రం చేశారు. ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చారు వాళ్లు. మనకెందుకు ఇవ్వరు వాళ్లు అదే అంకెలుంటే ఇక్కడ. అధ్యక్షా, మంచినీళ్లు లేనటువంటి గ్రామాలు, మంచినీళ్లు లేనటువంటి ఇళ్లు అధ్యక్షా, 45శాతం అస్సాంలో, 44శాతం హిమాచల్‌లో, 42శాతం ఉత్తరాంచల్‌లో, 52శాతం జమ్మూ కాశ్మీర్‌లో, 71శాతం రాయలసీమలో. అధ్యక్షా, లెట్రిన్ లేనటువంటి ఇళ్లు 35శాతం అస్సాం, 31శాతం హిమాచల్, 34శాతం ఉత్తరాంచల్, 41శాతం జమ్మూ కాశ్మీర్, 61శాతం రాయలసీమ. అధ్యక్షా, బీదరికంలో ఉన్న కుటుంబాలు– 32శాతం అస్సాం, 8శాతం హిమాచల్, 11శాతం ఉత్తరాంచల్, 10శాతం జమ్మూ కాశ్మీర్, 28శాతం రాయలసీమ. అధ్యక్షా, తలసరి ఆదాయం– రూ.27,200 అస్సాం, రూ.50,365 హిమాచల్, రూ.59,594 ఉత్తరాంచల్, రూ.30,600 జమ్మూ కాశ్మీర్, రూ.42,000 రాయలసీమ. మళ్లీ దీన్లో కూడా మీరు హిమాచల్ కంటే, ఉత్తరాంచల్ కంటే రాయలసీమ తక్కువ అధ్యక్షా. అధ్యక్షా, ఇదే సమయంలో, ఎందుకీ విషయం తీసుకొచ్చానంటే, కేంద్రం నుంచి వచ్చే నిధుల్ని చూడండి. కేంద్రం నుంచి ఆ రాష్ట్రాలకు వచ్చే నిధుల్ని చూడండి. మన రాష్ట్రానికి గానీ, రాయలసీమకు గానీ వచ్చే నిధుల్ని చూడండి అధ్యక్షా. చాలా కీలకమైన అంశాలు అధ్యక్షా. ప్రస్తావనకు రాని అంశాలు. చర్చ కావాలి అధ్యక్షా. కేంద్రం నుంచి మనందరం కలిసి ఉమ్మడిగా సాధించుకోవాలి.

అధ్యక్షా, కేంద్రం నుంచి వచ్చిన నిధులు అస్సాం 3 కోట్ల 11 లక్షల జనాభాకి రూ.15,157 కోట్లు. అధ్యక్షా, హిమాచల్ ప్రదేశ్ 68 లక్షల జనాభాకి రూ.6,910 కోట్లు సెంట్రల్ గ్రాంట్స్. ఉత్తరాంచల్, 1 కోటీ 1 లక్ష జనాభాకి (అడ్డుపడిన సభ్యులకు సమాధానమిస్తూ– ఇంతకంటే ముఖ్యమైనదే ముందండీ రాష్ట్ర శాసనసభలో. ఏం మాట్లాడుతున్నారు మీరు? ఎందుకంత ఆవేశం? కాదండీ, ఇది ఆంధ్రప్రదేశ్ శాసనసభ. నేను తెలంగాణ గురించి మాట్లాడతాను, రాయలసీమ గురించి మాట్లాడతాను, కోస్తాంధ్ర గురించి మాట్లాడతాను, భారతదేశం గురించి మాట్లాడతాను. అది నా హక్కు, నా బాధ్యత. దయచేసి కూర్చోండి).

అధ్యక్షా, కేంద్రమిచ్చిన నిధుల్ని చూసినట్టయితే, ఉత్తరాంచల్ 1 కోటీ 1 లక్ష జనాభాకి రూ.5,582 కోట్లు వస్తే, జమ్మూ కాశ్మీర్‌కి 1 కోటీ 25 లక్షల జనాభాకి రూ.18,186 కోట్లు వస్తే, అధ్యక్షా, రాయలసీమకి 1 కోటీ 81 లక్షల జనాభాకి వచ్చేనిధులు రాయలసీమ జనాభా ప్రకారం దామాషా విభజన చేస్తే, రూ.2,691 కోట్లు అధ్యక్షా. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికిచ్చేనిధులు మొత్తం కలిపితే సెంట్రల్ గ్రాంట్స్ రూ.14,949 కోట్లు అధ్యక్షా.

అధ్యక్షా, లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అవసరం, అనివార్యం అని స్పష్టంగా ప్రకటిస్తుంది అధ్యక్షా. అధ్యక్షా, అదే నేపథ్యంలో ఈవేళ తెలుగు ప్రజలందరూ కూడా మూడు ప్రాంతాలలో కలిసి మన హక్కుల్ని సాధించుకుందాం, సామరస్యమైన పరిష్కారాన్ని తెచ్చుకుందాం, విద్వేషాల్ని పక్కనపెడదాం, తెలుగువాళ్లు ఇంతకంటే ఎక్కువ పెరిగే ఏర్పాటు చేసుకుందాం అంటే,దానికి హిమాచల్ ప్రదేశ్ వద్దా అధ్యక్షా పోలిక? దానికి ఉత్తరాంచల్ వద్దా అధ్యక్షా పోలిక? దానికి అస్సాం వద్దా అధ్యక్షా పోలిక? దానికి జమ్మూ కాశ్మీర్ వద్దా అధ్యక్షా పోలిక? అంటే భారతదేశంలో భాగంగా లేమా మేము? భారతదేశంలో భాగంగా ఉండి, ఆ రాష్ట్రాలకు ఏమి వస్తున్నాయి? దాంతో సమానంగా లేక అంతకంటే వెనకబడ్డ మన రాష్ట్రంలో ఉన్న ప్రాంతాలకి ఏమి వస్తున్నాయి? – ఈ లెక్కలు చూడకుండా అధ్యక్షా, మనందరం కూడా అన్నదమ్ముల మధ్య కలహం పెట్టుకుంటే, జ్ఞాతి వైరం పెట్టుకుంటే అధికారం కోసం పోరాటమవుతుంది, మన వేళ్లతో మన కళ్లు

పోదుచుకోవటమవుతుంది. దీనికి పరిష్కారం కావాలీ అంటే అధ్యక్షా, మీ ద్వారా గౌరవ సభ్యులకి తెలియచేస్తున్నాను- ఖచ్చితంగా దేశంలో ఏం జరుగుతోంది, కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఏం చేస్తోంది, వెనకబడిన ప్రాంతాలకి రాజ్యాంగంలోగానీ, ప్రణాళికా సంఘంలోగానీ, మన పద్ధతుల్లో గానీ ఎలాంటి ఏర్పాట్లున్నాయి, మన రాష్ట్రంలో ఆ ఏర్పాట్లు ఎందుకు కాకూడదు- ఆ పోరాటం చేయకుండా, మనలో మనం తన్నుకుని జీరో సమ్ గేమ్‌గా, నీకు ఒక రూపాయి వస్తే నాకు నష్టం, నాకు ఒక రూపాయి వస్తే నీకు నష్టం అనుకుంటే అధ్యక్షా, ఒకళ్ల వేళ్లతో మరొకరి కళ్లు పొడుచుకుంటున్నాం. ఇన్నేళ్లుగా ఈ రాష్ట్రంలో జరిగిన రాజకీయం అదే. ప్రజల భవిష్యత్తుని బాగుచేయటం కోసం కాకుండా ఎట్లాగొట్లా ఎన్నికల్లో నెగ్గాలని ఎన్నికల దృష్టితో రాజకీయ ఎత్తుగడలు సాగినై. అధ్యక్షా, కనీసం ఈ సమయంలోనైనా, తెలుగు ప్రజల రాజకీయం అంపశయ్య మీద ఉన్నప్పుడైనా సరే, తెలుగు నేల తల్లడిల్లుతున్నప్పుడైనా సరే, ఇప్పుడైనా సరే మనం కొంచెం వైషమ్యాలను పక్కనబెట్టి ఇప్పటికైనా మనం మెళకువ తెచ్చుకుందాం. వైషమ్యాలను పక్కనబెట్టి తెలంగాణ ఏర్పాటు చేసుకుందాం, హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను ఏర్పాటు చేసుకుందాం, అదేసమయంలో మిగిలిన తెలుగు ప్రజలు లేదా భారతదేశంలో మిగతా ప్రజలు నాశనం కావాలనా మన కోరిక? వాళ్ల బతుకుల్ని ఎట్లా బాగుచేద్దాం మనకి నష్టం లేకుండా, మనందరం కలిసి ఏ రకంగా పోరాడదాం? - ఇది చెప్పటం కోసం అధ్యక్షా నేను సమయం తీసుకున్నది. అంతేగాని, ఇది మన మధ్య వైరానికి దారితీయాల్సిన పన్లేదు.



అధ్యక్షా, మీరు ఆయా రాష్ట్రాలకి ఉన్న మొత్తం ఆదాయ వనరుల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి గ్రాంట్ల శాతం చూడండి. అస్సాం రాష్ట్రంలో, అస్సాం ఈశాన్య భారతంలో అతి పెద్ద రాష్ట్రం అధ్యక్షా. 3 కోట్ల 11 లక్షల జనాభా ఉన్న అస్సాం రాష్ట్రంలో రాష్ట్ర బడ్జెట్‌లో, రాష్ట్ర వనరుల్లో కేంద్రం నుంచి వచ్చే డబ్బు 40.3 శాతం అధ్యక్షా. హిమాచల్ ప్రదేశ్ 42.3శాతం అధ్యక్షా, మనకంటే ఎక్కువ తలసరి ఆదాయం ఉంది. మనకంటే ఎక్కువ అక్షరాస్యత ఉన్నది. హిమాచల్ నాకు ఇష్టమైన రాష్ట్రం అధ్యక్షా. వాళ్లు బాగుపడుతున్నారని నేను బాధపడటం లేదు. వాళ్లు బాగుపడాలి, మనం బాగుపడాలి అని కోరుకుంటున్నాను. మనకంటే అక్షరాస్యత ఎక్కువ, మనకంటే మంచినీళ్లు ఎక్కువ, మనకంటే బీదరికం తక్కువ, మనకంటే మరుగుదొడ్లు ఎక్కువ, మనకంటే ఆర్థికాభివృద్ధి ఎక్కువ, తలసరి ఆదాయం ఎక్కువ అధ్యక్షా వారికి. ఉత్తరాంచల్ 34.3 శాతం అధ్యక్షా. వారి తలసరి ఆదాయం కూడా మనకంటే ఎక్కువ అధ్యక్షా. రాయలసీమ కంటే రెట్టింపు ఉంది ఉత్తరాంచల్‌లో తలసరి ఆదాయం. అధ్యక్షా, జమ్మూ కాశ్మీర్ 60.7శాతం. అధ్యక్షా, రాయలసీమలో 12.8శాతం.

సోదరులు అడుగుతున్నారు, మూడు ప్రాంతాలనీ చూడాలి గదా అని. మూడు ప్రాంతాలనీ చూడాలి గదా అని. మూడు ప్రాంతాల గురించీ నేను ఎందుకు చెప్పటం లేదంటే అధ్యక్షా, ఒకటి సమయం పోతుందని, రెండోది, మన తలసరి ఆదాయం, మిగతా గణాంకాలు చూస్తే, మనం ప్రత్యేక ప్రతిపత్తి కోసం పోరాడితే జరగదు కాబట్టి. మనం ఎక్కడైతే బలహీనత ఉందో, ఎక్కడ వెనకబాటుతనం ఉందో, ఎక్కడ కష్టం ఉందో దాన్ని అవకాశంగా మలచుకుందాం. తెలుగు ప్రజలందరికీ భవిష్యత్తు బాగుండేందుకు మనం ఢిల్లీ నుంచి నిధులు తెచ్చుకుందాం. నిధులతో ఆగటం లేదు అధ్యక్షా, అన్ని ప్రాంతాలలో అభివృద్ధిని సాధించటానికి మార్గాలను కూడా చెప్పబోతున్నాను అధ్యక్షా చివరిగా.

అధ్యక్షా, రాయలసీమకే గనక, ఇందాక నేను చెప్పిన 11 రాష్ట్రాలలో 4 రాష్ట్రాల వివరాలిచ్చాను, మిగతా 7 రాష్ట్రాల వివరాలు చూస్తే మీకు అర్థమవుతుంది, ఆ రాష్ట్రాలకున్న ఏర్పాటే చేసినట్టయితే, ఒక ప్రత్యేక ప్రతిపత్తి గల ప్రాంతంగా గుర్తించినట్టయితే, ఒకవేళ ప్రజలే కోరుకుంటే రాయలసీమ ప్రజలే కోరుకున్నట్టయితే, అవసరమైతే ప్రత్యేక రాష్ట్రమే ఏర్పాటు చేసినట్టయితే, లేదా ప్రాంతీయ ప్రతిపత్తినిచ్చి రక్షణ కోసం ఏర్పాట్లు చేసినట్టయితే అధ్యక్షా, జరగబోయేది చూడండి ఒక్కసారి. మొట్టమొదటిది, ఏడాదికి రూ.10,000 కోట్లు అదనంగా మనకి కేంద్రం నుంచి గ్రాంట్లు వస్తాయి. మిగతా ప్రాంతాలకి మన డబ్బు మనకి వస్తూనే, మిగతా ప్రాంతాలకి మనం తెచ్చుకుంటూనే, రాయలసీమకి అదనంగా వచ్చేది అధ్యక్షా రూ.10,000 కోట్లు ఏడాదికి. ఈవేళ రూ.7,000 కోట్లు, ఈ సంవత్సరం బహుశా రూ.9,000 కోట్లు లోటున్నది. ఆ లోటు తొలగిపోతుంది. అధ్యక్షా, ఇతర రాష్ట్రాల్లో ఏం చేశారో చూడండి. మన రాష్ట్రంలో ఉన్న పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు పోయి ఒక ఉత్తరాంచల్‌కి

వెళ్లి, ఒక హిమాచల్ ప్రదేశ్‌కి వెళ్లి, మీరంతా కనుక్కోండి పెద్దలంతా, మీరు అనుభవం ఉన్నవాళ్లు, పరిశ్రమలు తెలిసిన వాళ్లు, పారిశ్రామికవేత్తలు అక్కడ ఫ్యాక్టరీలు పెడుతున్నారు. ఎందుకు పెడుతున్నారు? ఎందుకు పెడుతున్నారు అధ్యక్షా? ఎందుకంటే, 100శాతం ఎక్సయిజ్ డ్యూటీ ఎగ్జంప్షన్ ఇచ్చారు. అంటే మాన్యుఫ్యాక్చరింగ్‌కి 100శాతం ఎక్సయిజ్ డ్యూటీ ఎగ్జంప్షన్ 20 ఏళ్ల పాటు. అధ్యక్షా, కార్పొరేట్ ఇన్‌కమ్ ట్యాక్స్, పరిశ్రమల ఆదాయం మీద ఆదాయం పన్ను వందశాతం మినహాయింపు 20 ఏళ్ల కాలం. ఆ తర్వాత మరో 20 ఏళ్ల కాలం 30శాతం మినహాయింపు అధ్యక్షా. ఒక్క పరిశ్రమ పెడితే 25-30 శాతం ఉత్పత్తి ఖర్చు తగ్గుతుంది మీకు. ఖచ్చితంగా పోటీపడతారు మిగతావాళ్లు. అందుకనే మన రాష్ట్రంలో తెలుగువాళ్లు, తెలుగు పారిశ్రామికవేత్తలు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాంచల్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో వస్తే సంతోషమే అధ్యక్షా, కానీ వాళ్లు అంత తేలిగ్గా ఒప్పుకోరు. కానీ రాయలసీమ వెనకబాటుతనం ఉన్న ప్రాంతం, ఇదిగో లెక్కలు చూడండి, ఆ ప్రాంతాలతో పోల్చండి, మీకు ప్రత్యేక ప్రతిపత్తి కావాలి అని అడగటం మన హక్కు అధ్యక్షా. ఆ హక్కును మనం పొందినట్టయితే, పదుల వేల కోట్ల పెట్టుబడి అక్కడికి వచ్చినట్టయితే, లక్షలమందికి ఉపాధి వచ్చినట్టయితే, దీంతోపాటు కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్స్ సెస్‌ని 15శాతం, దీంతోపాటు ఫీడ్ సబ్సిడీ- ఇవన్నీ అమలైతే అధ్యక్షా, రాయలసీమకి కేవలం తెలుగు ప్రాంతాల నుంచే కాదు - అధ్యక్షా, ఈవేళ ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న రాష్ట్రాలు, ఈ పన్ను మినహాయింపు ఉన్న రాష్ట్రాలు, ఇది చాలా కీలక అంశం, కేవలం ఆ ఉత్తరాదికి చెందిన రాష్ట్రాలలో మాత్రమే ఉన్నాయి, దక్షిణ భారతంలో గానీ, *Peninsular India*లోగానీ, ద్వీపకల్పంలోగానీ, భారతదేశంలో ఇంకొక ట్యాక్స్ హెవెన్ లేదు. మరొక పన్ను రాయితీ ఉన్న ప్రాంతం లేదు, నేను చెప్పేదది.

రాయలసీమ కోసం మాత్రమే కాదు, మనందరి కోసం చెబుతున్నా. కాబట్టి అప్పుడేమవుతుంది అధ్యక్షా- చెన్నయ్ నుంచి పెట్టుబడులు వస్తాయి, హైదరాబాద్ నుంచి వెళతాయి, కోస్తాంధ్ర నుంచి వెళతాయి, బెంగళూరు నుంచి వస్తాయి. చెన్నయ్ బెంగళూరు మధ్య ఉందా ప్రాంతం. అధ్యక్షా, అంతటితో ఆగవు. పెనిన్సులర్ ఇండియాలో ఎక్కడా లేదు కాబట్టి, ముంబయి నుంచి వస్తాయి మనకి అధ్యక్షా, పూణె నుంచి వస్తాయి. ఇవి మినహాయిస్తే, ఇక దేశంలో ఆర్థిక కేంద్రాలు మూడు ఉన్నాయి. కలకత్తా- అక్కడ్నుంచి మనం పెద్దగా ఆశించలేం. దూరం ఎక్కువైనందు వల్ల. ఢిల్లీ- అక్కడ్నుంచీ ఆశించటంలా. ఆ పక్కనే ఉత్తరాంచల్, హిమాచల్ ఉన్నాయి. వాళ్లు అక్కడ చూసుకుంటారు. బహుశా అహ్మదాబాద్- అక్కడెలాగూ ఆర్థిక ప్రగతి బాగుంది కాబట్టి వాళ్లు పెద్దగా రాకపోవచ్చు. కానీ అధ్యక్షా, దేశంలో 8 ప్రధాన ఆర్థిక కేంద్రాలలో దేశంలో 8 ప్రధాన పెట్టుబడి కేంద్రాలలో- మార్కెటింగ్ తెలిసిన ప్రతి ఒక్కరికీ తెలుసు- ఈ ఎనిమిదీ ముఖ్యం మనదేశంలో- మార్కెటింగ్‌లో 50శాతం ఉన్నది. ఈ 8 కేంద్రాలలో 5 కేంద్రాల నుంచి అధ్యక్షా, మన తెలుగు నేలకి పెట్టుబడులు తరలివస్తాయి. మనం పెట్టుబడి పెడతాం. హైదరాబాద్‌లో అందరూ పెట్టుబడులు పెట్టుకోలేదా? ఇతర ప్రాంతాల నుంచి వచ్చి, అన్ని రాష్ట్రాల నుంచి వచ్చి, అధ్యక్షా, ఇది కేవలం రాయలసీమకి కాదు, తెలుగు ప్రజలందరికీ. ఇది దక్షిణ భారతదేశం మొత్తానికీ, పెనిన్సులర్ ఇండియాలో ప్రజలందరికీ కూడా ఇది విన్,విన్,విన్ సొల్యూషన్ అధ్యక్షా.

అధ్యక్షా, దీని కోసం మనం ఉమ్మడిగా పోరాడాలి. అధ్యక్షా, నేను కోరేది ఈవేళ విద్వేషాల స్థానంలో, ఈ ఆందోళనల స్థానంలో, ఈ అసూయ వైషమ్యాల స్థానంలో, ఈ రాజకీయ ఎత్తుగడల స్థానంలో తెలుగు ప్రజలంతా కలిసి ఉమ్మడిగా కేంద్రం మీద పోరాడాలి. ఏ ఒక్కరికీ నష్టం లేకుండా, అందరి ఆనందాల్నీ చూస్తూనే, అందరి ఫలితాల్నీ కాపాడుకుంటూనే, తెలంగాణ ప్రాంతానికి హైదరాబాద్‌ని పూర్తిగా ఇస్తూనే, దాన్ని అంగీకరిస్తూనే, అదేసమయంలో తెలుగు నేల మీద పెట్టుబడులు వచ్చేందుకు, ఉపాధి కల్పించేందుకు, ఆర్థికంగా నష్టం నివారించేందుకు ఏర్పాట్లు కావాలి అధ్యక్షా. అందుకే ఓ హీబ్రూ రుషి అన్నాడు- *If I am not for myself, then who is?* నా కోసం నేను పోరాడకపోతే, తెలుగు ప్రజల కోసం, తెలుగు ప్రాంతాల కోసం తెలుగు ప్రజలుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ పోరాడకపోతే ఇంకెవరు అధ్యక్షా పోరాడేది? మనలో మనం తన్నుకు చావటమా పరిష్కారం వచ్చేది అధ్యక్షా? *If I am for myself only, then what am I?* నేను కేవలం నా నియోజకవర్గం కోసమే పోరాడతానా? నా జిల్లా కోసమే పోరాడతానా? నా ప్రాంతం కోసమే పోరాడతానా? తెలుగునాట కోసం, భారతదేశం కోసం పోరాడతానా? *If not now, when?* ఇప్పుడు కాకపోతే పోరాటం ఇంకెప్పుడు అధ్యక్షా?

అందుకే అధ్యక్షా, తెలంగాణ పది జిల్లాలు హైదరాబాద్‌తో కూడి ఏర్పాటు కావాలి. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు. మౌలిక సదుపాయాలకి గడువు పెట్టి తెలంగాణ ప్రాంతానికి పూర్తిగా న్యాయం చేసే ఏర్పాటు కావాలి. కేంద్ర నిధుల నుంచి ఆ మౌలిక సదుపాయాలను తెలంగాణ ప్రాంతంలో ఏర్పాటు చేయాలి. రాయలసీమకి రెవిన్యూలోటు భర్తీ చేయాలి. అదనపు సాయాన్ని

అందించాలి. మనకు పన్ను మినహాయింపుల్ని ప్రత్యేక ప్రతిపత్తి రాష్ట్రానికిచ్చినట్టు ఇవ్వాలి. అదనపు సాయాన్ని వారికిచ్చినట్టు మనక్కూడా ఇవ్వాలి. ప్రత్యేక ప్రతిపత్తిగల రాష్ట్రంగా గుర్తించాలి. అవసరమైతే, ప్రజలు కోరుకుంటే, ప్రత్యేక ప్రతిపత్తి రాష్ట్రంగా రాయలసీమను గుర్తించాలి. తీర ప్రాంతానికి అధ్యక్షా, తీర ప్రాంత ఆధారిత పరిశ్రమలు కావాలి. పోలవరం ప్రాజెక్టు, ఇప్పటికే చెప్పారు, అది పూర్తి కావాలి. అందరికీ ఉపయోగపడుతుంది, మిగిలిన ప్రాంతాలకూ ఉపయోగపడుతుంది. రామాయపట్నం పోర్టు కావాలి. అధ్యక్షా, కేవలం దుగ్గరాజపట్నం పోర్టు ఇచ్చారు. కానివ్వండి, అక్కడ రానివ్వండి. కానీ అధ్యక్షా, దుగ్గరాజపట్నం ఉత్తరాన కృష్ణపట్నానికి, దక్షిణాన చెన్నయ్‌కి మధ్య ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం కోరింది రామాయపట్నం. అదొచ్చినట్టయితే గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో ఆర్థికాభివృద్ధి వస్తుంది. మూడు పోర్టులు ఒక్కచోటే పెడితే, అది చాలదు అధ్యక్షా. పులికాట్ సరస్సున్నది అక్కడ, 2,500 ఎకరాలు మాత్రమే భూమి ఉన్నది అక్కడ. కాబట్టి దుగ్గరాజపట్నం తీసుకురండి, అది ఇచ్చారు కాబట్టి.దాంతోపాటు రామాయపట్నం పోర్టుని ఏర్పాటుచేసి ఆ మధ్య డెల్టా ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధికి ఏర్పాట్లు చేయాలి. మౌలిక సదుపాయాలకు గడువు పెట్టాలి, కేంద్రం పూర్తి సాయానికి బిల్లులో రూపొందించాలి. దానికి ఖచ్చితంగా హామీ కాదు, మాటలు కాదు, నోటి మాటలు నీటి మీద రాతలు అధ్యక్షా, చట్టబద్ధంగా కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియాకి ఇది ఛార్జ్ అవుతుంది, ఇదిగో ఈ అంశాల మీద ఖర్చంతా భారత ప్రభుత్వం నుంచి వస్తుంది అని స్పష్టంగా, రాతపూర్వకంగా ఉండాలి అధ్యక్షా.

హైదరాబాద్ నగరం అందరిదీ అధ్యక్షా. ఇది తెలంగాణకు రాజకీయంగా చెందుతుంది. ఆర్థికంగా, ఉపాధిపరంగా తెలుగునాట అందరి ప్రజలదీ. భారతదేశంలో అందరి ప్రజలదీ. దాన్నెవరూ, ఏనాడూ, ఎప్పుడూ కాదనరు, ఎప్పుడూ ఇప్పటిదాకా అనలేదు, ఇక ముందు కాదనరు అధ్యక్షా. రాజ్యాంగ హక్కుల అమలు కోసం ఏర్పాట్లు కావాలి. ఈ బిల్లులో అధ్యక్షా, కొంతమంది చెప్పారు. 8వ సెక్షన్‌లో ఏం చెప్పారు అధ్యక్షా, రాష్ట్ర ప్రభుత్వాలకున్న అధికారంలో మొట్టమొదటి అధికారమేంటి అధ్యక్షా?- లా అండ్ ఆర్డర్, పబ్లిక్ ఆర్డర్. రాష్ట్ర ప్రభుత్వ అధికారంలో ఉన్నది.ఈ బిల్లులో ఎంత హాస్యాస్పదంగా పెడతారు అధ్యక్షా? రాష్ట్ర ప్రభుత్వానికున్న అధికారాలని గవర్నర్‌కి ఎలా ఇచ్చేస్తారు? ఏ చట్టం కింద? ఏ రాజ్యాంగం కింద? ఇదే ప్రభుత్వం 1986 సంవత్సరంలో 55వ రాజ్యాంగ సవరణ చేసి అరుణాచల్ ప్రదేశ్‌లో గవర్నర్‌కి అధికారం ఇవ్వాలని సంకల్పించినప్పుడు రాజ్యాంగాన్ని సవరించారు. 371 (హెచ్) తీసుకొచ్చారు. అంటే, ఏదోకరకంగా అబద్ధాలతో, తెలుగు ప్రజలంతా కూడా వెర్రిబాగులోళ్లు, వాళ్లలో వాళ్లు కొట్టుకుంటారు తప్ప మా మీద పడరు, మనం ఏం చేసినా చెల్లుతుంది, ఒక సామ్రాజ్యవాదాన్ని కొనసాగించవచ్చన్న భావనతో తప్ప- తెలుగు ప్రజలకు సాయం ఎలా అందిస్తాం, అదనంగా, ఆర్థికంగా ఎలా నిలబెట్టే ఏర్పాటు చేద్దాం, ఉపాధి కల్పనకు ఏం చేద్దాం, రాజ్యాంగబద్ధంగా అందరూ అంగీకరించే రీతిలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఎలాంటి ఏర్పాట్లు చేద్దాం అన్న ఆలోచన లేకుండా పిచ్చిపిచ్చిగా, ఇష్టమొచ్చినట్టుగా, ఎన్నికల ఎత్తుగడగా బిల్లు వచ్చింది అధ్యక్షా.

అధ్యక్షా, తెలంగాణ ఏర్పాటు తెలంగాణ ప్రజల ఆకాంక్ష. యువత ఆకాంక్ష. లోక్‌సత్తా అందుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నది. అయితే ఈ బిల్లు మాత్రం పూర్తిగా లోపభూయిష్టమైనది. బిల్లులో విభజన అనంతరం తెలుగు ప్రజల భవిష్యత్తు కోసం ఏ ఏర్పాట్లు లేవు. నిర్దిష్టమైన ఏర్పాట్లని ప్రతిపాదించాం. దానికి కారణాలను హేతుబద్ధంగా ప్రతిపాదించాం వాస్తవాల ఆధారంగా. వెంటనే కేంద్ర ప్రభుత్వం దీన్ని తీసుకొస్తే అధ్యక్షా, 3 రోజుల్లో అందర్నీ ఒప్పించొచ్చు అధ్యక్షా. ఆ ప్రయత్నం జరిగినట్టయితే ఆలస్యం జరగక్కర్లేదు. ఆ బిల్లు తీసుకురండి. తెలంగాణకి గుండె గాయమైతే అధ్యక్షా, కోస్తాలో కన్నీరు రావాలి. రాయలసీమలో దెబ్బ తగిలితే తెలంగాణ ప్రజలు అమ్మా అనాలి. కోస్తాలో నష్టం జరిగితే రాయలసీమలో వేదన కలగాలి. అధ్యక్షా, పదేళ్లయిన తర్వాత, ఈ రాష్ట్రాల విభజన పూర్తయిన తర్వాత తలెత్తుకుని తెలుగు ప్రజలు అన్ని ప్రాంతాలలో చెప్పగలగాలి అధ్యక్షా, ఒక తమిళనాడుకో, ఒక మహారాష్ట్రకో, ఒక కర్ణాటకకో - బంతిని ఎంత గట్టిగా కొడితే అంతలా పైకి లేస్తాం మేం, మంచి ఏర్పాట్లు మేం చేసుకున్నాం, ఉమ్మడిగా మేం పోరాడి సాధించుకున్నాం, ఇదిగో అన్ని రాష్ట్రాల కంటే మేం ఆర్థికంగా పెరిగాం, ఉపాధిని మేం కల్పించుకున్నాం, తెలుగు ప్రజల ఐక్యతను మీరు చీల్చలేరు, ఎన్ని రాష్ట్రాలు ఏర్పాటైనా కూడా 42 మంది పార్లమెంటు సభ్యులం తెలుగు ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పోరాడతాం మేం, ఎవరికీ రాజీపడం మేం, తెలుగు వాళ్ల వైభవం కోసం మేం కలిసి పోరాడతాం- అనే పరిస్థితి రావాలి అధ్యక్షా. అలా ఆలోచించకుండా మనం ఇప్పుడు విద్వేషాలను పెంచుకుంటూ పోతే, మన మధ్య సామరస్యతను సాధించకపోతే అధ్యక్షా, మూడు ప్రాంతాలూ శరీరాలు వేరైనా కూడా గుండె కాయ ఒకటేనని మర్చిపోతాం.

చివరి అంశం అధ్యక్షా, రాష్ట్రాల విభజన అయిపోతే పరిష్కారాలు అయినట్టేనా? లోక్‌సత్తా తొలినుంచీ చెబుతోంది- రాజ్యవ్యవస్థను మార్చకుండా రాజధానిని మార్చినంత మాత్రాన,

రాష్ట్రాలను ఏర్పాటు చేసినంత మాత్రం చేత ప్రజల బతుకుల్లో పన్నీరు ఒలకదు అధ్యక్షా. కంట కన్నీరే ఒలుకుతుంది. అధ్యక్షా, ప్రతి బిడ్డకీ ఎదిగే అవకాశాలు ఉండాలి. చాలామంది సభ్యులు, ఏ ప్రాంతం వారైనా కూడా, మిగతా విషయాల్లో వివాదాలున్నా కూడా ఈవేళ పుట్టిన బిడ్డలకు పుట్టిన పరిస్థితుల వల్ల, కులం వల్ల, తల్లిదండ్రుల చదువు, ఆదాయం వల్ల అవకాశాలు లేకుండా పోతున్నాయన్నది నూటికి నూరు శాతం ఒప్పుకునే వాస్తవం అధ్యక్షా. స్కూళ్లలో పిల్లల్ని పెట్టి 99.9 శాతం అని మనం చెప్పుకుంటే అది విద్య కాదు అధ్యక్షా. పనికొచ్చే విద్య ఈ రాష్ట్రంలో అందటం లేదు నూటికి 90 మందికి. 7వ తరగతి చదివే వాళ్లకి కనీసం ఒక భిన్నం, 1/3,2/5 ఈ రెంటిలో ఏది పెద్దది నాన్నా అని అడిగితే చెప్పే పరిస్థితి నూటికి 90 మందికి లేదు అధ్యక్షా. నేను ఊరికే చెప్పటం లేదు ఈ మాట. మీరు పరీక్ష చేసుకోండి. 1/3,1/4 ఏది పెద్దది అంటే చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారు అధ్యక్షా. నిస్సారమైనటువంటి కాగితాలతో చదువును చూపెడుతున్నాం. అంటే డబ్బున్నవాడి కొడుకే, డబ్బున్నవాడి కూతురే, పదువున్నవాడి కొడుకు కూతురే, చదువుకున్నవాడి కొడుకు కూతురే, వాళ్లకే బతుకు, వాళ్లకే ఆదాయం తప్ప మిగతా వాళ్లంతా బానిస బతుకులు బతికే ఏర్పాట్లను చేస్తున్నాం అధ్యక్షా. నివారించదగ్గ క్లేశం ఇది. నివారించగలిగిన బాధకు నాకు కన్నీళ్లు రావు అధ్యక్షా. జరిగిందేదో జరిగిపోయింది, కన్నతల్లి పోవచ్చు, కన్నతండ్రి పోవచ్చు, వృద్ధాప్యంలో మరణం సహజం, ఏదైనా నివారించలేని జబ్బు వస్తే మనం బాధపడటం తప్ప చేయగలిగిందేమీ లేదు. కానీ నివారించగలిగిన బాధ ఉంటే, ఆ బాధని తొలగించక పోవటం వల్ల లక్షలాదిమంది ఈవేళ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో కన్నీరు కారుస్తున్నారు. దాన్ని తొలగించే ప్రయత్నం చేయకపోతే, ప్రతి బిడ్డకీ ఎదిగే అవకాశాలు లేకపోతే, మన బిడ్డల భవిష్యత్తుని కాపాడకపోతే అధ్యక్షా, ఇవన్నీ కూడా కేవలం రాజకీయ ఎత్తుగడలే అవుతాయి. తాత్కాలికంగా ఓట్ల కోసం ఇది వచ్చింది, రేపొద్దున ఇంకోటి వస్తుంది.

ఈ మొత్తం సమస్యకి ప్రధాన కారణం అధ్యక్షా– అధికార కేంద్రీకరణ. రాయలసీమ ప్రాంతవాసులు ఇంతగా నష్టపోతున్నా, దగా పడుతున్నా నోరు మెదపకపోవటానికి కారణం, మా ముఖ్యమంత్రి ఉన్నాడు గదా అనుకుంటున్నారు తప్ప మా బతుకులు బాగోలేదు అనుకోవటం లేదు అధ్యక్షా. 30 ఏళ్లు ముఖ్యమంత్రులైనారు, ఏమైంది అధ్యక్షా? – ముఖ్యమంత్రి పదవి కుంటే అసలు మొత్తం అధికారమంతా ఆయన చుట్టూనే. మంత్రులంతా కూడా నిరర్థకం. అధికారులు, శాఖాధిపతులు ఊరికే కాగితం మీద. బడిపంతులు బదిలీ కావాలంటే, ముఖ్యమంత్రికి ఫైలు కావాలి. ఈ సభలోనే ఎన్నో సార్లు చెప్పానీ మాట అధ్యక్షా. ఇక ఇతర ప్రభుత్వాలు, మునిసిపాలిటీలనుగానీ, పంచాయతీలనుగానీ, జిల్లా పరిషత్‌లను గానీ, కార్పొరేషన్లను గానీ ఉత్సవ విగ్రహాలుగా మార్చేశాం అధ్యక్షా. దాన్ని మార్చాలి. కుడి చేయికి, ఎడమ చేయికి సంబంధం లేకుండా పోయింది అధికార కేంద్రీకరణ వల్ల. రాజకీయమంతా ముఖ్యమంత్రి చుట్టూ తిరుగుతున్నది. రాజ్యవ్యవస్థని మార్చాలి అధ్యక్షా. ప్రతి గల్లీలో, ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో, ప్రతి వార్డులో, ప్రతి పంచాయతీలో, ప్రతి మునిసిపాలిటీలో, ప్రతీ జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు కావాలి అధ్యక్షా. అధ్యక్షా, నూటికి 90 అంశాలు నా జీవితాన్ని స్పృశించే అంశాలు, మంచోచెడో ఇక్కడే నిర్ణయమవుతాయని అనుకునే ఏర్పాట్లు కావాలి. అది జరగకపోతే లాభం లేదు. అధ్యక్షా, అన్నీ హైదరాబాద్‌లో పెట్టుకుని కూర్చోవటం వల్ల వచ్చిన సమస్య ఇది. ఇక ముందు ఆ పొరపాటు జరగకూడదు అధ్యక్షా. రాజధానిని కూడా విభజించాలి. ప్రతి ప్రాంతంలో కూడా అసెంబ్లీ, సెక్రటేరియట్ ఉండొచ్చు. కానీ సమ్మర్ కేపిటల్ ఇంకోచోట పెట్టండి లేదా వింటర్ కేపిటల్ పెట్టండి, ఫైనాన్షియల్ కేపిటల్ ఇంకో చోట పెట్టండి, హైకోర్టు మరోచోట పెట్టండి, మాన్యుఫ్యాక్చరింగ్ రంగం ఇంకోచోట పెట్టండి, సర్వీస్ సెక్టార్ ఇంకోచోట పెట్టండి, విద్యాసాంస్కృతిక రంగాలు మరోచోట పెట్టండి, అంతేతప్ప అన్నీ ఒకేచోట పెట్టి, అక్కడ ఉన్నవాళ్లందరికీ మోదం, మిగతావాళ్లందరికీ ఖేదం, ఇది సరైన పద్ధతి అవదు అధ్యక్షా, భవిష్యత్తులో కూడా. ఇది కరీంనగర్‌కి వర్తించాలి, వరంగల్‌కి వర్తించాలి, నల్గండకు వర్తించాలి, ఖమ్మంకు వర్తించాలి, కర్నూల్‌కి వర్తించాలి, చిత్తూరుకి వర్తించాలి, తిరుపతికి వర్తించాలి, కడపకు వర్తించాలి, అనంతపూర్‌కి వర్తించాలి, అధ్యక్షా శ్రీకాకుళంకి వర్తించాలి, విజయనగరంకి వర్తించాలి, ఒంగోలుకి వర్తించాలి.

అధ్యక్షా, ఇప్పుడు కూడా వార్తలు వింటున్నాం. అధ్యక్షా, ఒక పార్లమెంటు సీటు కావాలంటే, రూ.35 కోట్లు నజరానా ఇస్తున్నారని వార్త వింటున్నాం. పెట్టే ఖర్చు 50 కోట్లు కావచ్చు. అసెంబ్లీకి మనందరికీ తెలుసు, మీరు నన్ను కాదనటం కోసం ఆ మాట అంటారు తప్ప, 5 నుంచి 10 కోట్లు లేకుండా అసెంబ్లీ ఎన్నిక అనవసరం అని మనందరికీ తెలుసు. ఈ పార్టీ, ఆ పార్టీ అని లేకుండా, ఒక్క లోక్‌సత్తా మినహాయిస్తే. అధ్యక్షా, వాస్తవాలను మరుగున పరచలేరు. ఎందుకు? నేనెవరి మీదా కోపంతో మాట్లాడటం లేదు. మనం ఇప్పటికైనా పాఠాలు నేర్చుకుందామని చెబుతున్నాను. నిజాయతీగా మాట్లాడుకుందాం. అధ్యక్షా, రాజకీయమంటే ఇసుక, రాజకీయమంటే గనులు, మైనింగ్

లీజులు, రాజకీయమంటే ట్రాన్స్‌పోర్ట్, ట్రాన్స్‌పోర్ట్ లైసెన్సులు, రాజకీయమంటే భూమి, భూముల పందేరాలు, భూముల మీద ఆధిపత్యం, రాజకీయమంటే గుత్తాధిపత్యం, ఓట్ల కొనుగోలు - దీన్ని మార్చకపోతే అధ్యక్షా, ఈవేళ సమస్య ఈ రూపంలో వచ్చింది, ఏదో పరిష్కారాన్ని తాత్కాలికంగా తీసుకొస్తాం, కానీ ఏదోకరూపంలో ఈ సమస్య పునరావృతమవుతుంది. అధ్యక్షా, అవినీతిని గురించి ఈ సభలోనే ఎంతో చర్చ జరిగింది. ఎన్నిసార్లు ప్రయత్నించినా కూడా అవినీతి అంతం కోసం స్పష్టమైన చట్టాలను ప్రతిపాదించినా కూడా ఈ సభలో చర్చించేందుకు ఒక్క నిముషం మనసు రాలేదు మనకు. ఈ దేశంలో ప్రజలు ఆగ్రహావేశాలతో ఊగిపోతున్నారు, యువతకు రాజకీయం మీద కసి పుట్టింది, ద్వేషంతో రగిలిపోతున్నారు, రాజకీయంలో ఉన్నామంటే మనమందరం క్షమాపణ చెప్పుకోవాల్సి వస్తోంది సామాన్య ప్రజలకి- క్షమించదయ్యా, నేను అట్లాంటి వాడిని కాను అని ప్రతి ఒక్కళ్లకీ చెప్పుకోవాల్సి వస్తోంది. మన పిల్లలే కొన్ని సందర్భాలలో మనల్ని గేలి చేస్తున్నారు. ఇప్పటికైనా మార్చుకోవాలనే ప్రయత్నం చేయకపోతే అధ్యక్షా, ఎన్ని రాష్ట్రాలు ఏర్పాటైనా, ఎన్ని చట్టాలు వచ్చినా ఫలితం ఉండదు.

అధ్యక్షా, గవర్నమెంట్ ఆఫీస్‌కి వెళితే మన కుటుంబ సభ్యులు సైతం, చదువుకున్నవాళ్లు సైతం, కాస్తోకూస్తో విషయం తెలిసినవాళ్లు సైతం ఓ పట్టాదారు పాసు పుస్తకం కోసం వెళ్తే, ఒక భూమి రికార్డు కోసం వెళ్తే, మీకొక ల్యాండ్ సర్వే కోసం వెళ్తే, ఒక వాటర్ కనెక్షన్ కోసం వెళ్తే, ఒక పవర్ కనెక్షన్ కోసం వెళ్తే, అధ్యక్షా, ల్యాండ్ రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే భూములు కొనుక్కుంటే, ఇళ్ల స్థలాలు కొనుక్కుంటే, ఇంకా ఎన్నో పనులకు వెళ్తే, పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్ కోసం వెళ్తే, లంచం లేకుండా ఎన్ని సందర్భాలలో ఎంతమందికి పనులవుతున్నాయి అధ్యక్షా? అధ్యక్షా, ఇన్ని లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నామే, 1 లక్షా 27 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టామని చెబుతున్నామే బడ్జెట్‌లో, 1 లక్షా 62వేల కోట్ల రూపాయల బడ్జెట్‌ని 2013-14కి మనం రూపొందిచుకున్నామే, ఇంత ఖర్చు పెట్టాక సామాన్య ప్రజలకు అందవలసిందేమిటి? నా హక్కుగా ఉన్న పనికూడా కాకపోతే ఇంకేమిటి అధ్యక్షా? ఇంక మన మీద నమ్మకం ఎందుకుంటుంది? కసి ఉంటుంది, కోపం ఉంటుంది, ద్వేషం ఉంటుంది, అసహనం ఉంటుంది, దాన్ని తప్పించుకోవటం కోసం ఒక రోజు కులాన్ని తెస్తున్నాం, ఇంకోరోజు మతాన్ని తెస్తున్నాం, మరోరోజు ప్రాంతాన్ని తెస్తున్నాం, మరోరోజు కుటుంబాన్ని తెస్తున్నాం. ఎంతకాలం అధ్యక్షా, తప్పించుకోవటం? అధ్యక్షా, సర్వీస్ డెలివరీ కావాలి. దానికి చట్టాన్ని లోక్‌సత్తాయే రూపొందించి పార్లమెంటు ముందు పెట్టింది. అది అమలుకావాలి, ఈ రాష్ట్రంలో దాన్ని తీసుకురావాలి.

అధ్యక్షా, ఇందాకే చెప్పాను, ఆర్థికంగా వికేంద్రీకరణ కావాలి. మళ్లీ గతంలోజరిగిన తప్పు జరగకూడదు. ప్రతి నగరంలో మనకి సమగ్రమైన ఏర్పాట్లు కావాలి. ఈ రాష్ట్రంలో 22 జిల్లాల్లో 22 నగరాలు రావాలి. మరో 200 పెద్ద పట్టణాలు, ప్రతి పట్టణంలో పదుల వేలమందికి ఉపాధి కల్పించి, వ్యవసాయాన్ని, పరిశ్రమలను అనుబంధం చేసే పట్టణాలు కావాలి. ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరింప చేసి యువతకు భవిష్యత్తు కల్పించాలి. ఉపాధి కల్పించటం, విద్యను అందించటం, అవకాశాలనివ్వటం, ఆర్థిక ప్రగతికి బాటల్ని వేయటం- ఇవి మాత్రమే రాజకీయానికి లక్ష్యం కావాలి. అధ్యక్షా, అందుకోసం తగిన ఏర్పాట్లు, ఇప్పటికైనా చేయకపోతే, మనమన రాష్ట్రాలలో, ఏ రాష్ట్రాలైనా కావచ్చు, రాష్ట్రాల విభజన ముందు కావచ్చు, తర్వాత కావచ్చు, ఆ ఏర్పాట్లు చేయకపోతే అధ్యక్షా, చరిత్ర మనల్ని క్షమించదు. యువత కాస్తా రగిలిపోతారు. అందుకే జోసియో హోలెండ్ అన్నాడు అధ్యక్షా, *GOD, give us men! A time like this demands,* ఇలాంటి సందర్భం, ఇలాంటి సంక్షోభంలో నిజంగా మానవత్వం, ఔన్నత్యం నిండిన మనుషులు కావాలి అని, *strong minds,* దుర్భల మనస్కులు కాదు, పిరికిపందలు కాదు, *great hearts,* సంకుచిత మనస్కులు కాదు, *true faith and ready hands; Men whom the lust of office does not kill,* అధికార లాలస కబళించని మనుషులు కావాలి అధ్యక్షా. మనందరికీ తెలుసు, నేనెవరినీ విమర్శించదల్చుకోలేదు. మన రాష్ట్రంలో సంక్షోభానికి మూలకారణం మనకి తెలుసు- అధికార లాలస, అధికారం పట్ల ఉన్న ఆకాంక్ష. సమాజం మొత్తాన్ని కూడా సమాధి చేసినా పర్లేదు, అధికారం కావాలి, అధికారం నిలుపుకోవాలి. అది తప్ప మరొకటి రాజకీయాన్ని శాసించటం లేదు. *Men whom the lust of office does not kill; Men whom the spoils of office cannot buy,* అధికారం కొనలేని మనుషులు కావాలి, అధికారానికి లొంగని మనుషులు కావాలి, *Men who can speak truth with power,* ధైర్యంగా అధికారం ముందు నిజాన్ని నిర్భయంగా చెప్పే మనుషులు కావాలి అధ్యక్షా. అధ్యక్షా, *Men who have honor,* ఆత్మగౌరవం ఉన్న మనుషులు కావాలి. నిజమైన ఆత్మగౌరవం, అహంకారం ఉన్న మనుషులు కాదు, గర్వమున్న మనుషులు కాదు, నిజమైన ఆత్మగౌరవమున్న మనుషులు కావాలి. *Men who will not lie,* అబద్ధాలాడని మనుషులు కావాలి, అసత్యాలు పలకని మనుషులు కావాలి, వాస్తవాల్ని చెప్పే ధైర్యమున్న మనుషులు కావాలి, అప్రియమైన సత్యాల్ని చెప్పేటువంటి పటుత్వమున్న మనుషులు కావాలి. అధ్యక్షా, *tal men,* పొడుగాటి మనుషులు కావాలి, *Sun crowned,* సూర్యుడ్ని కిరీటంగా చేసుకున్న మనుషులు కావాలి, *truly above*

*the fog*, ఈ మబ్బుల్ని ఛేదించిన, *In public duty and private thinking*, జన జీవనంలో, వ్యక్తి జీవనంలో, అలాంటి మనుషులు కావాలి అధ్యక్షా. ఇప్పటికైనా, ఇన్ని తప్పులు జరిగాకైనా సరే, ఈ పొరపాట్లన్నీ కూడా సరిచేసుకుందాం ఈ వైషమ్యాలను పక్కనపెట్టి. మనందరికీ ఒకేఒక్క జీవితకాలముంది. ఈ దేశంలో కోటానుకోట్ల మందితో పోలిస్తే, నూటికి 99 మందితో పోలిస్తే, మనం చాలా అదృష్టవంతులం. ప్రతి ఒక్కళ్లం లక్షలమందిని మార్చేటువంటి, ఎంతో కొంత మార్చేటువంటి అవకాశం ఉన్నటువంటి వాళ్లం. మనం మాట ఇవ్వాళ మాట్లాడుతుంటే, కోట్లాదిమంది మనం ఏమన్నా పనికొచ్చే మాటలు మాట్లాడతామని, కోట్లాదిమంది తిలకిస్తున్నారు, వింటున్నారు, ఆలోచిస్తున్నారు. ఎంత అదృష్టం అధ్యక్షా! మన కుటుంబాల్ని, మన జీవితాల్ని కాకుండా, కోట్ల మంది మనుషుల భవిష్యత్తుని గురించి ఆలోచించే అవకాశం, ఆ చర్చను ప్రవేశపెట్టేటువంటి మహత్తరమైనటువంటి భాగ్యం, సమాజంలో మార్పు తెచ్చేటువంటి ఓ గొప్ప సువర్ణమైన అవకాశం ఎంతమందికి ఉంటుంది అధ్యక్షా!

ఒక అపురూపమైన ప్రజాస్వామ్యంలో ఉన్నాం, ఒక పేద దేశంలో ఉన్నాం, ఇంకా అణగారినవాళ్లు ఎంతోమంది ఉన్న సమాజంలో ఉన్నాం అధ్యక్షా, ఈవేళ దీన్నుంచి బైటపడాలి అంటే, తెలుగు ప్రజలకి మంచి జరగాలి, ఈ విద్వేషాలు తొలగిపోవాలి, పదేళ్లలో మనమంతా తలెత్తుకుని నేలకు కొట్టిన బంతిలాగా ధీమాగా నిలబడి భవిష్యత్తుని శాసించుకోవాలి, ఈ జాతిలో, భరతజాతిలో తెలుగు ప్రజల భవిష్యత్తుని ఇముడ్చుకోవాలి, ప్రపంచంలో తలెత్తుకుని బతకాలి. అందుకోసం అధ్యక్షా, *Tall men, Sun crowned, Who live above the fog in public duty, and in private thinking* కావాలి. అలాంటి మనుషులు... ఉన్నారు! కానీ ఆ మనసుల్లో ఉన్న ఆ మనస్తత్వాన్ని బైట పెట్టి, ఈ *lust of office, spoils of office* ని పక్కనపెట్టి రాజకీయ ఎత్తుగడగా కాకుండా, కోట్లమంది ప్రజల భవిష్యత్తు అన్నటువంటి ఆలోచనతో ఉండేటువంటి రాజకీయం వస్తుందని, పరిపాలన వస్తుందని, ఈ యువత రాజకీయాన్ని ప్రేమించి, గౌరవించే రోజు త్వరలో వస్తుందని, ఈ యువత తమ భవిష్యత్తుని తాము శాసించుకుంటారని, ఈ యువతకి అందమైన భవిష్యత్తునిచ్చి ఈ డెమోగ్రాఫిక్ డివిడెండ్‌ని, ఈ పెద్ద జనాభా, యువత జనాభా అతి ఎక్కువగా ఉన్న దేశం, ఈ డెమోగ్రాఫిక్ డివిడెండ్ డెమోగ్రాఫిక్ నైట్‌మేర్‌గా మారకుండా, జనాభా ఎక్కువ ఉండటం ఒక పీడకలగా కాకుండా, ఈ దేశానికి ఒక మహత్తర శక్తిగా ఈ యువతని తయారుచేసే ఏర్పాటు జరుగుతుందని ఆశిస్తూ అధ్యక్షా, ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నాను. ◆

# మార్పునకు సమయమిదే...

దేశంలో అసత్యపు రాజకీయం రాజ్యమేలుతోందని, ఏదో రకంగా ప్రజల్లో భయాందోళనలు సృష్టించి తద్వారా లబ్ధిపొందేందుకు పార్టీలు విన్యాసాలు చేస్తున్నాయని లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. “నువ్వంత తిన్నావంటే.. నువ్వింత తిన్నావు అంటూ నాయకులు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇలాంటి రాజకీయమే కావాలా? లేదా అన్ని రకాలుగా మేలు జరిగేలా చూసే రాజకీయం కావాలో తేల్చుకొనే సమయం ఆసన్నమైంది” అని ఆయన తెలిపారు. ఇందిరాపార్కు వద్ద లోక్‌సత్తా రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త రాజకీయం కోసం యువత, మహిళలు ముందుకొస్తే అధికారం అనే ముళ్ల కిరీటాన్ని అందుకోవడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రం ఒకటిగా ఉన్నా లేదా విడిపోయినా రానున్న ఎన్నికల్లో 294 శాసనసభ స్థానాల్లో పోటీ చేస్తామని జేపీ స్పష్టం చేశారు. రానున్న 4 నెలల సమయాన్ని తనకిస్తే అందమైన భవిష్యత్తును ప్రజలకందిస్తానన్నారు. అన్ని పార్టీలు ప్రాంతాల వారీగా విడిపోయిన తరుణంలో అన్ని ప్రాంతాలకు చెందిన పార్టీ కార్యకర్తలు ఈ సభకు హాజరుకావడం గొప్ప విషయమన్నారు. “ఇతరుల మర్యాదను పిరికితనంగా భావించవద్దు. ప్రస్తుతం లోక్‌సత్తాకు ఆగ్రహం వచ్చింది. వ్యవస్థను మార్చేందుకు ప్రయత్నాన్ని ముమ్మరం చేయనుంది” అని జేపీ పేర్కొన్నారు. లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వీయ ప్రయోజనాల కోసం పార్టీలు నాలుగున్నరేళ్లుగా రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చాయన్నారు. తెలంగాణ వస్తుందంటేనే తెరాస వణికిపోతుందని చెప్పారు. సమైక్యాంధ్ర ముసుగులో వైకాపా అధికారం కోసం గోతికాడ నక్కలా కాచుకొని కూర్చుందన్నారు.

# పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు ఆంధ్రప్రదేశ్ బిల్లుకి సవరణలు చేయాలని రాష్ట్రపతికి జేపీ లేఖ

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుని పార్లమెంటుకి సిఫార్సు చేసే ముందు, రాష్ట్ర విభజన వల్ల తలెత్తే ప్రతికూల పర్యవసానాల్ని, నష్టాల్ని, అవశేష ఆంధ్రప్రదేశ్ న్యాయమైన ఆందోళనల్ని పరిష్కరించే సవరణల్ని చేర్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కోరారు. "పార్లమెంటు గనక ఇప్పుడు రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల న్యాయమైన ఆందోళనల్ని పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా, ముందుచూపు లేకుండా వ్యవహరిస్తే, అది తీవ్ర పరాయీకరణ భావనకు, ఉద్రిక్తతలకు, ఘర్షణ వాతావరణానికి దారితీసి భారత ప్రజల మధ్య ఐక్యతా భావాన్ని బలహీనపరుస్తుంది. కాబట్టి, ఈ ప్రక్రియ ప్రాంతాల మధ్య, రాష్ట్రాల మధ్య, జాతీయ స్థాయిలోనూ వైషమ్యాలకు దారితీయకుండా ఉండటం అవసరం" అని జేపీ పేర్కొన్నారు.

**రాష్ట్రంలోని సంక్షోభ తీవ్రతని వివరిస్తూ, లోక్‌సత్తా పార్టీ ప్రతిపాదించిన నిర్దిష్ట పరిష్కార సవరణల్ని పేర్కొంటూ రాష్ట్రపతికి జేపీ రాసిన లేఖను పార్టీ ప్రధాన కార్యాలయంలో కటారి శ్రీనివాసరావు, ఇతర నేతలు మీడియాకు విడుదల చేశారు.**

**రాష్ట్రపతికి జయప్రకాష్ నారాయణ్ రాసిన లేఖ స్థూల పాఠం:**

**గౌరవనీయ రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ గార్కి,**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2013ను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ జనవరి 30, 2014న ఒక తీర్మానాన్ని ఆమోదించింది. రాష్ట్రంలోని మెజారిటీ ప్రజలలో నెలకొన్న తీవ్ర భయాందోళనలకు ఇది అద్దం పదుతోంది. దురదృష్టవశాత్తూ, రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో విపరీత ఉద్వేగభరిత వాతావరణం ఉంది. ఆదిమ మానవ భావోద్వేగాలను, ఆటవిక భయాందోళనలను రెచ్చగొట్టినప్పుడు, మనకు సంక్షోభ పరిస్థితి ఏర్పడుతుంది. రాష్ట్ర, దేశ ప్రయోజనాల దృష్ట్యా దీర్ఘకాల సంక్షుభిత వాతావరణాన్ని తొలగించటం చాలా ముఖ్యం.

ప్రత్యేక రాష్ట్రం కావాలన్న తెలంగాణ ప్రాంత ప్రజల ఆకాంక్ష చాలా ప్రస్ఫుటంగా కనిపిస్తుండగా, రాష్ట్రం ఏర్పాటుకి అనుసరిస్తున్న పద్ధతులు, విధానం మాత్రం అత్యంత లోపభూయిష్టంగా ఉన్నాయి:

- పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రారంభించలేదు. ఇది రాజ్యాంగ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. గతంలో అనుసరించిన సంప్రదాయాలు, స్థిరపరిచిన పద్ధతులు, విధానాలకు కూడా ఇది వ్యతిరేకంగా ఉంది. 1950 తర్వాత అనేక రాష్ట్రాలు ఏర్పడ్డాయి. కానీ అంతకు ముందున్న రాష్ట్రాల శాసనసభల ముందస్తు ఆమోదంతో, విస్పష్టమైన ఒప్పందంతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ వంటి ఒక పెద్ద రాష్ట్రాన్ని రాష్ట్ర శాసనసభ ఆమోదం లేకుండా విభజించాలని ప్రయత్నించటం మాత్రం ఇదే మొదటిసారి.

- రాయలసీమ, తెలంగాణ, కోస్తాంధ్ర - మూడు ప్రాంతాలకు చెందిన ఎన్నికైన ప్రజాప్రతినిధులు, స్టేక్ హోల్డర్ల మధ్య చర్చలు, సంప్రదింపుల ద్వారా ఒక ఒప్పందాన్ని కుదిర్చే ప్రయత్నం ఎక్కడా చేయలేదు.

- విభజన పర్యవసాలైన ఆదాయ లోట్లు, అభివృద్ధి అవసరాలు, వనరుల పరిమితులను పరిష్కరించేందుకు తగిన ఏర్పాట్లను బిల్లులో పొందుపరచలేదు.

రాష్ట్ర జనాభాలో సుమారు 60శాతం మేర ఉన్న కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలకి, గ్రేటర్ హైదరాబాద్ నగర జనాభాలో గణనీయ సంఖ్యలో ఉన్న ప్రజానీకానికి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై తీవ్రమైన అభ్యంతరాలున్నాయి.

ఈ పరిస్థితులలో, ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల ప్రయోజనాలనూ సామరస్యంగా సర్దుబాటు చేయటం అత్యంత కీలకం. పార్లమెంటు గనక ఇప్పుడు రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల న్యాయమైన ఆందోళనల్ని పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా, ముందుచూపు లేకుండా వ్యవహరిస్తే, అది తీవ్ర పరాయీకరణ భావనకు, ఉద్రిక్తతలకు, ఘర్షణ వాతావరణానికి

దారితీసి భారత ప్రజల మధ్య ఐక్యతా భావాన్ని బలహీన పరుస్తుంది. కాబట్టి, ఈ ప్రక్రియ ప్రాంతాల మధ్య, రాష్ట్రాల మధ్య, జాతీయ స్థాయిలోనూ వైషమ్యాలకు దారితీయకుండా ఉండటం అవసరం.

గ్రేటర్ హైదరాబాద్ వల్ల ఆదాయాల్ని కోల్పోవటం వల్ల అవశేష ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న ఆదాయ ఒడిదుడుకులను పరిష్కరించటం అత్యంత ముఖ్యమైన సవాలు. 2012-13లో ప్రాంతాల వారీగా, ఆదాయవ్యయాల విశ్లేషణను చూస్తే, హైదరాబాద్‌లో రూ.12,854 కోట్ల మిగులు ఆదాయం ఉందని, తెలంగాణ (హైదరాబాద్‌ను మినహాయించి), రాయలసీమ వరసగా రూ. 8,407 కోట్లు, రూ.7,005 కోట్లు లోటుతో ఉన్నాయని తేలుతుంది. హైదరాబాద్ తెలంగాణలో భాగంగా ఉంటుందని బిల్లు ప్రతిపాదిస్తున్నందున, రాజధాని నగరంలోని ఆదాయాల మిగులు తెలంగాణలోని లోటును పూడ్చగలుగుతాయి, ఇంకా మిగులు కూడా ఉంటుంది. అయితే, అవశేష ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రమైన ఆర్థిక ఒడిదుడుకులు, ఆదాయ లోటు ఉంటాయి. రాయలసీమలోని లోటే ఇందుకు ప్రధాన కారణం. ఈ ఆర్థిక సవాలును ఎదుర్కోవటానికి రెండే ఆచరణాత్మక పరిష్కారాలున్నాయి. రాయలసీమను తెలంగాణ రాష్ట్రంలో భాగంగా చేయటం, దీనివల్ల రాయలసీమ లోటును హైదరాబాద్ నగర మిగులు ఆదాయాలతో పూడ్చవచ్చు. ప్రత్యామ్నాయంగా, ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలలాగా రాయలసీమను ప్రత్యేక ప్రతిపత్తి ప్రాంతంగా చేసి, రెవిన్యూ లోటును సరిచేయటానికి ప్రత్యేక కేంద్ర గ్రాంట్లను ఇచ్చి, రాయలసీమ ఆదాయ లోట్లను పూడ్చటానికి ప్రత్యేక సంస్థాగత ఏర్పాట్లను చేయాలి.

రాష్ట్ర విభజన వల్ల తలెత్తే ప్రతికూల పర్యవసానాలను, అవశేష ఆంధ్రప్రదేశ్ ప్రజల న్యాయమైన ఆందోళనల్ని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కూడిన, లోతైన, సమగ్రమైన ప్రయత్నం కావాలి. కాబట్టి, బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు తెలుగు ప్రజలందరి, ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల ప్రయోజనాలను పరిరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ముఖ్యంగా, ఈ దిగువ ఏడు అంశాలనూ బిల్లులో చేర్చేలా చర్యలు తీసుకోవాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను:

1. రాయలసీమకు చట్టబద్ధంగా ప్రత్యేక ప్రతిపత్తి ప్రాంత గుర్తింపునిచ్చి, ఆ ప్రాంత ఆదాయ లోట్లను కేంద్ర నిధుల ద్వారా పూర్తిస్థాయిలో భర్తీ చేయాలి. ప్రత్యేక ప్రతిపత్తి రాష్ట్రాలకిస్తున్న కార్పొరేట్ ఆదాయ పన్ను, ఎక్సయిజ్ పన్ను మినహాయింపుల్ని రాయలసీమకు కూడా విస్తరించాలి.

2. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలతో కూడిన ఉత్తర కోస్తాంధ్రను స్వయంప్రతిపత్తిగల ప్రాంతీయ కౌన్సిల్‌గా మార్చి, ఆర్థికాభివృద్ధికి తగినన్ని కేంద్ర నిధుల్ని, వనరుల్ని కేటాయించాలి.

3. కృష్ణా డెల్టా ప్రాంత మౌలిక వసతుల అవసరాల్ని తీర్చటానికి రామాయపట్నం మేజర్ పోర్టుని కేంద్ర ప్రభుత్వ రంగ పరిధిలో చేపట్టాలి.

4. పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టుకు సంబంధించి అన్ని అనుమతుల్నీ, క్లియరెన్సుల్నీ తదనంతర రాష్ట్రాల నుంచి పొందినట్టుగా పరిగణించి, ముంపు ప్రాంతాలను అవశేష ఆంధ్రప్రదేశ్‌లో కలపాలి.

5. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలలో కృష్ణా మిగులు జలాల మీద ఆధారపడి కడుతున్న సాగునీటి ప్రాజెక్టులకు తదనంతర రాష్ట్రాలు ఆమోదం లభించినట్టుగా పరిగణించి, భవిష్యత్తులో ఎటువంటి అభ్యంతరాల కారణంగా వాటిని అడ్డుకోకుండా ఏర్పాట్లు చేయాలి.

6. గ్రేటర్ హైదరాబాద్‌ని ఉమ్మడి రాజధానిగా చేయటానికి ఆచరణాత్మకమైన ఏర్పాట్లు చేయాలి. పుట్టిన ప్రాంతంతో సంబంధం లేకుండా పౌరులందరికీ ఆర్థిక భద్రత, రక్షణను, అన్ని రాజ్యాంగ హక్కులనూ పూర్తిగా అనుభవించేందుకు చట్టపరమైన ఏర్పాట్లనూ బిల్లులో చేర్చాలి.

7. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలలో ఏర్పాటు చేస్తామని బిల్లులో ప్రతిపాదించిన విద్య, మౌలిక వసతుల ప్రాజెక్టులకు, తిరుగులేని గ్యారంటీలు, మూడు నుంచి ఐదేళ్ల పాటు నిర్దిష్ట కాలవ్యవధి, విధిగా కేంద్ర ప్రభుత్వ సాయం అందిస్తూ, భారత కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి ఈ వ్యయమంతటినీ ఇచ్చే ఏర్పాటుని చట్టంలో చేయాలి.

రాష్ట్రపతిగా మీరు రిపబ్లిక్‌కి మాత్రమే కాకుండా పార్లమెంటుకి కూడా అధిపతి. పార్లమెంటు ఉభయ సభల సభ్యులు, రాష్ట్రాల శాసనసభల సభ్యులు కూడా మిమ్మల్ని ఎన్నుకున్నందున మీరు కేంద్రానికి, రాష్ట్రాలకు కూడా ప్రాతినిధ్యం వహిస్తారు. సుప్రీంకోర్టుతో పాటు మీరు కూడా రాజ్యాంగం, ఫెడరలిజంకు పరిరక్షకులు.

కాబట్టి, ఆంధ్రప్రదేశ్ సంక్షోభానికి సమగ్ర, సామరస్య పరిష్కారానికి, ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలలో భవిష్యత్తులో శాంతి, సామరస్యత, అభివృద్ధి నెలకొనేందుకు ఈ చర్యల్ని, ఇతర చర్యల్ని తీసుకోవాలని మేం మిమ్మల్ని కోరుతున్నాం. ◆

# అసెంబ్లీ ఎన్నికల వ్యూహాన్ని ప్రకటించిన లోక్‌సత్తా

- అభ్యర్థుల మొదటి జాబితాను ప్రకటించిన మొదటి పార్టీ, SYC (మీ అభ్యర్థిని సూచించండి) వినూత్న కార్యక్రమం
- పార్టీలో చేరండి, నిధులు విరాళాలివ్వండి అని ఐదు రోజుల క్రితం జేపీ ఇచ్చిన పిలుపునకు **win.loksatta.org** ద్వారా లోక్‌సత్తా పార్టీకి విశేష స్పందన
- మార్పును ముందుకు నడిపించాల్సిన సమయం ఆసన్నమైందని ప్రజలకు జేపీ పిలుపు

2014 ఎన్నికలకు లోక్‌సత్తా పార్టీకి మద్దతివ్వాలని ఇచ్చిన పిలుపునకు ప్రపంచవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోంది. ప్రచారంలో పాల్గనటానికి, నిధులు ఇవ్వటానికి ప్రజలు పెద్దఎత్తున ముందుకొస్తున్నారు.

గత 5 రోజులుగా 1000 మందికి పైగా వలంటీర్లు పార్టీలో చేరారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయుల నుంచి **win.loksatta.org** ద్వారా సుమారు రూ. 30లక్షలు విరాళాలు వెల్లువెత్తాయి. మరో రూ. 3 కోట్లకు హామీలు వచ్చాయి.

చట్టబద్ధంగా, విదేశాలలోని భారతీయ పౌరుల నుంచి వచ్చే నిధులను చూశాక, ప్రభుత్వం చట్టవిరుద్ధంగా, ఆకస్మికంగా విరాళాల మార్గాన్ని మూసివేసింది. సాంప్రదాయ రాజకీయ పార్టీలకి లెక్కలేనంత నల్లధనం ప్రవహిస్తుంటే వదిలేస్తున్న గుడ్డి సర్కారు, కనీసం నోటీసు కూడా లేకుండా చట్టబద్ధంగా విరాళాలు వచ్చే మార్గాన్ని మాత్రం అడ్డుకుంది. మంచి రాజకీయం కోసం, అవినీతి రహిత రాజకీయం కోసం లోక్‌సత్తా చేస్తున్న చట్టబద్ధ పోరాటాన్ని అడ్డుకోవటం దుర్మార్గం. అవినీతి నిరోధానికి చట్టాల గురించి చిలకపలుకులు పలుకుతున్న యూపీయే ప్రభుత్వం, నిజాయతీగా, పన్ను రాయితీతో, పారదర్శకంగా నిధులు సేకరించే మార్గాల్ని అడ్డుకోవటం ద్వారా అవినీతి రాజకీయాన్ని పెంచిపోషిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి పిచ్చివేషాల్ని మానేయాలని, తన హేయమైన అన్యాయాన్ని వెంటనే సరిచేయాలని డిమాండ్ చేస్తున్నాం.

ప్రజలు తమ నియోజకవర్గాలకు లోక్‌సత్తా అభ్యర్థులను సూచించాలనే పిలుపే ఎస్‌వైసి అంటే. దేశంలోనే ఈ తరహాలో మొదటిసారిగా చేపడుతున్న కార్యక్రమమిది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో లోక్‌సత్తా పార్టీ స్థానాన్ని సుస్థిరం చేసే కార్యక్రమమిది. వేలం పాటలో ఎవరెక్కువ డబ్బు వెదజల్లి పాడుకుంటే, వారికే టికెట్లు కేటాయించే సాంప్రదాయ రాజకీయ పార్టీలకు విరుద్ధంగా, అసెంబ్లీలో తమకు ప్రాతినిధ్యం వహించగల సత్తా గల అభ్యర్థులను గుర్తించే అవకాశాన్ని ఓటర్లకు ఇస్తూ లోక్‌సత్తా పార్టీ ప్రజల చుట్టూ తిరిగే రాజకీయాన్ని ఆచరణలో చూపిస్తోంది.

"గత దశాబ్దకాలంగా భారతదేశంలో మార్పు వేళ్లూనుకోవటానికి లోక్‌సత్తాయే ప్రధాన కారణం. తెలుగునాట రాజకీయాలలో ఇదో కీలక సందర్భం. ఈపార్టీ ఆపార్టీ అని తేడా లేకుండా ఈవేళ రాష్ట్రంలోని అన్ని పార్టీలలో పాతుకుపోయి వున్న భయంకరమైన, దుర్మార్గమైన రాజకీయం నుంచి రక్షించగల ఏకైకశక్తిగా లోక్‌సత్తా వైపు తెలుగు వారందరూ చూస్తున్నారు" అని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో అన్నారు.

లోక్‌సత్తా సగర్వంగా తన అభ్యర్థుల మొదటి జాబితాను విడుదల చేస్తోంది. లోక్‌సత్తా కనీస అర్హతలుగా చెప్పే నిజాయతీ, నిబద్ధతతో పాటు రాష్ట్రాభివృద్ధిని ఉజ్వల భవిష్యత్తు దిశగా నడిపించే శాసనసభ్యులు కాగల సామర్థ్యం కలిగినవారు వీరంతా.

"సాటిలేని అభ్యర్థులను ప్రకటించే దమ్ము మాకుంది. ఇతర పార్టీలు కూడా అలా చేయాలని, అర్హతల్లో, నిజాయతీలో, నిబద్ధతలో మా అభ్యర్థులతో పోటీపడాలని మేం సవాలు చేస్తున్నాం. ప్రజల పరిశీలనకు, ప్రజల సేవకు లోక్‌సత్తా తరహాలో తమ అభ్యర్థులను ముందుంచాలని కాంగ్రెస్ పార్టీకి, ఆ తానులో ముక్కలుగానే ఉన్న వైఎస్ఆర్ సీపీ, తెలుగుదేశం, టీఆర్ఎస్ వంటి పార్టీలకు మేం సవాలు విసురుతున్నాం" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ◆

# అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల

**20**14 ఎన్నికలలో రాష్ట్ర అసెంబ్లీకి పోటీ చేసే లోక్‌సత్తా పార్టీ అభ్యర్థుల తొలి జాబితాను 25 మందితో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి సురేంద్ర శ్రీవాస్తవ విడుదల చేశారు.

1. కూకట్‌పల్లి :
   **డా॥ జయప్రకాష్ నారాయణ్**
   లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు
2. శేరిలింగంపల్లి :
   **కటారి శ్రీనివాసరావు**
   లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు
3. ఎల్.బి.నగర్ :
   **దోసపాటి రాము**
   లోక్‌సత్తా పార్టీ జిహెచ్‌యంసి అధ్యక్షుడు
4. సనత్‌నగర్ : **సాగి హైమా ప్రవీణ్**
5. జూబ్లీహిల్స్ : **బొంతు సాంబిరెడ్డి**
6. రాజేంద్రనగర్ : **కొత్త సోల్కర్ రెడ్డి**
7. ముషీరాబాద్ : **కొంగర గంగాధర రావు**
8. నాంపల్లి : **కాంతిమతి కన్నన్**
9. మల్కాజిగిరి : **దిలీప్ శంకర్ రెడ్డి**
10. ఖమ్మం : **పి. రవి మారుత్**
    లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
11. ఎల్లారెడ్డి : **డా॥ మర్రి రాం రెడ్డి**
    లోక్‌సత్తా పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు
12. సిద్దిపేట : **తుమ్మనపల్లి శ్రీనివాస్**
    లోక్‌సత్తా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు
13. హుస్నాబాద్ : **బొల్లం రవి**
    సముద్రాల గ్రామ సర్పంచ్
14. నంద్యాల : **డా॥ శౌరి రెడ్డి**
15. భూపాలపల్లి : **మహేశ్వరపు గట్టయ్య**
    లోక్‌సత్తా పార్టీ వరంగల్ ఇంఛార్జి



16. తిరుపతి : **ఎం. సిద్ధయ్య నాయుడు**
లోక్‌సత్తా పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు

17. కాకినాడ సిటీ : **వై.డి రామారావు**
లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

18. విశాఖనార్త్ : **భీశెట్టి అప్పారావు బాబ్జీ**
లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి

19. విశాఖ ఈస్ట్ : **నాయుడు వేణుగోపాల రావు**
లోక్‌సత్తా పార్టీ జీవీఎంసీ అధ్యక్షుడు

20. నెల్లూరు : **నర్రా శ్రీధర్**
లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి

21. గూడూరు : **కె.వి కృష్ణయ్య**

22. సూళ్లురుపేట : **జువ్విగుంట వెంకటేశ్వర్లు**

23. పెడన : **చెన్నుపాటి వజీర్**
లోక్‌సత్తా పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు

24. గుంటూరు వెస్ట్ : **జె.ఐరామ్మూర్తి**
లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి

25. ఒంగోలు : **అల్లు శివ రమేష్ రెడ్డి**
లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అవినీతి, కుటుంబ, పెత్తందారీ, విభజించి పాలించే రాజకీయం వల్ల తల్లడిల్లుతున్న తెలుగునేలకు ఒక మార్గం చూపటాన్ని ఒక సవాలుగా తీసుకుని లోక్‌సత్తా పార్టీ 2014 ఎన్నికల బరిలోకి దిగుతోందని, 'ఈల' (విజిల్) గుర్తుతో లోక్‌సత్తా పార్టీ రాష్ట్రంలోని 294 నియోజకవర్గాలలోనూ పోటీచేస్తుందని జేపీ తెలిపారు. ఇన్నేళ్లలో లోక్‌సత్తా చేసిన కృషి, రాష్ట్రంలో సంక్షోభాన్ని పరిష్కారం తెచ్చేందుకు మిగిలిన పార్టీలేవీ చేయనిరీతిలో చిత్తశుద్ధితో లోక్‌సత్తా చేస్తున్న ప్రయత్నం ప్రజలకు తెలుసని, ఖచ్చితంగా లోక్‌సత్తా పార్టీ విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఈ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ, ఎన్నికలలో పోటీచేస్తున్న అభ్యర్థులు పాల్గొన్నారు. ◆

# మన సినీ పరిశ్రమ, సమాజం ఒక ధృవ తారను కోల్పోయాయి : జేపీ



అక్కినేని నాగేశ్వరరావు మృతితో మన సినీ పరిశ్రమ, సమాజం ఒక ధృవ తారను కోల్పోయాయని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

"మన సమాజ పరిణామంలోని అత్యంత కీలకదశలో అక్కినేని జీవితం, కెరీర్ కొనసాగాయి. కళల ప్రపంచంలో ఆయన అసాధారణ ప్రభావాన్ని చూపారు. మూడు తరాల తెలుగు ప్రజలను ప్రభావితం చేశారు" అని జేపీ అన్నారు.

"తన కీర్తి ప్రతిష్ఠల్ని, సంపదను ఎంతో సునాయాసంగా, వినమ్రతతో, జీవితం పట్ల హేతుబద్ధ దృక్పథంతో అక్కినేని ముందుకు తీసుకెళ్లారు. వ్యక్తిగత, ప్రజా జీవితంలో ఆయన పాటించిన విలువలు కోట్లాదిమంది ప్రజలకు స్ఫూర్తిదాయకాలు.

"అక్కినేని జీవితాన్ని, కృషిని ఓ ఉత్సవంలా జరుపుకోవాలి తప్ప విషాదభావన రానీయకూడదు. తీవ్రమైన ప్రాణాంతక జబ్బుతో బాధపడినా, తాను జీవించినట్టే హుందాగా, స్థితప్రజ్ఞతతో ఆయన మరణించారు.

"ఒక అసాధారణ జీవితానికి నివాళులర్పించే లక్షలాది అభిమానులలో నేను కూడా ఒకడ్ని" అని అక్కినేని ఇంటికి వెళ్లి ఆయన కుటుంబసభ్యుల్ని పరామర్శించిన అనంతరం జేపీ అన్నారు. ◆




# 'మద్య'నేతల్ని దించేద్దాం

- విధానం మార్చేస్తాం... అధికారమివ్వండి
- మండలానికో డీ-ఎడిక్షన్ సెంటర్
- మద్యం బాధితులతో సామూహిక సత్యాగ్రహంలో జేపీ
- బాధితులను దత్తత తీసుకున్న జేపీ, కార్యకర్తలు

లోక్‌సత్తా పార్టీకి అధికారం ఇస్తే మద్యం విధానాన్ని సమూలంగా మార్చివేస్తానని, మద్యం బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు. మద్యం బాధిత కుటుంబాలతో కలిసి సికింద్రాబాద్ కంటోన్మెంట్ గార్డెన్‌లో లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన సామూహిక సత్యాగ్రహంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మద్యం బాధిత కుటుంబాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. వారిని జేపీ ఆప్యాయంగా పలుకరించి, వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మీకు అండగా నిలవకపోయినా, లోక్‌సత్తా మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం జేపీ మాట్లాడుతూ.. 'కొన్ని బాధలు ప్రకృతి కారణంగా వస్తే, మద్యం బాధలు మాత్రం ప్రభుత్వం.. రాజకీయ పార్టీలు.. పాలకుల వలన రావడం దురదృష్టకరం' అన్నారు. మనిషికి మొట్టమొదట తాగుడు అలవాటయ్యేది ఎన్నికల్లోనేనని తెలిపారు. ఎన్నికల్లో తమ వెంట జనాన్ని తిప్పుకొంటూ, నాయకులు వారిని తాగుడుకు అలవాటు చేస్తున్నారని ఆ తర్వాత జనం ఆ మహమ్మారిని నుంచి బయటపడ లేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు, భవిష్యత్తులో పగ్గాలు చేపట్టే ఆయన వారసుడు లోకేష్, వైసీపీ నేత జగన్, ఆయన తల్లి, చెల్లి, టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు, మేనల్లుడు... ఒకరేమిటి నాయకులంతా మద్యాన్ని ప్రోత్సహించేవారేనని ధ్వజమెత్తారు. మద్యాన్ని బంద్ చేసి, ప్రజల జీవితాలను బాగు చేయాలన్న ధ్యాస ఎవ్వరికీ లేదని మండిపడ్డారు. 'దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 1984, 85ల్లో సంపూర్ణ మద్య నిషేధం ప్రకటించినప్పుడు ప్రభుత్వానికి దాని ద్వారా రూ. 1000 కోట్లు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ. 21 వేల కోట్ల ఆదాయం వస్తుంది. అమ్మకం పన్ను తర్వాత అత్యధిక రాబడి మద్యం ద్వారానే వస్తోంది. అయితే మద్యం కారణంగా 70 లక్షల కుటుంబాలు, మూడు కోట్ల మంది ప్రజలు దుర్భర జీవనం గడుపుతున్నారు. ప్రభుత్వానికి ప్రజలు ముఖ్యమా? ఆదాయం ముఖ్యమా?' అని జేపీ ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 28

వేల కోట్లను సంక్షేమ పథకాలకు వెచ్చిస్తుంటే, రూ. 21 వేల కోట్లు మద్యం ద్వారా ప్రజల సొమ్మును పిండేస్తుందని జేపీ విమర్శించారు. లోక్‌సత్తా పార్టీకి అధికారం ఇస్తే... మద్యం పాలసీని సమూలంగా మారుస్తామని, ప్రతి మండలంలో ఒక డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, మద్యం షాపులు ఎక్కడ ఉండకూడదో నిర్ణయించే అధికారాన్ని గ్రామ కమిటీలు, వార్డు కమిటీలకు అప్పగించి, చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించారు. లైసెన్సు లేని దుకాణాలపై దాడులు చేసి, తొలగించే అధికారం గ్రామ, వార్డు కమిటీలకు కల్పిస్తామని, పోలీసు, ఎక్సైజు విభాగాలు వారికి సహకరించేలా చూస్తామని చెప్పారు. కల్తీ కల్లు, గుడుంబా, కాపు సారాలను ధ్వంసం చేసే అధికారం గ్రామపంచాయితీలోని మహిళలకు కల్పిస్తామని పేర్కొన్నారు. మద్యం బాధిత కుటుంబాలకు సమాజం తరపున, రాజకీయ పార్టీల తరపున క్షమాపణ చెబుతున్నానన్నారు. బాధిత కుటుంబాలను జేపీతో సహా, నాయకులు, కార్యకర్తలు దత్తత తీసుకున్నారు. తాగుడు కారణంగా భర్త చనిపోయిన వారికి రూ. 2 వేలు పింఛన్ ఇవ్వాలని, మద్యం బాధిత కుటుంబాల పిల్లలకు ఉచితంగా హాస్టల్ వసతి, చదువు కల్పించాలనేది తమ పార్టీ డిమాండ్ అని జేపీ స్పష్టం చేశారు. ◆

**మద్యంపై లోక్‌సత్తా మహోద్యమం**

# మద్యం బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

## శ్రీకాకుళంలో...

రాష్ట్రంలో 70 లక్షల కుటుంబాలు మద్యం బారినపడి రోడ్డున పడ్డాయని ఆ కుటుంబాలను ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు కె.పోలినాయుడు డిమాండ్ చేశారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక పురపాలక కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం కార్యాలయం వద్ద సామూహిక సత్యాగ్రహం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలినాయుడు మాట్లాడుతూ మద్యం విక్రయాలనే ప్రధాన ఆదాయంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాలతో ఆటలాడుకుంటోందన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా తమ పార్టీ సామూహిక సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా॥ డి.విష్ణుమూర్తి మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు ప్రజలకు స్వచ్ఛమైన నీటిని కూడా అందించలేని దుస్థితిలో ఉండటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.రాంబాబు, కె.మోహనరావు, పి.ప్రవీణ్‌కుమార్, ఆర్.గాంధీ, ఎస్.రమణ, ఎస్.ప్రవీణ్, బి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో...

మద్యానికి బానిసలై మరణించిన వారి కుటుంబాలకు నెలకు రూ. 2 వేల చొప్పున ప్రభుత్వం పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు చెన్నుపాటి వజీర్ విజ్ఞప్తి చేశారు. మద్యంపై కఠిన నియంత్రణ, మద్యం బాధిత కుటుంబాలకు పరిహారం, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం, యువతకు ఉద్యోగావకాశాలు తదితరాలను కోరుతూ లోక్‌సత్తా ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ ఎదుట సామూహిక సత్యాగ్రహం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర శాఖ అధ్యక్షుడు బి.అశోక్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశంలో...

గాంధీజీ వర్ధంతి సందర్భంగా తాగునీరు, పారిశుద్ధ్యం సమస్యలను పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ యువసత్తా ఆధ్వర్యంలో నగర పంచాయితీ ఎదుట శాంతియుత ధర్నా నిర్వహించారు. ప్రతి ఇంటికి ఉచితంగా శుద్ధచేసిన మంచినీరు అందించాలని ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు కె.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో ప్రజలు అనారోగ్యానికి

గురవుతున్నారని అన్నారు. పూసలవీధిలోని సిసి రహదారి నిర్మాణపనులు చేపట్టాలని మేనేజర్ కె.శేషఫణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శంకరాచారి, బి.విశ్వరూపాచారి, యువసత్తా సమన్వయకర్త సయ్యద్ ఫరూఖ్, డి.నాయబ్ రసూల్, మహిళాసత్తా అధ్యక్ష, కార్యదర్శులు జి.ప్రమీల, సి.హెచ్.సరస్వతీ పాల్గొన్నారు.

## చీపురుపల్లిలో...

ప్రభుత్వ విధానాలు పేద ప్రజలకు శాపంగా మారాయని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ బాధ్యుడు రెడ్డి లక్ష్మునాయుడు స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో సామూహిక సత్యాగ్రహం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యంకోరల్లో 70 లక్షల కుటుంబాలు చిక్కుకున్నాయని, బాధిత కుటుంబాలకు భరోసా పథకాన్ని అమలు చేయాలన్నారు. తక్షణమే గ్రామాల్లో ఉన్న గొలుసు దుకాణాలను నిర్మూలించాలన్నారు. రాష్ట్రంలో 60 శాతం వాధులకు కలుషిత తాగునీరే కారణమని, శుద్ధిచేసిన జలాన్ని ప్రజలకు అందించాలన్నారు. ప్రలోభాలు లేకుండా రైతులకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.సత్యనారాయణ, లోక్‌సత్తా పార్టీ నాయకులు ఆర్.దాలినాయుడు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఫత్తేఖాన్‌పేటలో...

రాష్ట్రంలో 70 లక్షల కుటుంబాలు మద్యం కోరల్లో చిక్కుకుని నాశనమవుతున్నాయని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీధర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మద్యం బారినపడి భర్తలను కోల్పోయిన మహిళలతో సామూహిక సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం ద్వారా ఏడా రూ. 20 వేల కోట్ల ఆదాయం పొందుతున్న ప్రభుత్వం ప్రజారోగ్యానికి కేవలం రూ. 7 వేల కోట్లు మాత్రమే కేటాయించి వారి ఆరోగ్యంతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మక్కెన అంకయ్యచౌదరి మాట్లాడుతూ బాధిత వితంతువులకు ప్రత్యేక పింఛన్‌గా రూ. 2 వేలు, వారి పిల్లలకు హాస్టల్ వసతితో కూడిన విద్య, మహిళలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బెల్టు షాపులు ఎత్తేసేవరకు ప్రభుత్వంపై పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కె.కోదండరామిరెడ్డి, ఎం.ఎస్.మణియాదవ్, వై.వి.కిషోర్, ఎస్.డి.రసూల్, పీవీఎల్. రవికుమార్, జి.శరత్‌కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలులో...

పేద ప్రజానీకం అనేక సమస్యలతో తల్లడిల్లిపోతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు అల్లు శివరమేష్ రెడ్డి విమర్శించారు. లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద జరిగిన సామూహిక సత్యాగ్రహ దీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విచ్చలవిడితగా మద్యం అమ్మకాలు చేస్తుండటంతో జిల్లాలో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మద్యం కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు నెలకు రూ. 2 వేల పెన్షన్‌తో పాటు వారి పిల్లలకు గురుకుల పాఠశాలల్లో చదివించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మద్యం బెల్టుషాపులను పూర్తిగా రద్దు చేసి, ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లోక్‌సత్తా పార్టీ సీనియర్ నేత గోపాలస్వామి మాట్లాడుతూ ప్రజానీకం అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పేదల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జేసీ యాకుబ్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు మహ్మద్ రఫీ, చప్పిడి రత్నకుమార్, డా॥ ఎన్.రాధాదేవి, కరీమున్నీసా, వరికూటి ఆంజనేయులు, రాము, కోటిరెడ్డి, రాజారెడ్డి, మారుతిప్రసాద్, చిరంజీవి, ఎస్‌కె.రఫీ తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో...

మద్యపానానికి వ్యతిరేకంగా మంగళగిరి పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో సామూహిక సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. గౌతమబుద్ధ రోడ్ పక్కన

# మద్యంపై లోక్‌సత్తా మహోద్యమం

ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బుల్లా వేణు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సామూహిక దీక్షలో పాల్గొన్నారు. శిబిరానికి ముఖ్య అతిథిగా వచ్చిన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.రాంమూర్తి ప్రసంగించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మంగళగిరి శాఖ మహిళ ఉపాధ్యక్షురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

## గుంటూరులో...

ఎన్నికల్లో మద్యం పంపిణీ చేసే పార్టీలు, నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలని లోక్‌సత్తా పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి జె.ఐరాంమూర్తి అన్నారు. లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సామూహిక సత్యాగ్రహ దీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న మద్యం విధానం వల్ల గుంటూరు నగరంలో సుమారు లక్ష కుటుంబాలు మద్యం కోరల్లో చిక్కుకుని అల్లాడుతున్నాయని అన్నారు. మద్యం మహమ్మారిపై ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలన్నారు. లోక్‌సత్తా పార్టీని గెలిపిస్తే పశ్చిమ నియోజకవర్గంలో మద్యం దుకాణాలు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మద్యం తాగి చనిపోయిన వ్యక్తి భార్యకు ప్రభుత్వం వితంతు పింఛన్‌గా నెలకు రూ. 2 వేలు అందజేయటంతోపాటు మద్యం బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించే ప్రత్యేక సంక్షేమ పథకాన్ని ప్రకటించాలని, పట్టణ ప్రాంతాల్లో డీ-ఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌వో నాగబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు గద్దె వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, సాంబయ్య, పద్మారాణి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్నంలో...

రాష్ట్రంలో మద్యం మూలంగా 70 లక్షల కుటుంబాలు వీధిన పడ్డాయని పాలకులు విధించిన శిక్షలకు ప్రజలు కష్టాలపాలవుతున్నారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మండిపడ్డారు. లోక్‌సత్తా పార్టీ, మద్యం బాధితుల సంయుక్త ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సామూహిక సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం అమ్మకాలకు, రాజకీయాలకు అవినాభావ సంబంధం ఉందని, ప్రజలను మద్యానికి బానిసలు చేసి వీరు రాజకీయాలు నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మద్యం కారణంగా భర్తలను కోల్పోయి లక్షలాది మంది మహిళలు వితంతువులుగా మారుతున్నా పాలకుల్లో మాత్రం ఎటువంటి చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉత్తర, తూర్పు అధ్యక్షులు గొట్టిపాటి సాంబశివరావు, ఎంఎస్ఎన్ మూర్తి, డా॥ నవీన్, సొండు కిరణ్, ఎం.ఐ.అహ్మద్, హర్ష, భాను తదితరులు పాల్గొన్నారు.

## పాలకొండలో...

బెల్టు షాపులను నిషేధించి, మద్యం విక్రయాలను నియంత్రించాలని లోక్‌సత్తా జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సామూహిక సత్యాగ్రహం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు ప్రజలకు శాపంగా మారాయన్నారు. రాష్ట్రంలోని మద్యం బాధిత కుటుంబాలకు తక్షణమే సహాయం అందేలా ప్రత్యేక సంక్షేమ పథకాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు పి.వైకుంఠరావు, పి.గౌరీశంకరరావు, జడ్డు బాలరాజు, బెజ్జిపురం చిన్నం నాయుడు, పొట్నూరు జగన్నాథం నాయుడు, పి.పద్మలత, కె.యోగిత, కె.ఆనంద్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరంలో...

లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట మద్యం బాధిత మహిళలతో, మహిళాసత్తా అధికార ప్రతినిధి ఐ.అనంతలక్ష్మి సామూహిక సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ముందుగా గాంధీ వర్ధంతి సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం విధానాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యువసత్తా జిల్లా అధ్యక్షుడు పాండ్రంకి వెంకటరమణ మాట్లాడుతూ, మద్యం బాధిత కుటుంబాలకు, రాజీవ్ యువకిరణాల బాధిత నిరుద్యోగులకు లోక్‌సత్తా అండగా

ఉంటుందన్నారు. వితంతువు పింఛన్ రూ. 200 నుంచి రూ. 2 వేలకు పెంచాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏజేసీ నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చింతలపూడి అప్పలరాజు, మహిళాసత్తా జిల్లా అధ్యక్షురాలు ఎం.సుభద్రాదేవి, మహిళాసత్తా ప్రతినిధులు పి.ఉదయగౌరి, ఆర్.పద్మావతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మొల్లేటి నాయుడు, కార్యదర్శి తిప్పాన కోటేశ్వరరావు, కాశీపతి, మాధవ, పవన్, బబ్లూ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## శృంగవరపుకోటలో...

గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎంఆర్ కార్యాలయం వద్ద లోక్‌సత్తా పార్టీ రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. లోక్‌సత్తా నియోజకవర్గ నాయకుడు దొడ్డి సూర్యారావు మాట్లాడుతూ గాంధీ ఆశయాలు మేరకు మద్యం నిషేధించాలని అన్నారు. మద్యపానం వలన అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్, రామలక్ష్మి, లోక్‌సత్తా నాయకులు పాల్గొన్నారు.

## పలాసలో...

లోక్‌సత్తా పార్టీ పిలుపుమేరకు పలాసలో ఆ పార్టీ ఆధ్వర్యాన సామూహిక సత్యాగ్రహం నిర్వహించారు. ముందుగా పలాస నియోజకవర్గం ఇన్‌చార్జి టి.మాధవరావు ఆధ్వర్యాన కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద సామూహిక సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. అనంతరం పలాస ఆర్టీసి కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో యువత మేలుకో, దేశాన్ని ఏలుకో, మద్యం బెల్టు షాపులను ఆపండి, హైవే మీద మద్యం విక్రయాలు నివారించండి, రోడ్డు ప్రమాదాలను నివారించండి, తదితర నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డా॥ ఆర్.గౌరీపతి, పి.అప్పయ్య, డి.శ్రీనివాసరావు, ఎన్.మధుసూదనరావు, ఎ.పాపారావు, కె.లోకనాథం, కె.కృష్ణారావు, ఆర్.దుర్యోధనరావు, ఎస్.అప్పారావు, మోహన్‌దాసు, ఎస్.హరిప్రసాద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## గజపతినగరంలో...

మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర ఈశ్వరరావు అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బి.టి. రమణానందం, జోగారావు, వర్మ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలులో...

మద్యం తాగి మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు నెలకు రూ. 2 వేలు ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓంకార్, నాయకులు ఎన్.జి.శంకర్, గద్వాల ఈరన్న, జయరామిరెడ్డి, వజ్జా వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, సూర్యకుమార్, అశోక్, నాగరాజులు డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ సమీపంలోని లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో బాధితులకు న్యాయం చేయాలని గాంధీ విగ్రహం వద్ద సామూహిక సత్యాగ్రహ దీక్ష చేపట్టారు.

## పత్తికొండలో...

జాతిపిత మహాత్మాగాంధీ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడని, ఆయన ఎంచుకున్న దారిలో ప్రతి ఒక్కరు నడుచుకోవడానికి కృషి చేయాలని లోక్‌సత్తా జిల్లా ఉపాధ్యక్షులు ఆనందాచారి, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు రామచంద్రయ్యశెట్టి, చిత్రాల శేఖర్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నియోజకవర్గ ఇన్‌చార్జి నాగేంద్ర, ప్రసాద్, శ్రీనివాసులు, పీర్‌మోద్దీన్, తుగ్గలి రంగస్వామి, లక్ష్మణస్వామి, కాశీం ఆర్యవైశ్య సంఘం నాయకులు లాయర్ సురేష్, చిత్రాల లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేటలో...

గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా నాయకులు మాదాసు భానుప్రసాద్ మాట్లాడుతూ వితంతు పెన్షన్లను రూ. 2 వేలకు పెంచాలని, గ్రామాలలో బెల్టుషాపులను ఎత్తివేయాలని, జాతీయ రహదారిపై ఉన్న దాబాలలో మద్యం విక్రయాలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మురికిపూడి ప్రసాద్, సాధిక్, కామినేని ఆంజనేయులు, సరిగమ కుమార్, ఖాదర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు. ◆

# ఇవి ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే



సనత్‌నగర్

బన్సిలాల్‌పేట్ డివిజన్‌లోని నీలం బాలయ్య దొడ్డిలో లోక్‌సత్తా పార్టీ మహిళాసత్తా ఆధ్వర్యంలో మద్యం బాధితుల భరోసా యాత్రను నిర్వహించారు. ఎలక్షన్ సమయంలో రాజకీయ నాయకుల మీటింగులకు ఉచితంగా మద్యాన్ని ఇచ్చి దానికి అలవాటు పడేలా చేసి, రోజు తాగటానికి వీలుగా మద్యం షాపులను ఇళ్ళ మధ్యలో పెట్టి ప్రభుత్వమే ప్రజలు మద్యానికి అలవాటు పడేటట్టు చేస్తోందని లోక్‌సత్తా సనత్‌నగర్ ఎం.ఎల్.ఎ. అభ్యర్థి హైమా ప్రవీణ్ అన్నారు. ఒకపక్క మహిళలను బంగారు తల్లులు అంటూనే మరో పక్క చిన్న వయసులోనే భర్తలను మద్యం రక్కసికి బలి అయ్యేలా చేస్తున్నారని కార్యదర్శి రాజీవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బన్సిలాల్‌పేట్ లోక్‌సత్తా డివిజన్ అధ్యక్షులు సాయి, మహిళా అధ్యక్షులు కస్తూరి, లావణ్య పాల్గొన్నారు.

# కలుషిత నీటి సరఫరా అరికట్టండి

కర్నూలు

నగరంలో కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని ప్రజాసంఘాల నాయకులు జి.ఈరన్న, బాలసాయి, కిరణ్, రవితేజ కోరారు. మున్సిపల్ కమిషనర్ పీవీవీఎస్ మూర్తికి వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లోక్‌సత్తా పార్టీ పిలుపుమేరకు వారు పంపిన ద్రావకం సీసాలలో నగరంలోని కొండారెడ్డి బురుజు, వెంకటరమణకాలనీ, సంతోష్‌నగర్, బాలాజీనగర్, మద్దూర్‌నగర్, బుధవారపేట, కల్లూరు ప్రాంతాల్లోని తాగునీటి కుళాయి నీటి శాంపిల్స్ సేకరించినట్లు తెలిపారు. వీటికి పరీక్షలు నిర్వహించగా కలుషిత నీరు సరఫరా అయినట్లు రుజువు అయిందన్నారు. కలుషిత నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని వారు కమిషనర్‌ను కోరారు.

# 'సాంఘికోద్యమాలకు స్ఫూర్తి డా॥ ముక్కామల'



నరసరావుపేట

పట్టణంలో ప్రథమ శస్త్ర చికిత్స నిపుణుడు, పలు సాంఘీకోద్యమాలకు స్ఫూర్తినిచ్చిన ధన్యజీవి డాక్టర్ ముక్కామల ఉమామహేశ్వరరావు అని పలు ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. రామరెడ్డిపేటలో డాక్టర్ ముక్కామల ఉమా మహేశ్వరరావు సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు ప్రజా సంఘాల నాయకులు ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మేళ్ళచెరువు వీరాంజనేయులు, రత్నాకరం రాము, ఎంవీ సుబ్బారావు, బొబ్బా ఆదినారాయణ, ఈదర గోపీచంద్, కరణం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

*డా॥ జేపీ నివాళి : ముక్కామల మరణం తనకెంతో విచారాన్ని కలిగించిందని లోక్‌సత్తా ఒక సుశిక్షితుడైన నిబద్ధత గల సేనాధిపతిని కోల్పోయిందని అన్నారు. కుటుంబసభ్యులకు, మిత్రులకు, సహచరులకు తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.*



ధర్నాచౌక్‌లో లోక్‌సత్తా బహిరంగ సభ



సృజిత్ ఆధ్వర్యంలో లోక్‌సత్తాలో చేరిన వరంగల్ యువత



లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం



శ్యామలకుంట బస్తీలో గణతంత్ర దినోత్సవం



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో నీటి పరీక్షలు




శ్రీకాకుళంలో నీటి పరీక్షలు




నెక్లెస్‌రోడ్‌లో యువ వలంటీర్ల ఓటర్స్ డే



తిరుపతిలో ఓటర్ల జాగృతి కార్యక్రమం

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on 1st February, 2014




To,

Book-Post

PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad